


మనోహరైః క్రీడనకైః అకృత్రిమం
బాలా ప్రమోదం లభతే నితాంతం.

మార్చి, 1966
25 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 10 మార్చి, 1966
సంచిక : 5 ఫాల్గుణ 1887 – చైత్ర 1888 శకం

ప్రధాన సంపాదకులు
టి. రామచంద్రరావు

సంపాదకులు :
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

పరాభవ ఉగాది శుభావసరాన పాఠకులకు
ప్రధాన సంపాదకుల శుభాకాంక్షలు

మొదటి చిత్రం.

చిన్నారి లోకంలో చిట్టిపాప
మనోహరైః క్రీడనకైః అకృత్రిమం
బాలా ప్రమోదం లభతే నితాంతం

అందములైన ఆటవస్తువులచేత ఈ బాలిక కల్లాకపటములు లేని ఆనందమును అనుభవించుచున్నది

ఫోటో : ఎస్. ఆర్. కె. రావు

రెండవ చిత్రం

స్వర్గీయ హవల్దార్ అబ్దుల్ హమీద్ భార్య శ్రీమతి రసూలన్ బీబీకి రిపబ్లిక్ దినోత్సవంనాడు రాష్ట్రపతి పరమ వీరచక్రాన్ని బహూకరిస్తున్న దృశ్యం

మూడవ చిత్రం

ఫోలో ఆట

నాలుగవ చిత్రం

క్రొత్తఢిల్లీలో రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు

ఫోటోలు : ప్రధాన సంపాదకులు.

ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు.

ఈ సంచికలో



పొరుగువారికి తోడ్పడండి

ఇటు ప్రభుత్వ యంత్రాంగంలోనూ అటు ప్రజల్లోనూ గత కొద్దినెలలుగా ఆహారసమస్య ఒక చర్చనీయాంశమైపోయింది. దేశాన్ని స్వయంసమృద్ధిగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం విఫలమైందనీ, ఏతత్కారణాలవల్ల దేశంలో సంభవించే సంఘటనలకు ప్రభుత్వముదే బాధ్యతఅనీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే కంఠాలు దేశమంతటా ఎక్కడబడితే అక్కడ వినిపిస్తున్నాయి. ఉద్రేకంగా, మీటింగుల్లో మాట్లాడడానికి ఇదొక అంశంగా తయారయ్యింది. అయితే గతంలో యీ కొరతను తీర్చడానికి, యీ సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసిందనే విషయాన్ని వీరు గుర్తించినట్లు లేదు. కేవలం విమర్శలతో సమస్యలు తొలగిపోవు. ముఖ్యంగా యీ సమస్య ఏ ఒక్కదేశానికీ చెందిందికాదు. మొత్తం ప్రపంచానికంతకూ చెందినది.

ప్రకృతి వైపరీత్యాలే మన యీ ఆహారసమస్యకు కారణమౌతూ వస్తున్నాయి. విమర్శలకన్న తన బాధ్యతల నిర్వహణ యెడనే ప్రభుత్వం ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నది. ఆహారకొరతను తీర్చడానికి సరఫరాలను క్రమబద్ధం చేయడానికి తగినంతగా విదేశాలనుండి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. క్లిష్టపరిస్థితుల్లో అత్యవసర వస్తువుల రేషనింగు అనేది బాధ్యత గిగిన ప్రభుత్వంయొక్క ప్రాథమిక కర్తవ్యం. ఇలాంటి పరిస్థి బాగా అభివృద్ధి చెందిన దేశాలు, ధనికదేశాలు ప్రజల ష్నను దృష్టిలో వుంచుకుని అవి ఎలా ప్రవర్తించాయో, సాయో యీ వ్యాసంలో సంక్షిప్తంగా తెలియజేస్తాను. నే మాట మిలటరీ ప్రయోగం. ఒక గ్రూపులోని సరఫరాలలో అతనికి చెందేభాగాన్ని పంచి యివ్వడం – రేషనింగు అంటారు. తొలిప్రపంచ సంగ్రామంలో దేశవ్యాప్తంగా ఆహారాన్ని పంపిణీ చేయడంతో యిది అమల్లోకి వచ్చింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామకాలంలో యుద్ధంలో పాల్గొన్న దేశాలేగాక ఆహారకొరత, అధిక ధరల సమస్యలలో చిక్కుకుపోయిన అలీనదేశాలుకూడా రేషనింగును అమలుపరిచాయి.

తొలి ప్రపంచ సంగ్రామం ప్రారంభమైన కొద్ది నెలలకే బెర్లిన్‌లో రొట్టెల రేషనింగు ప్రవేశపెట్టబడింది. ఆహార పంపిణీలో లోటుపాట్లను అరికట్టడానికి ముందు చర్యగా రేషనింగు ప్రవేశపెట్టబడిందన్న విషయాన్ని అప్పట్లో విస్మరించి ఆహార కొరతకు యిదొక నిదర్శనంగా విదేశాల్లో తప్పుడు వ్యాఖ్యానం చేయడం జరిగింది. తొలిప్రపంచ సంగ్రామం ముగింపుకొచ్చేవరకు ఇంగ్లండులో రేషనింగు ప్రస్తావనేలేదు. కాని 1914 లో చక్కెర కొరత ఏర్పడడంవల్ల దానికి తప్పనిసరిగా భారీ ఎత్తున చక్కెర కొనుగోలు చేయక తప్పలేదు. ఆ తర్వాత మాంసం, క్రొవ్వు, పందిక్రొవ్వులకు రేషనింగును విస్తరింపజేసింది. తొలి ప్రపంచ సంగ్రామకాలంలో అమెరికాలో పౌరజనాభాకు వినియోగ దారుల రేషనింగును వర్తింపజేయడం జరగలేదు. కాని 1917 లో క్యూబా నుంచి అమెరికాకు చక్కెర సరఫరా నిలిచిపోవడంతో మిఠాయి దుకాణదారులకు, మిఠాయి తయారీదారులకు పంచదార సరఫరాలను సక్రమంగా అందించవలసిన అవసరం ఏర్పడింది.

ద్వితీయ ప్రపంచ సంగ్రామకాలంలో రేషనింగును బాగా విస్తరింపజేయడం జరిగింది. యుద్ధం ప్రారంభం కావడంతో జర్మనీ తమ యుద్ధకాలపు ఆర్థిక వ్యవస్థలో ఒక భాగంగా రేషనింగును ప్రవేశపెట్టడానికి తీవ్రచర్యలు తీసుకుంది. 1939 లోనే రొట్టెలు, పిండి, చక్కెర, మాంసం, క్రొవ్వులపై రేషనింగును

ప్రవేశపెట్టి 1944 వరకూ కొనసాగించింది జర్మనీ. తను ఆక్రమించిన దేశాలన్నిటికీ దీనిని విస్తరింపజేసింది 1940 లో ఇంగ్లండులోనూ రేషనింగు ప్రారంభించబడి పదేళ్ళపాటు అమలులో వుంది. అక్కడ మాంసం, ఎండుమాంసం, చేపలు, గ్రుడ్లు, క్రొవ్వు, పాలు, చక్కెర, టీ, నారింజ, చివరకి వస్త్రాలపైకూడా రేషనింగును ప్రవేశపెట్టి అత్యంత క్లిష్టపరిస్థితుల్లో ఆయాదేశాల ప్రజలు ఎంత సహనంతోనూ, క్రమశిక్షణతోనూ మెలగారో ఆలోచిస్తే వారి జాతీయక్రమశిక్షణ, మాతృదేశాభిమానం ఎంతటివో అర్థంకాగలదు ఈనాడు మనంకూడా అదొక గుణపాఠంగా భావించాలి

ఆర్థికవ్యవస్థ అత్యంత క్రమబద్ధమైవున్న అమెరికాలోకూడా లోహాలపై రేషనింగు ప్రవేశపెట్టబడింది ఆ తర్వాత దానిని చక్కెర, చెప్పులు, గేసలీను, రబ్బరు, డబ్బాలలో సీలుచేసిన పండ్లు, కాయగూరలు, పండ్లరసం, సోప్స్, చంటిపిల్లల ఆహారం, ఎండుపళ్ళు, బటాణీలు, చిక్కుడు, వస్త్రాలు మొదలైన వినియోగ వస్తువులకుకూడా రేషనింగు విస్తరింపజేసింది ప్రపంచంలో అన్నిదేశాల్లోకీ సంపదతో తులతూగే ఆమెరికాలోకూడా ఆహార పదార్థాలలో ప్రాథమికమైనవి, ముఖ్యమైనవి రేషనింగు నుంచి తప్పించుకోలేదన్న సత్యం గుర్తించాలి మనం.

ఈ పరిస్థితులదృష్ట్యా పరిశీలించినప్పుడు, ప్రస్తుతం మన దేశంలో ఒక్క బియ్యం, గోధుమలు మరియు పంచదార విషయంలో రేషనింగ్‌ను ప్రవేశపెట్టడాన్ని, యే విధంగాను, అభ్యంతరకరమైన, విమర్శకు మూలమైన తీవ్రమైన చర్యగానో, రావుల్ తప్పిచేసిన పనిగానో భావించడానికి వీలులేదు. భారతదేశం స్వయంగా, ప్రత్యేకమైన సమస్యలున్న ఒక ఖండం. ప్రపంచంలోని జనాభాలో అయిదవవంతుమంది మన దేశంలో నివసిస్తున్నారు ఆలస్యంగా ప్రారంభమయిన నిర్మాణ కార్యక్రమం పునాదులనుండి జరుగవలసి యున్నది అంత పెద్దజనాభాకు ఆహారాన్ని పెట్టడమన్నది మామూలు విషయంకాదు, అందువల్ల స్వల్పకాలంలో అది సంతృప్తికరంగా పరిష్కారం కాగలదని ఆశించలేం జనాభా పెరుగుదల అధికంగా ఉండడంవల్లనూ, కొంతవరకు ప్రకృతి వైపరీత్యాల కారణంగానూ యీ సమస్య మరింత క్లిష్టంగా తయారయింది మన ఆర్థికవ్యవస్థ ఇంకా నైరుతిపవనాలమీద ఆధారపడిన ఆర్థిక వ్యవస్థగానే ఉన్నది వర్షాలు సరిగా పడకపోతే మన నదులు, చెరువులు నిష్ప్రయోజనకరంగా తయారయి వ్యావసాయిక ఉత్పత్తులు దెబ్బతింటాయి. ఒక ప్రఖ్యాత ఆర్థికశాస్త్రవేత్త వెల్లడించిన అభిప్రాయం ప్రకారం మన దేశంలోని అన్నిప్రాంతాల్లోను, అయిదుసంవత్సరాల కాలంలో, రెండు సంవత్సరాలుమాత్రమే తగినంత వర్షం పడుతున్నది.

ఈ యిబ్బందులను యెదుర్కొనే దృష్టితో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన మహానదులమీద బ్రహ్మాండమైన బహుళార్థ సాధక ప్రాజెక్టులను ప్రారంభించాయి కొద్దిసంవత్సరాల కాలంలో యీ ప్రాజెక్టులన్నీ పూర్తయితే – పెద్దయెత్తున ఎరువుల ఉత్పత్తికి తోడుగా – మన దేశంలో ఆహార ఉత్పత్తి సమస్య తీవ్రమైన విషయం కాకపోవచ్చు అప్పటివరకు, మన ఉత్పత్తికి అనుబంధంగా, ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవడం అనవసరంగా, అసహజంగా భావించరాదు. కొన్ని పెద్ద పట్టణాల్లో రేషనింగ్‌ను ప్రవేశపెట్టడం నిస్సందేహంగా సవ్యమైన చర్య, ఎందుకంటే యిది ప్రజల ఆరోగ్యానికిగాని, ఆహార పద్ధతులకుగాని యేమాత్రం భంగం కలిగించకుండా సరఫరాను, వినిమయాన్ని క్రమబద్ధం చేస్తుంది. దీనికి ఎవరుగూడ అభ్యంతరం చెప్పవలసిన పనిలేదు. చాల సరుకుల విషయంలో, మనకంటె సంపన్నవంతమైన దేశాలు గూడ రేషనింగ్‌ను అమలుజరిపినప్పుడు, ఆవేశాలను అదుపులో పెట్టుకొనగలిగిన మన దేశప్రజలు, ప్రస్తుత గడ్డు పరిస్థితులయందు యీమాత్రపు సంయమనాన్ని పాటించకపోవడంలో కారణం కనిపించదు. ఆహార ధాన్యాల విషయంలో ఆంధ్రప్రదేశ్ మిగులు రాష్ట్రం. అయినప్పటికి, యితర రాష్ట్రాలలోని మన సోదరుల అవసరాలను పంచుకొనడానికి మనం స్వయం కల్పితమైన సంయమనానికి – రేషనింగ్‌కు – అంగీకరించామని చెప్పడానికి సంతోషపడుతున్నాను; గర్వపడుతున్నాను. ఇతర స్వయంకల్పిత సంయమనాలవలెనే, దీని విజయంగూడ మన పౌరుల విశ్వాస పాత్రత, హార్దిక సహకారాలమీదనే ఆధారపడిఉంటుంది. కనిష్టమైన కష్టంతో దేశం యీ క్లిష్ట పరిస్థితినుండి బయటపడడానికిగాను, సమయోచితమైన దేశభక్తిని ప్రదర్శించడంలో ఆంధ్రప్రదేశ్ పౌరులు యెవరికీ తీసిపోరని నాకు తెలిసినప్పటికి అందుకొరకు ప్రత్యేకమైన విజ్ఞప్తి చేస్తున్నాను. జాతీయ ప్రయోజనాలు, సంక్షేమందృష్ట్యా, 'కొంచెమైనను దిగబంచి కుడువమేలు' అన్న ప్రాచీన ఉత్తేజకర సూక్తికి అనుగుణంగా మనం యీ స్నేహపూర్వక చర్యను యీ విధంగానే కొనసాగించగలం.

జైహింద్

ఆంధ్రప్రదేశ్

ప్రభుత్వ నిర్ణయాలు

* పౌర ప్రతిపత్తి లేకుండా సింహళం నుండి తిరిగి వస్తున్నవారికి — యింతకు ముందు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు — పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం నిశ్చయించింది

* సహకార ప్రాతిపదిక మీద గృహనిర్మాణ సొసైటీని స్థాపించదలచిన సైనికబలాల జవానులకు, నాన్ కమిషన్డ్ అధికారులకు హైదరాబాద్ జిల్లాలోని మేడ్చల్ మరియు బషీరాబాద్ తాలూకాలయందు 70 ఎకరాల భూమిని కౌలుకివ్వడానికి నిర్ణయించబడింది

* ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న జవానుల కుటుంబాలకు ఇప్పుడిస్తున్న విద్యావిషయకమైన, ఉద్యోగ సంబంధమైన కొన్ని మినహాయింపులు, సదుపాయాలు భారత సైనిక బలాలలో పనిచేస్తున్న గూర్ఖాలకు గూడ యివ్వబడగలవు

* చేనేత పనివారల సహకార సంఘాలకు ఋణసౌకర్యాలను విస్తరింపచేయడానికి కేంద్ర మరియు అపెక్సు బ్యాంకులు 200 లక్షల రూపాయల మేరకు అప్పులు తీసుకోవడానికి వీలుగా వాటికి మూడు సంవత్సరాల కాలపరిమితికి ప్రభుత్వహామీ యివ్వడానికి నిర్ణయించబడింది

* ఆర్థిక సంబంధమైన పొదుపు మరియు కోర్టులకు వెళ్ళేవారికి కోర్టులు సులభంగా అందుబాటులో ఉండడానికిగాను అనుబంధ న్యాయస్థానాలను (సబార్డినేట్ జుడీషియరీ) కొంత పునర్వ్యవస్థీకరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది


* స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ నుండి హైదరాబాద్ కెమికల్స్ మరియు ఫెర్టిలైజర్స్‌కు 29 లక్షల రూపాయల నగదు ఋణంనిమిత్తం గ్యారంటీగా నిలువడానికి ప్రభుత్వం నిర్ణయించింది

* అజంజాహిమిల్లుకు 170 లక్షల నగదుఋణపు ప్రభుత్వ గ్యారంటీని 175 లక్షల రూపాయలకు హెచ్చించడానికి నిర్ణయించబడింది

* రాష్ట్రంలోని కొన్ని పంచదార ఫ్యాక్టరీలలో నిలువ ఆయిఉన్నటువంటి మొలాసెస్‌లోని కొంత భాగాన్ని పశువుల మేతకొరకు వ్యవసాయదారులకు యివ్వడానికి నిర్ణయం జరిగింది

* 1968–1969వ విద్యా సంవత్సరంలో నాగార్జునసాగర్ ఇంజనీరింగ్ కాలేజీని నాగార్జునసాగర్‌కు తరలించడానికి నిర్ణయించబడింది హైదరాబాద్‌లోని కళాశాల ఆవరణలో తాత్కాలిక షెడ్‌లను నిర్మించడానికి 50,000 రూపాయలు కేటాయించబడ్డవి.

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, శాసన మండలిలో 1966-67 సంవత్సరపు బడ్జెటును సమర్పిస్తూ 1966 ఫిబ్రవరి 21వ తేదీన ఆర్థిక మంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డిగారు చేసిన ప్రసంగం వివరాలు



ఆర్థికమంత్రిచే మిగులు బడ్జెటు ప్రతిపాదన

పారిశ్రామిక ఉత్పత్తి : జాతీయ అత్యవసర పరిస్థితి, పరపతి సౌకర్యాల విషయంలో ప్రతిబంధకాలు, తయారైన సరుకుల రవాణాలో ఇబ్బందులు...ఇవన్నీ ఉన్నా 1965లో పారిశ్రామిక ఉత్పత్తి 1964లో కన్న అధికంగా వుంది. అనేక పరిశ్రమల్లో ఉత్పత్తి సామాన్యంగా పెరుగుదలనే సూచించింది.

కార్మిక పరిస్థితి : కార్మిక పరిస్థితి గత సంవత్సరంకన్న కొంత మెరుగ్గా వుంది, గత సంవత్సరంలో పని ఆగిపోయిన సందర్భాల సంఖ్య 120 వుంటే, ఈ సంవత్సరం ఆ సంఖ్య 113 మాత్రమే

ఉద్యోగ పరిస్థితి: ఉద్యోగాల పరిస్థితికూడా బాగానే వుంది. కొన్ని చోట్ల ప్రభుత్వ ఆధీనంలో ఉద్యోగ నియామకాలకు ఏర్పాట్లుచేయబడినై. ఇందుమూలంగా పరిస్థితి మెరుగైంది. గత సంవత్సరం ఉద్యోగాలు పొందిన వారి సంఖ్య 20,769. 1965లో 236,83 మంది ఉద్యోగాలను సంపాదించు కున్నారు. ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగాల సంఖ్య పెరిగింది- 1964లో 1,841 మందికి, 1965లో 2,811 మందికి ఉద్యోగాలు దొరికినై.

1964-65 సంవత్సరపు సవరించిన అంచనాలను రూపొందించేప్పుడు, అనుకున్నట్లుగానే రివిన్యూ వసూళ్ళ మొత్తం నికరంగా ఆ సంవత్సరానికి రూ. 142.69 కోట్లు వుంది. అంతేకాదు, ఖర్చు సవరించిన అంచనాల్లో అనుకున్న దానికన్న, రూ. 11.98 కోట్లు తగ్గింది. అంటే రూ. 4.44 కోట్లు రివిన్యూ మిగులు లభించిందన్న మాట. ప్రణాళిక పథకాలు, ఇతర పథకాలు, ఈ రెండువిధాల పథకాలపై పెట్టుబడి వినియోగం రూ. 43.42 కోట్లదాకా వుంది. అప్పు, డిపాజిట్లు, ఋణాలు వగైరాలకు సంబంధించిన అప్పుపద్దు వ్యవహారాల మూలంగా నికరంగా రూ. 37.14 కోట్ల రాబడి లభించింది. ఆ విధంగా ఆ సంవత్సరం రూ. 6.13 కోట్ల రొక్కపు నిల్వతో ముగిసింది.

1965-66 సవరించిన అంచనాలు

1965-66 బడ్జెట్ అంచనాల ప్రకారం, మొత్తంరివిన్యూ రూ. 154.53 కోట్లు, ఖర్చు, రూ. 161.23కోట్లు. రివిన్యూ ఖాతాకింద తరుగు రూ. 6.70కోట్లు, రివిన్యూవసూళ్ళు రూ. 152.35 కోట్లు ఉండగలవవి ఇప్పుడు అనుకుంటున్నాం. మరిఖర్చు రూ. 165.86 కోట్లకు పెరిగింది. ఇందుమూలంగా ఆ ఏడాది తరుగు సుమారు రూ. 13.51 కోట్లు వుండవచ్చు. భూమి రివిన్యూ కింద రూ. 5.17 కోట్ల తరుగుదల, ప్రణాళిక పథకాల కేంద్ర గ్రాంట్ల కింద రూ. 2.25 కోట్ల తరుగుదల. అదనంగా వసూలైన రూ. 5.24 కోట్లు—ఈ కారణాలమూలంగా రివిన్యూలో రూ. 2.18 కోట్ల తరుగు ఏర్పడింది. అదనంగా వసూలైన రూ. 5.24 కోట్ల వివరాలు—అమ్మకం పన్ను కింద రూ. 2.80 కోట్లు, స్టాంపుల కింద రూ. 73 లక్షలు, మోటారుబండ్ల చట్టం కింద రూ. 66 లక్షలు, అటవీశాఖ కింద రూ. 44 లక్షలు, మిగతా పద్దుల కింద రూ. 61 లక్షలు.

అనావృష్టికారణంగా భూమి రివిన్యూ వసూళ్ళు తగ్గినై. వర్షాలు లేకపోవటం మూలంగా విస్తారంగా భూమి రివిన్యూ మినహాయింపులను మంజూరు చేయవలసి వచ్చింది. అలాగే బకాయీల వసూళ్ళ విషయంలో కొంచెం నిదానం చూపవల వచ్చింది. ఏమైతేనేం ప్రణాళిక కేంద్ర గ్రాంటుల తరుగుదలవ

> రాష్ట్ర ఆర్థికమంత్రి ప్రతిపాదించిన 1966_67 వ సంవత్సరపు బడ్జెటులో ఆదాయం 174.24 కోట్ల రూపాయలు: వ్యయం 173.93 కోట్ల రూపాయలు: మిగులు 31 లక్షల రూపాయలు

పథకాలకు లభించే కేంద్ర ఋణాల్లో పెరుగుదలతో భర్తీచేసుకొనటం జరిగింది. ముఖ్యంగా ధరలు పెరగటం మూలంగానూ, నిర్వహణ యంత్రాంగాన్ని బాగా కట్టుదిట్టం చేయటం మూలంగానూ, అమ్మకం పన్ను, స్టాంపులు, మోటార్ బండ్ల చట్టం, అటవీ శాఖల పద్దులకింద వసూళ్ళ విషయంలో అభివృద్ధి కనబడింది

దిగువ సూచింపబడిన పద్దులకింద ఏర్పడిన పెరుగుదల, తరుగుదల మూలంగా రివిన్యూ ఖర్చులో రూ 4.63 కోట్ల పెరుగుదల సంభవించింది -

	(రూ కోట్లు)
అప్పు, తదితరమైన లావాదేవీల కారణాన వడ్డీ ...	3.62
జనరల్ అడ్మినిస్ట్రేషన్ ... (పరిపాలనా నిర్వహణ వ్యవహారాలు)	1 48
పోలీస్	0.55
ప్రజారోగ్యం	(-) 0 41
వ్యవసాయం	(-) 0 82
మిగతా పద్దులు (నికరం) ...	0.21

నాగార్జునసాగర్ ప్రాజెక్టు విషయంలో మొదట్లో అనుకున్న రూ 18 కోట్లు మొత్తం తర్వాత రూ 17 కోట్లకు తగ్గించబడింది కాని మొత్తంమీద కేంద్ర ప్రభుత్వం నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు రూ 20 కోట్లదాకా సహాయం చేయటానికి అంగీకరించింది. ఇక తుంగభద్ర ఎగువకాలువ విషయంలో కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ 1 6 కోట్లు కేటాయించింది ఈ ప్రాజెక్టు ఫలితాలు త్వరలోనే చేకూరవచ్చు. ప్రణాళిక కింద కాకుండా జరిగిన ఖర్చులో పెరుగుదల ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ~~పున గిడ్డంగుల నిర్మాణంవల్ల ఏర్ప

అప్పుపద్దు వ్యవహారాలు అప్పు డిపాజిట్లు వగైరా వ్యవహారాల ఫలితంగా రూ 48 09 కోట్ల నికర రాబడి ఏర్పడింది

1965-66 లో రాష్ట్ర ఆర్థిక స్థితి

ఇంతకు మునుపు నే చెప్పినట్లు, 1_4_65 న మనకు రూ. 6 13 కోట్ల రొక్కపు నిలవ వుంది. కావి ఇప్పుడు ఈ సంవత్సరం రూ 23.02 కోట్ల తరుగు నిలవతో ముగుస్తుందని అనుకుంటున్నాం. అంటే మొత్తం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రూ 29 15 కోట్ల మేరకు క్షీణించిందన్న మాట ఇందుకు ముఖ్యకారణం రివిన్యూ తరుగుదలలోని పెరుగుదల — సవరించిన అంచనాల ప్రకారం తరుగుదల రూ 6 70 కోట్లనుండి రూ 13.51 కోట్ల వరకు ఉంటుంది. మిగతా ఇబ్బందులు దిగువ సూచింపబడిన పరిస్థితుల మూలంగా ఏర్పడినై.

(1) కింది విద్యుచ్ఛక్తి పథకాలకై, వాటి ప్రాముఖ్యం దృష్ట్యా రూ. 7 4 కోట్లను కేటాయించాం అయితే తమ సహాయం రూ 3 కోట్లకుమాత్రమే పరిమితమై ఉంటుందని కేంద్ర ప్రభుత్వం సూచించింది అందువల్ల ఈ పద్దుకింద రూ 4 4 కోట్ల తరుగుదల ఏర్పడింది

	(రూ. కోట్లు)
కొత్తగూడెం థర్మల్ విద్యుచ్ఛక్తి పథకం మొదటిదశ ...	2 4
శ్రీశైలం విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు	4.0
ఎగువసీలేరు థర్మల్ పథకం మొదటిదశ ...	1.0

(2) చిన్న నీటిసాగు పద్దుపై పెట్టబడి వినియోగాన్ని రూ. 18.26 కోట్లనుంచి రూ. 28 26 కోట్లదాకా పెంచమని ప్రణాళికా సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి 1962 లోనే సలహా యిచ్చింది. మూడవ ప్రణాళిక విషయంలో ఇదివరకే కేంద్రప్రభుత్వం చేస్తానని మాటయిచ్చిన సహాయానికి అదనంగా రూ 7 కోట్లను సమకూర్చటానికై ప్రణాళికా సమితి ప్రయత్నింస్తుందని అనుకున్నాం మిగతా రూ 3 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలో సర్దుబాట్లు చేసుకొని సమకూర్చుకోవాలి. ప్రణాళిక మొదటి నాలుగేళ్ళలో సుమారు రూ 21 కోట్లదాకా ఖర్చుపెట్టగలిగాం ఇక మిగతా రూ 7.26 కోట్లను యీ ఏడాది ఖర్చుపెట్టాలి అయితే యీ అదనపు మొత్తాన్ని సమకూర్చలేమని కేంద్రప్రభుత్వం తెలియజేసింది. ఎంతో నచ్చజెప్పాక, ఈ విషయంలో కేంద్ర సహాయాన్ని రూ 4 కోట్లు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది ఇందు మూలంగా చిన్న నీటి సాగు పద్దుకింద రూ 3 కోట్ల తరుగుదల ఏర్పడింది

(3) ఆయా నీటిసాగు ప్రాజెక్టులకింద ఆయకట్టును అభివృద్ధి చేయడానికై చేసిన కేటాయింపును రూ 1.29 కోట్లనుంచి రూ 2 43 కోట్లదాకా సవరించవలసి వచ్చింది అంటే అదనంగా రూ 1 14 కోట్లను ఖర్చుపెట్టవలసి వుంటుంది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకోవలసి వుంటుంది

(4) దేశంలోని ద్రవ్య పరిస్థితులు సంతృప్తికరంగా లేకపోవడం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రవిద్యుచ్ఛక్తి సంస్థ మొదట్లో అనుకున్న ప్రకారం బహిరంగ ఋణాలను సేకరించే ప్రయత్నాన్ని విరమించుకోవలసి వచ్చింది ఈ రెండు ఋణాలకింద నికరపు వసూళ్ళలో రూ 3.9 కోట్ల తరుగుదల ఏర్పడింది

(5) ప్రణాళికా పథకులలో తరుగుదల- రూ. 10.38 కోట్లు.

సిబ్బంది తగ్గింపు

దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక రాజకీయ

పరిస్థితుల ప్రభావం కూడా చాలావరకు 1965–66 సవరించిన అంచనాలపై ప్రసరించింది. ప్రభుత్వఖర్చులోపొదుపు చేయడానికి, ఆర్థిక వనరులను సమీకరించుకొనటానికి, తగు విధానాలను రూపొందించటం జరిగింది. వీటిలో కొన్నిటిని గురించి మాత్రం చెపుతాను.

(అ) క్రియా రంగంలో పనికోసం అవసరమైన సందర్భాల్లోతప్ప అదనంగా కొత్త వుద్యోగాలను నిషేధించటంతో పాటు, అన్ని ఆఫీసుల సిబ్బందిలో 100 కి 10 పాళ్ళమేరకు తగ్గింపు చేయాలని ఉత్తర్వులు జారీచేయటం జరిగింది. అలా ఏర్పడే మిగులు సిబ్బందిని సివిల్ సప్లైస్ వగైరా శాఖల్లో వియోగించటం జరుగుతుంది.

(ఆ) ఆఫీసుల అత్యవసర ఖర్చులు వగైరాల కిందకూడా ఖర్చును 10 శాతానికి తగ్గించాలని ఆదేశించడం జరిగింది

(ఇ) మోటారుకార్ల కొనుగోలును ఆపవలసిందిగానూ, ఇప్పటి కార్లపై పెట్రోలు వగైరాఖర్చును అదుపులో పెట్టవలసిందని వివిధశాఖలకు తెలియజేయటం జరిగింది

(ఈ) ఇంకా ప్రారంభించని కట్టడాల నిర్మాణాన్ని వాయిదావేయటం, అప్పుడే పనిజరుగుతున్న సందర్భాల్లో ఖర్చు వేగాన్ని తగ్గించటం

(ఉ) దిగువ సూచించినరేట్ల ప్రకారం ప్రావిడెంట్ నిధికి ప్రభుత్వ ఉద్యోగులందరూ అదనంగా చెల్లించాలి –

నెలకు రూ 600 వరకు జీతాలున్న ప్రభుత్వ ఉద్యోగులు–అదనపురేటు..3

నెలకు రూ. 600–1000 మధ్య జీతాలున్న ప్రభుత్వ ఉద్యోగులు – అదనపు రేటు 4%

నెలకు రూ. 1000 కి పైజీతాలున్న ప్రభుత్వ ఉద్యోగులు – అదనపురేటు 6%

ముఖ్యాంశాలు

✻ విద్యుచ్ఛక్తికి 32 కోట్ల రూ. కేటాయింపు. నాలుగవ పంచవర్ష ప్రణాళిక మొదటి సంవత్సరానికి కేటాయించిన 79 25 కోట్ల రూపాయల్లో యిదిచాలా పెద్ద మొత్తం.

✻ తరువాత వ్యవసాయానికి 17.73 కోట్ల రూ.– విద్యుచ్ఛక్తి తరువాత స్థానం వ్యవసాయానిది.

✻ నీటి పారుదలకు 13 25 కోట్ల రూ సాంఘిక కార్యక్రమాలకు 8.96 కోట్ల రూ. కేటాయింపు.

✻ ఈ సంవత్సరపు మొత్తం కేటాయింపులో నీటి పారుదల, విద్యుచ్ఛక్తికి కలిపి 57 2%. వ్యవసాయానికి 18.6%, పరిశ్రమలు మరియు గనుల త్రవ్వకపు కార్యక్రమాలకు 3 7% కేటాయించబడ్డాయి.

రివెన్యూ వసూళ్లు: బడ్జెట్ ప్రకారం మొత్తం రివిన్యూ రూ 174 24 కోట్లు (సవరించిన అంచనాలప్రకారం రు 152.35 కోట్లు) కింది ముఖ్యపద్దుల కింద పెరుగుదల లభించింది :–

	(రూ. కోట్లు)
రాబడిపన్ను	... 0 12
భూమి రివిన్యూ	.. 4 78
రాష్ట్ర ఎక్సైజు సుంకాలు	... 0.71
మోటారుబండ్లపై పన్నులు	... 0.61
అమ్మకం పన్ను	.. 2.40
మిగతాపన్నులు, సుంకాలు	... 0.65
వడ్డీ	... 5.24
వ్యవసాయం	.. 0 34
కేంద్రి ఎక్సైజు సుంకాలు	... 4.16
కేంద్రంనుంచి సహాయక గ్రాంట్లు	... 1.74

ఖర్చు బడ్జెట్ ప్రకారం మొత్తం వినియోగం రూ. 173 93 కోట్లు వుంటుంది 1965–66 సవరించిన అంచనాల ప్రకారం ఈ మొత్తం రూ 165 86 కోట్లు వుంది వివరాలు :–

రూ. కోట్లు	సవరించిన అంచనాలు 1965–66	బడ్జెటు అంచనాలు 1966–67
1 మామూలు ఖర్చు	129 95	149.22
2. రాష్ట్ర ప్రణాళిక పథకాలు	27.99	16.31
3 కేంద్రం సూచించిన పథకాలు	7 92	8.40
	165.86	173.93

1966–67 లో మామూలు ఖర్చులోని పెరుగుదల వివరాలు :–

1 ఇదివరకే ఆమోదించిన ఖర్చుకై కేటాయింపు – అం చేమూడవ ప్రణాళిక పథకాలను కొనసాగించటానికి, నిర్వహించడానికిఅయ్యే నిత్యఖర్చు ... రూ. 14.5 కోట్లు

2 కరువుభత్యంలో పెరుగుదల 1–6–1965 నుండి మంజూరు చేయబడింది ఈ ఏడాది 8 నెలల్లో దాని ప్రభావం సవరించిన అంచనాల్లో ప్రతిబింబించింది. వచ్చే ఏడాది బడ్జెట్‌లో పూర్తి సంవత్సరానికి కేటాయింపు చేయబడింది. సవరించిన అంచనాలకన్న ఇది అదనంగా రూ. 2.5 కోట్లు వుంటుంది. ... ... రూ 2 5 కోట్లు

(3) కింది పద్దులకింద అధికమైన కేటాయింపులు :

(అ) జిల్లాపరిషత్తులకు, పంచాయితీ :

కులకు బోధనా గ్రాంట్లు ... రూ. 60 లక్షలు.

(అ) రోడ్ల నిర్వహణ...రూ. 50 లక్షలు.

(ఇ) హైదరాబాదు పురపాలక సంఘానికి గ్రాంటు ... రూ. 10 లక్షలు.

(ఈ) పాఠశాలల, కళాశాలల కట్టడాలకు గ్రాంట్లు ... రూ. 20 లక్షలు.

(ఉ) రోగులకు ఆహారం, మంచాలతో సహ హాస్పిటల్స్ అవసరాలు ... రూ 39 లక్షలు.

రివిన్యూ మిగులు: 1965–66 లో రివిన్యూ తరుగు రూ. 13.51 కోట్లువుంటే, వచ్చే సంవత్సరపు అంచనాలబట్టి రూ. 31 లక్షలు మిగులు వుండవచ్చునని అనుకుంటున్నాం

అప్పులు: ఇప్పటికి ఆర్థిక సంవత్సరపు అనుభవం దృష్ట్యా వచ్చే యేడాది బహిరంగ మార్కెటుద్వారా అప్పులు ప్రభుత్వం విషయంలో రూ. 9.5 కోట్లకు, రాష్ట్ర విద్యుచ్ఛక్తి సంస్థ విషయంలో రూ. 2 కోట్లకు పరిమితం చేయాలని ప్రతిపాదించబడింది. వీటికి అదనంగా కేంద్ర ఋణ సహాయం, భారతజీవిత బీమా సంస్థ లాంటి సంస్థలనుంచి ఋణాలు లభించుతై. వచ్చే యేడాది మొత్తంమీద స్థూలంగా అప్పులు సుమారు రూ. 75.24 కోట్లు వుండవచ్చు. ఇందులో రూ. 36.63 కోట్లు పాత ఋణాల చెల్లింపుకు పోగా, పెట్టుబడి కార్యక్రమాల ఖర్చుకు రూ. 38.61 కోట్లు మిగులుతై.

1966–67 వార్షిక ప్రణాళిక


మామూలు పరిస్థితుల్లో 1966–67వార్షిక ప్రణాళిక మొత్తం రూ. 125 కోట్లు వుండేది. కాని రక్షణ అవసరాలు, ఆహారపు దిగుమతులు, కరువుభత్యంపై అదనపు ఖర్చు, అనావృష్టివలన రివిన్యూనష్టం, సహాయ కార్యక్రమాలపై ఖర్చు ... వీటన్నింటి మూలంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆర్థిక పరిస్థితులకు తాకిడీ చాలా ఎక్కువైంది. అందువలన 1966–67 వార్షిక ప్రణాళికను రూ. 79.25 కోట్లకు పరిమితం చేయవలసి వచ్చింది. రూ. 50 కోట్లను సమకూరుస్తామని కేంద్రప్రభుత్వం మాట యిచ్చింది. రాష్ట్రప్రభుత్వం మిగతా రూ. 29.25 కోట్లను సమీకరించుకోవాలి. 1966–67 సంవత్సరం సుమారు రూ. 11 68కోట్ల తరుగు రొక్కపునిల్వతో ముగుస్తుందని నేను ఇదివరకే చెప్పాను. అంటే ఉద్దేశించిన వినియోగానికి, 1966–67లో అందుబాటయ్యే వసతులకు మధ్యనున్న వ్యత్యాసాన్ని ఇది సూచిస్తుంది. ఇందులో ఇంచుమించు సగంభాగాన్ని గిల్ట్ ఎడ్జ్‌డ్ సెక్యూరిటీల ద్వారా భర్తీ చేసుకోవాలి. మిగతా సగంభాగాన్ని, కరువుభత్యం సవరిస్తే అవసరమయ్యే మొత్తాన్ని, అలాగే యన్.జి.ఓ.ల వేతన ప్రమాణాలను సవరిస్తే అవసరమయ్యే మొత్తాన్ని ఖర్చులో పొదుపుచేసుకొని, భూమి రివిన్యూ, అమ్మకంపన్ను, మోటారుబండ్ల పన్ను వగైరాల సేకరణను బడ్జెట్‌లో ప్రతిపాదించినదానికన్న ఎక్కువ సేకరించుకొని భర్తీ చేసుకోవాలి వచ్చేయేడాది వతకాలను అమలుజరపటానికి ఇది అత్యవసరం.

నీటిసాగు

మూడవ ప్రణాళికలో చేర్చిన (రెండవ ప్రణాళిక కొరదలా) పతకాలు మధ్యరకానికి చెందినవి ఇరవైమూడు, పెద్దరకంవి అయిదు 1966 మార్చి ఆఖరుకు పూర్తికావచ్చునని అనుకొంటున్నాం. అంటే అలాంటి ప్రాజెక్టుల కింద సాగయ్యే భూమి మొత్తం 9.98 లక్షల ఎకరాలదాకా వుంటుంది. అయితే ఇందులో నికరంగా నీటిసాగు లభించే ప్రాంతం 8.3 లక్షల ఎకరాలు ఉండవచ్చు. 1966–67 వార్షిక ప్రణాళికలో 25 భారీ, మధ్యరకం సాగు ప్రాజెక్టులు, వరద కంట్రోలు ప్రాజెక్టులు చేర్చబడినై. వీటిని మూడవ ప్రణాళికనుంచి నాల్గవ ప్రణాళికలోకి తీసుకురావటం జరిగింది. ప్రణాళికలో చేర్చిన భారీ ప్రాజెక్టులు – నాగార్జునసాగర్ ప్రాజెక్టు, తుంగభద్ర ఎగువకాలువ మొదటి దశ, పోచంపాడు ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు.

ప్రభుత్వం త్వరలోనే వ్యావసాయిక – పారిశ్రామిక కార్పొరేషనును స్థాపించాలనుకొంటోంది. అవసరమైన పనిముట్లను, పరికరాలను సమకూర్చటంవల్ల ఈ పరిణామానికి దోహదం కల్గుతుంది. రాష్ట్రమంతటా ఒక కొత్త వ్యావసాయిక–పారిశ్రామిక అభివృద్ధి వాతావరణాన్ని కల్పించవలసిన ఆవశ్యకతగురించి ప్రజలకు నచ్చజెప్పి తద్వారా ఈ పరిణామానికి సహాయపడవలసిందిగా గౌరవసభ్యులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాను ✱






ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, జనవరి 24 వ తేదీన స్వర్గీయ లాల్‌బహదూర్‌శాస్త్రి చితాభస్మం గల కలశాన్ని ఢిల్లీనుంచి విమానంలో తీసుకొచ్చినప్పటి చిత్రం.



ఆహార వ్యవసాయశాఖ మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి జనవరి 26 న విజయవాడవద్ద కృష్ణానదిలో స్వర్గీయ లాల్‌బహదూర్‌శాస్త్రి చితాభస్మాన్ని కలుపుతున్న చిత్రం

శాస్త్రీజీకి శ్రద్ధాంజలి




సహకారశాఖ మంత్రి శ్రీ తోటరామస్వామి జనవరి 26 న రాజమంద్రివద్ద గోదావరి నదిలో స్వర్గీయ లాల్‌బహదూర్‌ శాస్త్రి చితాభస్మాన్ని కలుపుతున్న దృశ్యం




కార్మిక, సమాచారశాఖ మంత్రి శ్రీ టి. వి. గురుమ జనవరి 26 వ తేదీన సికింద్రాబాదులోని య స్వర్గీయ శాస్త్రీజీ ఫొటోను ఆవిష్కరిస్తున్న


ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేసిన ప్రముఖులు




పంధొమ్మిదిమంది సభ్యులు గల సిక్కిం ప్రతినిధివర్గం
ఫిబ్రవరి 8 న హైదరాబాదుకు విచ్చేసింది




కార్మిక, సమాచారశాఖ మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తితో
సిక్కిం ప్రతినిధివర్గం




నాగార్జునసాగర్‌వద్ద సిక్కిం ప్రతినిధివర్గం




ఫిబ్రవరి 10 వ తేదీన రాజేంద్రనగర్‌లోని ద్రాక్షతోటలను
తిలకిస్తున్న సిక్కిం ప్రతినిధివర్గం




జనవరి 30 న నలుగురు సభ్యులు గల పిఏటిఏ ప్రతినిధివర్గం
హైదరాబాదుకు విచ్చేసింది




రెండురోజులపాటు హైదరాబాదులో పర్యటించేందుకు ఎవరెస్టు శిఖరారోహక బృందం ఫిబ్రవరి 6న హైదరాబాదు వచ్చింది




రాజ్‌భవన్‌లో గవర్నరుతో బృంద సభ్యులు




ఆనందనిలయంలో ముఖ్యమంత్రితో బృంద సభ్యులు




నీటి పారుదల, డ్రైనేజికి సంబంధించిన అంతర్జాతీయ కమీషను బృందం జనవరి 21న ధవళేశ్వరాన్ని సందర్శించింది



జనవరి 23న నాగార్జునసాగర్ వద్ద నీటి పారుదల, డ్రై సంబంధించిన అంతర్జాతీయ కమీషను బృందం



జగద్గురు శృంగేరీ శంకరాచార్య స్వాములవారిని జనవరి 18న గవర్నరు కలుసుకున్నప్పటి చిత్రం




శంకరమఠంలో జనవరి 25 న జగద్గురు శృంగేరీ శంకరాచార్య స్వాములవారిని సందర్శించిన ముఖ్యమంత్రి



జకొస్లవేకియా కాన్సల్ జనరల్ జనవరి 29న గవర్నరును కలుసుకున్నప్పటి చిత్రం



జకొస్లవేకియా కాన్సల్ జనరల్ ముఖ్యమంత్రిని జనవరి 29న కలుసుకున్నప్పటి చిత్రం



కియా కాన్సల్ జనరల్ జనవరి 30న రామచంద్రా లోని భారత్ భారీ విద్యుత్పరికరాల కర్మాగారాన్ని సందర్శించినపటి చిత్రం




జకొస్లవేకియా కాన్సల్ జనరల్ జనవరి 29 న ప్రధాన కార్యదర్శిని సందర్శించినప్పటి చిత్రం.


బంగారు బాండ్లలో నిజాం పెట్టుబడి




జనవరి 26 వ తేదీన, బంగారు బాండ్లలో నిజాం పెట్టుబడి
పెట్టిన బంగారు నాణాలను చూస్తున్న ముఖ్యమంత్రి



పెట్టుబడికి సిద్ధంగా వున్న బంగారం



బంగారు బాండ్లలో పెట్టుబడిపెట్టిన బంగారు నాణాల దృశ్యం




రాష్ట్రమంత్రి శ్రీ పి. వి. జి. రాజు జనవరి 26 వ
హైద్రాబాదు చేరుకున్నారు



రేడియో ప్రసారాలకు సంబంధించిన చాందాకమిటీ సభ్యులు ఫిబ్రవరి 7 వ తేదీన హైద్రాబాదుకు వచ్చారు




చాందాకమిటీ సభ్యులు ఫిబ్రవరి 7 వ తేదీన కమిటీహాలులో ముఖ్యమంత్రిని కలుసుకున్నారు



కేంద్ర ఆహార, వ్యవసాయశాఖా మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం ఫిబ్రవరి 6 వ తేదీన రాజేంద్రనగర్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోపన్యాసం చేశారు





వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోపన్యాసంలో పట్టాలు పుచ్చుకున్న పట్టభద్రులు




అంతర్‌రాష్ట్రీయ సాంస్కృతిక కార్యక్రమాలు



మైసూరు సాంస్కృతిక బృందం ప్రదర్శనాల్లోనుండి కొన్ని దృశ్యాలు



మ్యునిసిపల్ వ్యవహారాల మంత్రి శ్రీ ఎన్. చెంచురామానాయుడు మైసూరు సాంస్కృతిక బృందం నాయకునికి ఫిబ్రవరి 4న రవీంద్రభారతిలో నటరాజు, వెంకటేశ్వరుల చిహ్న ఫలకాలను బహూకరిస్తున్నప్పటి చిత్రం




సంగీతంతో మంత్రముగ్ధులను చేస్తున్న మైసూరు సాంస్కృతిక బృందం గాయకులు



రవీంద్రభారతిలో ఫిబ్రవరి 3వ తేదీన మైసూరు సాంస బృందం సభ్యులు

1966 రిపబ్లిక్ దినోత్సవం




రిపబ్లిక్ దినోత్సవం పరేడులో ఎన్. సి. సి. వందనం స్వీకరిస్తున్న గవర్నరు



పరేడును తిలకిస్తున్న కొందరు ప్రముఖులు



జనవరి 28 న ఫతేమైదాన్‌లో జరిగిన అంతిమ పరేడును తిలకిస్తున్న కొంతమంది



1966 జనవరి 26 రిపబ్లిక్ పరేడు సందర్భంలో, వీరోచిత, ప్రశంసా పాత్రమైన సేవలకు పోలీసు పతకాలు అందుకున్న వారు. కూర్చున్నవారు ఎడమనుంచి కుడికి —

(1) శ్రీ రామినీడి వెంకట కృష్ణారావు, పోలీసు ఇన్స్పెక్టర్, అవినీతినిరోధకశాఖ, ఏలూరు

(2) శ్రీ జంగం మాధవరావు, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ : (అఫి.) అవినీతినిరోధకశాఖ, కర్నూలు

(3) శ్రీ కుర్లగుండ తిమ్మరుసు, పోలీసు సబిన్స్పెక్టరు, తాడిపత్రి టౌను పోలీసుస్టేషను

(4) శ్రీ మిక్కిలినేని గోపాలరావు, పోలీసు సబిన్స్పెక్టరు, గుంటూరు జిల్లా

(7) స్వర్గీయ దొరస్వామి మునుస్వామి సతీమణి, పోలీసు కానిస్టేబిల్ నెం. 450, రైల్వేపోలీసు డిస్ట్రిక్ట్, విజయవాడ

(8) శ్రీ కందుల డేవిడ్, స్టేషన్ ఆఫీసర్, తాడిపత్రి ఫైర్ స్టేషన్

(9) శ్రీ కాయల పెద్దప్ప, ఫైర్‌మన్ నెం. 287, తాడిపత్రి ఫైర్ స్టేషన్

(10) శ్రీ మహంకాళి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్, క్రైమ్‌బ్రాంచి, సి.ఐ.డి., హైదరాబాదు

(11) శ్రీ మహబూబ్ అలీ, హెడ్ కానిస్టేబిల్, క్రైమ్ బ్రాంచి, సి. ఐ. డి., హైదరాబాదు

సాహసము, సక్రమ విధి నిర్వహణలకు 2వ తరగతి జీవనరక్షా పథకాలు

నిలుచున్నవారు :

(1) శ్రీ బొడ్డసకుర్తి సీతారామయ్య, ఎ. సి. సి. అధ్యాపకుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాకవారిపాలెం, విశాఖపట్టణంజిల్లా. (2) శ్రీ నాగెల్లిజాన్, ఎల్లందుల పహాడ్, ఖమ్మంజిల్లా. (3) శ్రీ కోర్మి సిద్దయ్య 23, ఇన్‌క్లైన్ బస్తీ, పి. ఒ. ఎల్లందు, ఖమ్మంజిల్లా.

అడవి మల్లె

12

> **జరిగినకథ**
>
> చిన్ననాడే తలిదండ్రులు లేని చంద్రం వదినెద్వారా దొంగగా నిరూపించబడి, తీవ్రంగా శిక్షింపబడి, అమాయకపు స్త్రీ అయిన గౌరి సహాయంతో బయటపడుతాడు ప్రకాశంను, ఆత్మహత్య స్థితినుంచి తప్పించి అతనితండ్రి ఆదరణద్వారా చాల గొప్పస్థితిలోకి వస్తాడు అతడు తన ఊరికివచ్చి జరుగుతున్న మార్పులను పరిశీలిస్తాడు గౌరిని అనాధశరణాలయంలో చేరుస్తాడు అన్నను చూడటానికి వెళ్ళి వ్యాపారసంస్థ అభివృద్ధిని గమనిస్తాడు రజనిని చూచిన తరువాత తాను చిరకాలం నుంచి కలుసుకోవాలనుకున్న హేమనుగూడా కలుసుకుంటాడు

"నేను ఇంకా వివాహం చేసుకోలేదు కాని త్వరలోనే చేసుకోబోతున్నాను," లేని గాంభీర్యాన్ని గొంతులోకి తెచ్చుకుంటూ, హేమముఖంలో దేన్నో వెతుకుతూ అన్నాడు చంద్రం

సిగ్గుదొంతర్లు దొర్లుతూంటే ఆమెముఖం వెన్నెల్లో ఓ వింత సోయగాన్ని వెదజల్లుతోంది

"ఎవర్నని అడగవేం ?"

చంద్రంలో ఇంత కొంటెతనం, చిలిపితనం కూడా ఉన్నాయని హేమ అనుకోలేదు హృదయవీణను ఎవరో మీటినట్లయింది

"నే నెందుకడగటం ? నువ్వే చెప్పూ ?" అంది ధీమాగా, ఆ చెప్పబోయె పేరు తనదే నని ఊహించుకుని హేమ

హేమ ధీమాను చంద్రం అపార్థం చేసుకున్నాడు అయితే హేమకు తన వివాహంతో ప్రమేయం లేదన్నమాట ! కేవలం చిన్ననాటి స్నేహితునిగానే గౌరవిస్తున్నదన్నమాట అవును ! ఆమె చదువూ, సంఘంలో ఆమెకున్న గౌరవం, చిన్నతనంలోనే దొంగగా ఇల్లువిడిచి పారిపోయిన ఓ వ్యక్తిని వివాహం చేసుకోవాలనే భావాన్ని కలలోకూడా రానివ్వవు చంద్రానికి వెంటనే ఓ ఊహ తట్టింది హేమ మనస్సును తను అర్థం చేసుకోలేకపోతున్నాడు పరీక్షించటానికి మంచి అవకాశం లభించింది ఈ 'అవును, కాదు' అనే మీమాంసలోపడి కొట్టుకోవటం అనవసరం

"చెప్పమంటావా ? నేను వివాహం చేసుకోబోయే అమ్మాయికి నీఅంత చదువూ, సంస్కారమూ లేదు సంఘంలో ఏలాంటి గౌరవమూ, మనిషికి ఓ ప్రత్యేకమయిన వ్యక్తిత్వమూలాటివి ఏమీ లేవు ఒక అమాయకురాలైన బీద అమ్మాయి," అన్నాడు చంద్రం గబగబా, అతని స్వరంలో తీవ్రత కనిపిస్తోంది

హేమ ఉలిక్కిపడి చంద్రం ముఖంలోకి చూసింది అకస్మాత్తుగా ఆమె ముఖంలోని చైతన్యం గడ్డకట్టినట్లు కనిపించింది చంద్రానికి అది చూసిన చంద్రం ముఖంలోకి ఓ కొత్తకాంతీ ఉత్సాహం ఉబికి వచ్చాయి 'దొంగ దొరికిపోయింది బతికిపోయాను,' అనుకున్నాడు చంద్రం కింది పెదవిని బిగించి వచ్చేనవ్వును ఆపుకుంటూ హేమచేతిని తన చేతిలోకి తీసుకొని గట్టిగా నొక్కాడు

హేమ ఉలిక్కిపడి చంద్రం ముఖంలోకి చూసింది కేవలం తనను ఏడిపించటానికే అలా చేశాడని తెలుసుకున్న హేమ 'అమ్మయ్య' అనుకుంది మనసులోనే. చంద్రంచేతిలోని తనచేతిని లాక్కోబోయింది కాని చంద్రం వదల్లేదు

"నాచెయ్యి వదులు నీ కాబోయేభార్య చూస్తే ఊరుకోదుసుమా," అంటూ చెయ్యి లాక్కుంది హేమ,

"ఆ అమ్మాయి చాలా మంచిది చూసినా ఏమీ అనుకోదు," అన్నాడు చంద్రం నవ్వుతూ.

"అలాగా ? అయితే ఆ అమ్మాయి ఎలా వుంటుందో కాస్త వర్ణించండి కవిగారూ ?" అంది హేమ ఎగతాళిగా

హేమను కాస్త ఉడికించా లనిపించింది చంద్రానికి వర్ణించాలంటే వెంటనే ఏరూపమూ కళ్ళకుకట్టరేదు ఇంతలో గౌరి గుర్తొచ్చింది

"వర్ణించమన్నావా ? మళ్ళీ ఉడుక్కుంటే లాభంలేదు "

"మధ్యలో నా కెందుకు ఉడుకుబోతుతనం ?"

"అలాగేం ? అయితే విను చామన

వాసిరెడ్డి సీతాదేవి

చాయకంటే ఓ చాయ ఎక్కువే అనుకో అంతఎత్తూకాదూ అంతపొట్టీకాదు కొంచెం బొద్దుగా వుంటుంది ముఖంలో దీనత్వం, కళ్ళలో అమాయకత్వం బిగ్రుగ బిగించి, రిబ్బనుకట్టి, తేలుకొండీలా చివర వంకర తిరిగి పైకిలేచి ఉండేజడ, బలేగా ఉంటుందిలే "

హేమ ముఖంలో భావపరివర్తనవిగమవించిన చంద్రం ఇంకా చెప్పుకుపోసాగాడు

'నీతో ఆ అమ్మాయిని పోల్చాలంటే ఒక్క చక్కని ఉదాహరణలో చెప్పవచ్చు "

"ఏమిటది ?" ఎంతదాచ ప్రయత్నించినా హేమ స్వరంలో ఆతృత, ఉడుకుబోతుతనం కొట్టొచ్చినట్లు కనిపిస్తూనేఉన్నాయి

"నువ్వెప్పుడయినా అడవిమల్లెను చూశావా ?" చంద్రం హేమ కళ్ళలోకి చూస్తూ ప్రశ్నించాడు. చంద్రం కళ్ళలో కదిలిపోతున్న కాంతిరేఖలనుచూసి హేమకు వళ్ళు మండిపోయింది. 'ఆ పిల్లగురించి చెబుతుంటేనే కళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నాయే, ఆ అమ్మాయిని చూస్తుంటే ఎలా వుంటాయో' అనుకుంది హేమ

"అడవిమల్లెను ఎప్పుడూ చూడలేదా హేమా ?"

"లేదు," అంది హేమ ఉబికివస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ

"నువ్వు ఎన్నోసార్లు మద్రాసు వెళ్లావు అక్కడ కదంబంలో మల్లెపూలను చూసేవుంటావు అవి దూరంనుంచి చూట్టానికి మామూలు మల్లెపూలలాగే వుంటాయి, కాని, దగ్గరగా చూస్తే మామూలు మల్లెలోని నాజూకుతనం లేకుండా కొంచం మొరటుగా కనిపిస్తాయి వాటికి మంచిమల్లెకు వుండే సుగంధంకూడా వుండదు మనస్సులను ఆకర్షించలేని ఆపూలు వెలవెల బోతుంటాయి "

"చాలా గొప్పగా వుంది పోలిక ?" ంది హేమ ఉడుకుబోతుతనంతో.

ాషాగా మొదలుపెట్టిన చంద్రం ాతూంటే గౌరి కళ్ళకుకట్టినట్లు అయింది

"అవును, ఆ అమ్మాయికూడా అందంలో నీకు తీసిపోదు కాని, మంచిపోషణ లేని శరీరం, కాయకష్టానికి అలవాటు పడ్డ శరీరం కావటంవల్ల నీ అంత నాజూకుగా కనిపించదు విద్యాగంధం లేదు సభ్య సమాజంలో పెరగలేదు కాబట్టి హృదయ వికాసంలేదు ఆమెకూ అన్ని అవకాశాలూ వుంటే . నీలాగే ."

"చంద్రం ! ఇక చాలు ఆపు !" అంది హేమ ఆవేశంగా

చంద్రం ఆవేశంనుంచి బయటపడ్డాడు తను అనుకున్న దొకటీ, మాట్లాడింది మరొకటీ. గౌరిస్థితీ, గౌరిలాంటి ఆ పిల్ల స్థితీ తలుచుకొని తను అసలు విషయం మర్చిపోయి, ఆవేశంగా ఏదో ఏదో మాట్లాడేశాడు తనను తను సంబాళించుకున్నాడు ప్రశాంతంగా హేమ ముఖంలోకి చూశాడు

కందగడ్డలా, కోపంతో, అవమానంతో ఎర్రబడ్డ హేమ ముఖం చూసి చంద్రం పక్కున నవ్వాడు, ఇదంతా తనను ఏడిపించటానికి అల్లిన ఓ కట్టుకథ మాత్రమే అని తెలుసుకొన్న హేమ మనస్సు శాంతపడింది

"మొత్తంమీద రచయిత వనిపించుకున్నావు ?" అంది హేమ కోపాన్ని అభినయిస్తూ

"బాబాయ్ ! అమ్మ భోజనాలకు పిలుస్తూంది " అంటూ జారిపోతున్న ఓణీ సర్దుకుంటూ పరుగెత్తుకొచ్చింది రజని

"ఓణీ వేసుకుంటే రజని పెద్దపిల్లలా వుందికదూ చంద్రం,"అంది హేమ,రజనిని చూసి నవ్వుతూ. పవిట సర్దుకుంటున్న రజని నెత్తిమీద చిన్నగా మొట్టికాయవేశాడు చంద్రం

"ఏంటయ్యా ! కొడతావ్ ?" అంటూ రజని బాబాయి చెయ్యిపట్టుకొని బయలుదేరింది

భోజనాల దగ్గిర అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. ఎన్ని విషయాలో చర్చించుకున్నారు వదినెగారు మరదికి విస్తట్లో మరీమరీ వడ్డించింది

తను పుట్టిన ఇంట్లో, తనవా రందరి మధ్య, ముఖ్యంగా హేమపక్కన, కూర్చొని భోజనం చేస్తున్న చంద్రానికి తనఅంత అదృష్టవంతుడు ఇంకొకడు లేడనిపించింది

"చంద్రం చూడునాయనా ! పెద్దవాణ్ణి చెబుతున్నాను మరోలా భావించకు "

ప్రసాదరావు ప్రారంభించిన ఉపోద్ఘాతం అర్థంకాక ప్రశ్నార్థకంగా చూశాడు చంద్రం

'నీ ఇల్లూ వాకిలీ, ఇంతఆస్తీ ఉన్ననీవు ఎక్కడో ఎవరింటనో పడివుండాల్సిన కర్మేంకాలింది చెప్పుచంద్రం! మీ అన్నయ్య ఎంత బాధపడుతున్నాడో తెలుసా ?"

చంద్రం ముఖం చిట్లించుకున్నాడు. ఏదో అనాలన్నంత ఆవేశం వచ్చింది కాని గొంతులోని మాటల్ని నోటివరకూ రానివ్వకుండా అణచుకున్నాడు. అందరూ అంత ఆనందంగా వున్న ఆసమయంలో తను ఆవేశంతో అశాంతిని రేపటం మంచిది కాదనుకున్నాడు చంద్రం

చంద్రం మౌనాన్ని అంగీకారంగా తీసుకున్న ప్రసాదరావు "ఈ రాత్రికే సామాను తెచ్చేసుకో చంద్రం,'' అన్నాడు ఉత్సాహంగా.

చంద్రం అన్నముఖంలోకి చూశాడు. కృష్ణారావు కళ్ళల్లో ఆదుర్దా స్పష్టంగా కనిపించింది కాంతమ్మ అప్పుడే వంటింటి వైపు వెళ్ళటంవల్ల ఆమె అభిప్రాయాన్ని తెలుసుకోలేకపోయాడు చంద్రం అతని కళ్ళు అప్రయత్నంగానే హేమ వైపుకు మళ్ళాయి తలవంచుకుని పళ్ళెంలో పులుసన్నం కలుపుతున్న వైఖరి చూస్తే, హేమ మనస్సు ఎక్కడోఉన్న ట్లనిపించింది హేమ తలఎత్తి చంద్రంవైపు చూసింది

"వచ్చెయి చంద్రం కనీసం నాకోసమయినా వచ్చెయి,'' హేమ కళ్ళతోనే

ప్రాధేయ పడుతున్నట్లనిపించింది చంద్రానికి

"వచ్చెయ్! బాబాయ్! నువ్వు రాకపోతే నేనూ నీ దగ్గిరకే వచ్చేస్తా." రజని ఏడుపు గొంతు విన్న చంద్రం ఉలిక్కిపడ్డాడు

"వస్తానమ్మా! ఇకనుంచి ఇక్కడే ఉంటాను." అన్నాడు చంద్రం ఆలోచించ కుండానే

అందరి ముఖాలూ ఆనందంతో వెల్లి విరిశాయి హేమముఖం మెర్క్యురీ లైటులా ఒక్కసారి వెలిగింది

"భోజనం కాగానే నువ్వూ రజనీ కార్లో వెళ్ళి సామాను తెచ్చేసుకో." అన్నాడు కృష్ణా రావు సంతోషంగా.

"ఇవ్వాళకాదు ప్రకాశం ఉళ్ళోలేదు ప్రకాశం వచ్చేంతవరకూ నేను అక్కడే వుంటాను అతను రేపో ఎల్లుండో రావచ్చు ఆ తరవాత ప్రకాశానికి చెప్పి రెండు మూడు రోజుల్లో వచ్చేస్తాను." అన్నాడు


ఆమాట లంటున్నప్పుడు చంద్రంముఖం లోని గాంభీర్యాన్ని చూసి అంతకంటే బల వంతంచేసే ధైర్యం ఎవరికీ లేకపోయింది

భోజనా లయాయి తాంబూలాలు వేసు కుంటూ అంతా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు

ఇంతలో పనిమనిషి వచ్చి ఎవరో అమ్మాయి చంద్రంబాబుకోసం వచ్చిందనీ, వెళ్ళమంటే వెళ్ళకుండా గంటసేపటినుండి గేటులో గొడవ చేస్తుందనీ చెప్పింది అన్ని కళ్ళూ చంద్రం వైపు తిరిగాయి - ఆశ్చ ర్యంగా, అనుమానంగా చంద్రంకూడా ఏమీ అర్థంకాక ఓక్షణకాలంపాటు తెల్ల బోయాడు

వెంటనే అతని బుర్రలో గౌరి మెరు పులా మెరసింది గాబరాగా లేచి బయట కొచ్చాడు గౌరి గేటులో గూర్ఖావాడితో తగాదాపడుతూంది లోపల ప్రవేశించటానికి

గౌరిని చూడగానే చంద్రంలోని నవ నాడులూ కుంగిపోయాయి అంతలోనే



అంతులేని కోపంవచ్చింది గబగబా రెండు అంగల్లో గేటు చేరాడు.

"ఏం? మళ్ళీ ఇక్కడి కెందుకొచ్చావ్?" గద్దించాడు చంద్రం.

"ఎనిమాకు తీసుకెళతానని ఆ నరకం లోకి తోస్తావా? నిన్నేమో మంచివా డనుకున్నాను అన్నీ దొంగమాటలే." తిరిగి తిరిగి అలసిపోయివున్న ఆమె గొంతులోకోపం, దుఃఖం పెనవేసు కున్నాయి. కళ్ళలోతిరిగిన నీటిని బలవం తంగా ఆపుకుంటూంది కటకట తెగకుండా.

గౌరిమీద చంద్రానికి జాలివేసింది. కాని, వెంటనే తన పరిస్థితి జ్ఞాపకంవచ్చి గాబరా పడ్డాడు

"అనవసరంగా గొడవచెయ్యకు. ముందు ను వ్విక్కడినుంచి పోతావాపోవా?" బెది రించినట్లు అన్నాడు చంద్రం.

"పోతాను, ముందు నాపెట్టె నాకిచ్చెయ్యి అందులోనే నాబట్టలూ, సామానూ ఉంది ఇంటితాళంచెవు నీదగ్గరేగా వుంది" అంది రోషంగా గౌరి. కన్నీరుకట్టలు తెంచుకు

అప్పటికే ఇంట్లోవాళ్ళంతా బయ

ఇద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తున్నారు. రజని పక్కనే నిల్చొని తమాషా చూస్తున్నట్లు ఆనందిస్తున్నది

గౌరి పలికిన చివరిమాటలు అందరి మనస్సులో అనుమానాన్ని ధృవపరచింది. కాంతమ్మ భర్తముఖంలోకి చూసి అదోలా వ్యంగ్యంగా నవ్వింది కృష్ణారావు తల సిగ్గుతో, అవమానంతో వాలిపోయింది గబగబా లోపలకు వెళ్ళిపోయాడు ప్రసాదరావు కళ్ళలో అనుమానం, ముఖంలో జుగుప్స ఉబికివచ్చాయి హేమకు దుఃఖం వచ్చింది అంతలోనె చంద్రం అంతకు ముందే చెప్పినమాటలు గుర్తొచ్చాయి ఈ అమ్మాయి అచ్చం చంద్రం వర్ణించిన అమ్మాయిలాగే వుంది హేమ మనస్సంతా ఏదో అసహ్యంతో నిండి చీదర చీదరగా [illegible]ంది.

[illegible]రిముఖాలవైపూ మార్చి [illegible]డు. తను ఎలాటి పరిస్థితిలో [illegible] తెలుసుకున్నాడు ఒక్క [illegible]ంటూ [illegible]క్కడ నిల్చోలేక పోయాడు [illegible]గా గేటు తెరచుకొని బయటకు వెళ్ళిపోయాడు

"బాబాయ్...ఎక్కడకు ? నేనూవస్తా" పరిస్థితిని అర్థంచేసుకోని రజని అమాయకంగా అంటూ బాబాయ్‌చెయ్యి పుచ్చుకుంది

చంద్రం ఆగి, ఆప్యాయంగా రజని తలమీద నిమిరాడు కళ్ళలో నీరు తిరిగింది "నువ్వన్నా నన్నర్థం చేసుకోమ్మా." అన్న భావం రజని తల నిమురుతున్న అతనిచేతి స్పర్శలో ఇమిడివుంది ఏదో అనబోయాడు ఇంతలో కాంతమ్మ సుడిగాలిలా వచ్చింది రజని చెయ్యి పట్టుకొని బిరబిరా లోపలకు ఈడ్చుకుపోయింది

"ఆ బజారుమనుషుల్తో నువ్వెక్కడికి పోతావే ?" లోపలకు వెళుతూ అన్న కాంతమ్మ ఎత్తిపొడుపుమాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి చంద్రం చెవులకు

గౌరి రెక్క పట్టుకొని మొదటగా నకు లాక్కెళ్ళాడు చంద్రం. ఎదురుగా వస్తున్న రిక్షాను ఆపి గౌరిని ఎక్కమని తనూ ఎక్కి కూర్చున్నాడు

చంద్రంలో కోపం పొగలు కక్కుతూంది మరోవైపు బాధ, అవమానం ఇన్నిటికీ కారణమయిన గౌరిని నమిలి మింగేయాలనిపిస్తోంది చేతి వేళ్ళతో కణతలు నొక్కుకుంటూ తనను తనే సంబాళించుకోటానికి ప్రయత్నిస్తున్నాడు చంద్రం బుర్ర పనిచేయటం మానేసింది ఏ ఆలోచనా లేదు కేవలం ఏదోహోరుతో తల బద్దలవుతూంది

గౌరికి తను చాలా పెద్ద తప్పే ఏదో చేశానని అర్థం అయింది. భయంతో రిక్షాలో ఒదిగి ముడుచుకుని కూర్చుంది, ఏ క్షణంలో బద్దలవుతుందోనని భయపడుతూ అగ్నిపర్వతం పక్కనే కూర్చొని వున్న మానవుని మానసిక పరిస్థితిలా వుంది గౌరి మానసికస్థితి

రిక్షా కొరిటపాడు చేరింది. అప్పటికే పదిన్నర అయింది గుడిసెల్లో సందడి సద్దుమణిగిఉంది చంద్రం రిక్షావాడికి డబ్బిచ్చి యంత్రంలా ప్రకాశం ఇంటివైపు నడిచాడు గౌరి బిక్కుబిక్కుమంటూ చంద్రం వెనకే వెళ్ళింది

చంద్రం తాళం తీసి లోపలకు వెళ్ళాడు గౌరి ఇంట్లోకి వెళ్ళటానికి జంకుతూ వాకిట్లోనే నిలబడింది మరో క్షణంలో చేతిలో ట్రంకుపెట్టెతో చంద్రం బయటకు వచ్చాడు ఆ పెట్టెను 'దభీ' మని గౌరి కాళ్ళముందు పడేసి గిర్రున వెనక్కు తిరిగి వెళ్ళి తలుపుగడియ పెట్టుకున్నాడు

మంచంమీద నడుం వాల్చిన చంద్రానికి దుఃఖం పొర్లుకొచ్చింది. కళ్ళవెంట నీళ్ళు కారిపోతున్నాయి కొంతసేపటికి తలలో హోరు తగ్గింది మనస్సుకు కొంత ఆలోచించే శక్తి వచ్చింది

ఎవరో ఏడుస్తున్న వెక్కిళ్ళు వినిపించాయి చంద్రానికి అయితే గౌరి వెళ్ళిపోలేదన్న మాట ! తను ఎంత మొరటుగా ప్రవర్తించాడు తన సంస్కారం ఇంతేనా ? అర్ధరాత్రిపూట ఆ పిల్ల ఎక్కడకు వెళుతుందనీ – తను ఎందుకు ఆలోచించలేకపోయాడు ?

ఎందుకు ఆలోచించాలి ? ఆ పిల్ల ఎవరూ ? తనెవరూ ? తనను గురించి ఎవరు బాధపడుతున్నారు ? అలా జాలిపడేగా ఇప్పుడు ఇంత అవాంతరం కొనితెచ్చుకున్నాడు !

గౌరి వెక్కిళ్ళు అంతకంతకూ తారస్థాయి నందుకొంటున్నాయి చంద్రం మనస్సులో చెయ్యిపెట్టి కలచినట్లయింది టవల్ తీసి చెవులకు గట్టిగా చెవులమీదగా తలకు చుట్టుకున్నాడు ఆలోచనలను కట్టిపెట్టి నిద్రపోవటానికి ప్రయత్నించాడు

తనను విధి ఎందుకు ఇలా ఆడిస్తోంది ఒక గంటక్రితం తనకన్నీ ఉన్నాయనీ, ప్రపంచంలో తన అంత అదృష్టవంతుడు లేడనీ అనుకున్నాడు కాని అంతలోనే విధి తనఅంత దురదృష్టవంతుడు లేడని రుజువు చేసింది మానవుణ్ణి ఆడించే సూత్రాలు విధి చేతిలో వుంటాయా ? మానవుడు కేవలం నిమిత్తమాత్రుడేనా ? తనకు తెలిసి తను ఎలాటి పాపమూ చెయ్యలేదే ? మరి తనకు ఈ శిక్ష ఏమిటి ? తన అదృష్టంలో తనవాళ్ళనేవారిదగ్గర వుండేరాత లేదా ?

ఈ గౌరి ఎవరు ? ఎక్కడ పుట్టిందో ఎక్కడ పెరిగిందో ! తన జీవితంలోకి అకస్మాత్తుగా సుడిగాలిలా ఎందుకు ప్రవేశించాలి ?

తన అన్నా వదినా తనవంక ఎలా చూశారు ? వదినెముఖంలోని ఆ నవ్వును తను జన్మలో మరచిపోలేడు అంతవరకూ ఆమె చూపిన ఆదరణ కేవలం నటన మాత్రమేనా ? తన అన్న అవమానంతో అభిమానంతో తలదించుకున్నాడు తను అంత అవమానకరమైన పని ఏం చేశాడు? ప్రసాదరావు చూపులో ఎంత తిరస్కారం ?

హేమకూడా తనను అనుమానించింది ఆరోజుకూడా ఇలాగే తనను దొంగగా అను

మానించింది ఆమె హృదయసంస్కారం అంతేనా ?

వాళ్ళ నెందుకు నిందించాలి? ఆ పరిస్థితులు అలా వచ్చాయి

తను ఎంత పొరపాటుపని చేశాడు? హేమను పరీక్షించటానికి తను మరో అమ్మాయిని వివాహం చేసుకోబోతున్నట్లు చెప్పాడు పైగా ఆ పిల్లను, గౌరినిదృష్టిలో పెట్టుకొని, వర్ణించాడు అంతలోనే గౌరి అక్కడకు రావటం, హేమలో అనుమానం ప్రవేశించటంలో ఆశ్చర్యంలేదు మళ్ళీ హేమకు తను ముఖం ఎలా చూపించగలడు ఇక తనను వా రెవరూ నమ్మలేరు తన ఆశలన్నీ అడియాశ లయాయి ప్రకాశాన్ని చూసి తను శాశ్వతంగా ఆంధ్రదేశంనుంచి వెళ్ళిపోతాడు! ఎక్కడకు ?

ఇక ముందుకు ఆలోచించలేకపోయాడు లేచి టైం చూశాడు మూడు అయింది బయట ఎలాటి అలికిడీలేదు గౌరి వెళ్ళి పోయి వుంటుందా? ఈ అర్ధరాత్రిపూట ఎక్కడకు వెళ్ళి వుంటుంది!

కుతూహలం కొద్దీ తలుపుతీసుకొని బయటకు వచ్చాడు బయట గుడిసెముందు వసారాలో ఒకమూల ముడుచుకొని వుంది గౌరి వెన్నెల ముఖంమీద పడుతూంది కన్నీళ్ళతో తడిసిన ముంగురులు చెంపలకు అతుక్కుని వున్నాయి పెదవులమీద చిరునవ్వు, మంచి నిద్రలోవున్న ఆమెమొఖం అమాయకత్వానికి, ప్రతిబింబంలా కనిపిస్తూంది నిద్రలో నవ్వుతూంది. 'బహుశా ఈ ప్రపంచంలో ఆశించి అందనివస్తు వేదో ఆమెకు స్వప్నంలో అందుతున్నట్లు కనిపిస్తోందేమో' అనుకున్నాడు చంద్రం

అలా వంటరిగా చలిలో నిద్రపోతున్న గౌరిమీద చంద్రానికి జాలివేసింది తను చాలా కఠినంగ ప్రవర్తించానని బాధపడ్డాడు

వంగి గౌరిని కుదుపుతూ లేపాడు ఉలిక్కిపడి లేచికూర్చుంది గౌరి ఎదట నిలుచున్న చంద్రాన్ని చూసింది భయంగా.

"లే లోపలికి వచ్చి పడుకో రేపు తెల్లవారగానే వెళ్ళిపో," అంటూ లోపలకు వెళ్ళాడు చంద్రం

గౌరి నిద్రమత్తులోనే పెట్టెతీసుకుని లోనికి వెళ్ళింది.

(సశేష

అశ్రుమాల

జి.



బెదరింపుల్ పనిలేదు యుద్ధమునకున్
విచ్చేయు మీ శక్తి చూ
పెదమంచుందొడగొట్టి శాత్రవుల
యుద్వేగంబు చప్పంబడన్
గదమాయించిన యుక్కుగుండెల
యుదగ్రస్వాంతుడౌ శాస్త్రి, మా
యొదలందగ్ని రగల్చి మృత్యువశుడ
య్యెన్ లోకమల్లాడగన్
ఏ విమానమెక్కి యేగెనో తాష్కెండు
కా విమానమందె హస్తిపురికి
వచ్చెనయయొ శాస్త్రి భౌతిక దేహంబు
కాలుడెట్టి యైంద్రజాలికుండో
తలపం గుండెలు పిండియయ్యెడి
వయా తాష్కెండు మార్గంబు వే
ల్పుల వాసంబునకున్ సమీపమని
కాబోల్ ఢిల్లికింరాక చ
ర్చలు సంపూర్ణ జయప్రదంబులయి
దేశంబుల్ ప్రశంసింప, భీ
తల మాక్రందన మాచరింప
మృతివార్తా శూలమున్ దాపితే
గగనంబంటెడు సౌధరాజములతో
గర్వించు ఢిల్లీమహా
నగరంబందు ప్రధానమంత్రివయి
యుండం గొంపయున్ గోడిలే
ని నిరాడంబర జీవివై బ్రదికి శాంతిన్
గూర్చి వెన్వెంటనే
భగవత్సన్నిధి కేగితే విమతులున్
బాష్పాంజలుల్ పట్టగన్
చూపులకు వామనుండై
ఆపదలందుంద్రివిక్రమాకృతితో ను
ద్దీపించు దేశశాంతి
స్థాపకునకు శాస్త్రి కశ్రుజాలప్రణతుల్

విజ్ఞాన వినయములను గూర్చునది సద్విద్య

నిష్టల పార్వతి

"సమ్యగారాధితా విద్యాప్రబోధ
వినయావహా "

విద్య బాగుగా నేర్వబడిన ఎడల విజ్ఞానమును, వినయమును కలిగించును విజ్ఞానదాయకమై వ్యక్తియొక్క సర్వతోముఖమగు వికాసమున కుపకరించునదియే విద్య మానవుడు పుట్టుకతోడనే పరిపూర్ణత జెందిన వ్యక్తి కానేరడు వ్యక్తి సర్వతోముఖమగు విజ్ఞానాభివృద్ధిని బడసి దాన [illegible]వికాసాభివృద్ధి నొనర్చుట విద్యయొక్క [illegible]ము. వ్యక్తులను ఆదర్శప్రాయులగను, [illegible]లగను, ప్రతిభావంతులు [illegible]నది విద్యావిధానము మాన[illegible] సిద్ధముగనే కొన్ని శక్తు[illegible] (talents) ననియు, వాటిని ప్రక[illegible]సి ప్రకాశింపచేయునదే విద్యయని [illegible] పలువురు విద్యావేత్తల యాశ[illegible]ము. ఈ విషయము రఘువంశ కావ్య[illegible] కాలమున గ్రహింపబడి యాచరించ[illegible]చుండెడిదని క్రింది శ్లోకమువలన దెలియనగును

"దియః సమగ్రైః సగుణైః రుధాఃరధీః
క్రమాచ్చతస్రశ్చతురర్ణ వోపమాః '
(3వ సర్గ, 30 శ్లోకము)

రఘు మహారాజు తన ధీగుణములచే విద్యలను గ్రహించి తరించెను

"శుశ్రూషా, శ్రవణమ్, గ్రహణమ్, ధారణమ్, ఊహాపోహమ్, అర్థవిజ్ఞానమ్, తత్వజ్ఞానమ్" అనునవి ధీగుణములు.

ఆనాడు పదునాలుగు విద్యలు (నాలుగు వేదములు, ఆరువేదాంగములు, మీమాంసా, [illegible]యవిస్తరణము, పురాణములు, ధర్మ[illegible]) గరుపబడినవని తెలియుచున్నది.

"విత్తస్య విద్యాపరిసంఖ్యయామే
కోటీశ్చతస్రోదశచాహరేతి''
(5వ సర్గ, 21 శ్లో-ము)

అస్త్రవిద్య, శిల్పశాస్త్రము, నౌకాశాస్త్రము, భూగర్భశాస్త్రము, వైద్యశాస్త్రము మొదలగు వృత్తివిద్యలు, ఆధ్యాత్మికవిద్య (spiritual education) బోధింపబడు చుండెను క్రమశిక్షణ కత్యంత ప్రాధాన్య మీయబడినది వ్యక్తుల సద్గుణములను బెంపొందించి, వారికి పౌరధర్మములందు శిక్షణ నిచ్చి, వారి మనోవికాసమునకు దోహదమొనర్చిన దానాటి విద్య. సహనమునకును, సహజీవనమునకును సహకారమగున దానాటి విద్యావిధానము స్త్రీలుగూడ వర్ణాశ్రమధర్మములను, రాజనీతిని, రాజుల చరిత్రను దెలిసికొనియుండిరి వారుగూడ విద్యావంతులుగ నుండెడివారు.

వృత్తుల ననుసరించిగదా చాతుర్వర్ణ విభజన జరిగినది అందువలననే వృత్తిని నేర్చినను వ్యక్తి సమాజమున కుపకారకుడే యగుచుండును వృత్తి విద్య యందు స్వయంపోషకత్వమేగాక సమాజశ్రేయస్సు గూడ నాధారపడియున్నది. రఘువంశము నామూలాగ్రముగ పరిశీలించిన చాతుర్వర్ణ్యము వారికి గరుపబడిన వివిధ విద్యల గురించి తెలియును కౌత్సుడను బ్రాహ్మణుడు వరతంతు మహామునివద్ద పదునాలుగు విద్యలతో శిక్షితుడయినట్లు ఐదవ సర్గలో పేర్కొనబడినది బ్రాహ్మణులకు వేదవేదాంగములు, పురాణ ధర్మశాస్త్రములు, మీమాంస శాస్త్రములు బోధించబడుచుండెడివి వసిష్ఠ వాల్మీక్యాది ఋష్యాశ్రమములలో అన్ని వర్ణములవారికి విద్య గరుపబడిన ట్లువవర్ణితంబగుటం జేసి ఋషులు-ఉపదేశలు సర్వ శాస్త్రపారంగతులని దెలియుచున్నది వీరు యజ్ఞయాగాదులను నిర్వర్తించుటగూడ ప్రజాక్షేమమునకే యని ఈ క్రింది శ్లోకము చెప్పుచున్నది

"హవిరావర్జితం హోతస్త్వయా విధివద
గ్నిషు వృష్టిర్భవతి సస్యానామవగ్రహ
విశోషిణామ్॥ (1వ సర్గ, 62 శ్లో)

కుశనిర్మితమైన యయోధ్యానగర వర్ణనావసరంబున వివిధ పణ్యములతో భాసించు తత్పుర విపణవీధు లీరీతి వర్ణించబడెను.

"పురాబభాసే విపణిస్థపణ్యాః"
(16వ సర్గ, 41 శ్లో)

వణిజుల కుచితరీతి విద్య గరుపబడనిచో వాణిజ్య మభివృద్ధి చెందదు వాణిజ్యమందు గూడ శిక్షణ యిచ్చినట్లు తెలియుచున్నది వాణిజ్యాభివృద్ధి దేశాభివృద్ధికే యుపకరించును. వాణిజ్య విద్యా శిక్షణ లక్ష్యముగూడ దేశక్షేమమే క్షత్రియులనగా ఆపన్నులను రక్షించువారు, పరిపాలకులు క్షాత్రధర్మములు బాగుగా తెలిసికొనినవారు రఘువంశ రాజులని ఈ క్రింది శ్లోకమువలన తెలియుచున్నది

"క్షతాత్కిలత్రాయత ఇత్యుదగ్రః
క్షత్రస్యశబ్దోభువనేషు రూఢః
రాజ్యేనకిం తద్విపరీత వృత్తేః
ప్రాణైరుపక్రోశమలీమసైర్వా
(2సర్గ, 53శ్లో)

శిష్టరక్షణ, దుష్టశిక్షణల కనువైన విధముననే వారు తర్ఫీదునొందిరి బాల్యమువనే యన్నిరంగములయందును సుశిక్షితులైనట్లు గన్పడుచున్నది. ("శైశవే అభ్యస్త విద్యానాం'' (1వ సర్గ, 8 శ్లో) మూడవ

సర్గలో "ధియః సమగ్రైః" యను శ్లోకము వలన అన్వీక్షికీ, వార్తా, త్రయీ, దండనీతి యను నాలుగువిద్యలు గరుపబడినట్లు జెప్పబడినది క్షత్రియులకు పరిపాలనా విధానము, సైనిక శిక్షణ (civil and military sciences) ల యందుగూడ ప్రావీణ్య మొసగబడినది న్యాయమైన పన్నులు విధింపబడి ఆ ధనము ప్రజాహితముకొఱకే వినియోగింపబడుచుండెను

''ప్రజానామేవ భూత్యర్థం
సతాభ్యో బలిమగ్రహీత్
సహస్రగుణ ముత్స్రష్ట
మాదత్తేహిరసంరవిః (1సర్గ, 18శ్లో)
''కోశేనాశ్రయణీయత్వమితి తస్యార్థ
సంగ్రహః (1 సర్గ, 6శ్లో)

న్యాయవిచారణగూడ నిష్పక్షపాతముగా జరుపబడినది

"ద్వేష్యోపి సంమతః శిష్టస్తస్యార్తస్య
యథౌషధమ్
త్యాజ్యో దుష్టః ప్రియోప్యాసీదం గుళీవోరగక్షతా (1 సర్గ, 28 శ్లో)

రాజులు న్యాయమూర్తుల సహాయముతో న్యాయవిచారణ జరిపెడివారు

"సధర్మస్థ శఖః శశ్వదర్థి ప్రత్యర్థినాం
స్వయమ్ (17 సర్గ, 39 శ్లో)

దుర్గ నిర్మాణము, దుర్గ రక్షణాది రాజ్య రక్షణా విధానములందారితేరినవారు విదేశ దండయాత్రలు జరుపు సమయమున కోటలు బలపరచుకొనెడివారు సైనికుల సౌకర్యార్థము అటవీ నిర్మూలనము, ఆనకట్టల నిర్మాణము జరిపిరి

''మరుపృష్ఠాన్యుదంభాంసి నావ్యాః సుప్రతరాః నదీః (4 సర్గ, 31 శ్లో)

కీర్తికాములై, ధర్మార్థమే రణరంగమున కేగెడివారు గాని రాజ్యలోభత్వముచే గాదని ఈ దిగువశ్లోకము చెప్పుచున్నది

''గృహీత ప్రతిముక్తస్య
సధర్మ విజయీ నృపః
శ్రియం మహేంద్రనాధస్య
జహార నతుమేదినీమ్ (4సర్గ, 43శ్లో)

''మౌలం భృత్యః సుహృచ్ఛ్రేణీ ద్విషదాటవికం బలం" ఇట్లు ఆరు విధములుగా సేనను విభజించిరని గన్పట్టుచున్నది

"షడ్విధంబల మాదాయ ప్రతిస్థే దిగ్జిగీషయా (4స, 26శ్లో) అజమహారాజు సంధి మొదలగు యారు పద్ధతులను విదేశ వ్యవహారములలో నుపయోగించెను యుద్ధములు జేసి రాజ్యము విస్తరింపచేయుటయే గాదు రాజుల కర్తవ్యము ప్రజారక్షణ, ప్రజాపోషణ విద్యావ్యాప్తి మొదలగు ప్రజాహిత కార్యములుగూడ వారి కర్తవ్యములే యని దెలిసికొని వానికై పాటుపడిరి. విద్యావ్యాప్తి ప్రజారక్షణ, ఆర్థిక సంపదలపైననే దేశ క్షేమ మాధారపడినది ప్రజలను గన్నబిడ్డల వలె పాలించిరని ఈ దిగువ నుదహరించిన శ్లోకము చాటుచున్నది

"ప్రజానాంవినయాధానాద్రక్షణాద్భరణా
దపిసపితా పితరస్తాసాం కేవలంజన్మహే
తవపః" (1 సర్గ, 24 శ్లో)

గురుదక్షిణార్థియై వచ్చిన కౌత్సుని కొఱకు రఘుమహారాజు యుద్ధసన్నద్ధుడాయెను కుశలవుల గాన మాధుర్యంబునకు సంతుష్టాంతరంగుడై రాముడు తన శరీరము దక్క సర్వము వాల్మీకిమహర్షి కర్పించెను

"ఊరీ కృత్యాత్మనోదేహం రాజ్యమస్మైన్యవేదయత్" (15 సర్గ, 70 శ్లో)

కుశుడు తన కుమారుడైన యతిథిని కుల విద్యలయందు సుశిక్షితుని చేసెను

"తమాదౌ కులవిద్యానామర్థ మర్థవిదాం వరః" (17 సర్గ 3 శ్లో)

ఈ పైన పేర్కొనబడిన విషయములను విమర్శించిజూడ క్షత్రియులకు అస్త్ర విద్య, న్యాయశాస్త్రము, అర్థశాస్త్ర నీతి శాస్త్రములందు శిక్షణ యీయబడినట్లును, ప్రజాక్షేమమే వారి విద్యయొక్క పరమార్థంబనియు దెలియుచున్నది నాల్గవ వర్ణమువారికి తమతమ వృత్తి విద్యలలో తర్ఫీదు యొసంగబడినట్లు గానవచ్చుచున్నది కళలలో శిక్షణ యీయబడినది. అయోధ్యా పునఃనిర్మాణ ఘట్టమున యీ విధమైన వర్ణన గలదు

"తాం శిల్పసంస్థాః ప్రభుణా నియుక్తాస్తథాగతాం సంభృత సాధనత్వాత్ పురం నవీచక్రుః" (16 సర్గ, 38 శ్లో)

"నౌ విమానైః," (16 స, 68 శ్లో) యను దానివలన వివిధాకారములలో నౌకా నిర్మాణము జరిగినట్లు తెలియుచున్నది రఘుమహారాజుయొక్క దిగ్విజయ యాత్రా సందర్భమున వంగదేశీయులు నౌకాబలము కలవారనియు, నౌకాసహాయమున నదులను దాటినట్లును జెప్పబడినది

"నావ్యా సుప్రతరా నదీః" (4 సర్గ, 31 శ్లో) దీనిని బట్టి నౌకా సంబంధమైన విద్యయందు నిపుణులుండియుండిరని స్పష్టమగుచున్నది భూమి, నిధులయందలి రత్నములు నుపహారముగా నొసగి శంఖుని సేవించెను ''ఖనిభిః సుషువే రత్నం" (17 స, 66 శ్లో) పై దానివలన గనుల నుండి రత్నములను త్రవ్వి తీయుట ఆ కాలములోనే తెలియునని స్పష్టమగుచున్నది గనులు, తత్సంబంధ శాస్త్ర బోధన జరిగి యుండెడిది గర్భిణీ స్త్రీల యారోగ్య విషయములో నిపుణులైన వైద్యులుండిరని ఈ క్రింది శ్లోకము నిరూపించుచున్నది

మార "కుభృత్యా కుశలైరనుష్ఠితే భిషగ్భిరాప్తై రధగర్భ భర్మణి" (3 స, 12 శ్లో)

వైద్యశాస్త్రాభివృద్ధి కిది నిదర్శనము పై విషయములన్నియుఁ జూడ శాస్త్రములు, కళలు బోధించబడినట్లును, ప్రతి వ్యక్తియు సమాజమున కుపయోగమైన విద్య నేర్చినట్లును తెలియును ఆ కాలమున సమాజ శ్రేయస్సు విద్యయొక్క యాశయమయినట్లు తెలియుచున్నది

వ్యక్తుల మనో వికాసమునకు తోడ్పడునది ఆధ్యాత్మిక విద్య (Spiritual education) మానవులు ధర్మచ్యుతులు గాకుండుటకై యేర్పడినవి ధర్మములు వ్యక్తిగతాభివృద్ధి, సమాజ శ్రేయ జంటలక్ష్యములను బొందుటకు ధ

మోక్షములనే చతుర్విధ పురుషార్థములు మార్గములు కొన్నిటిని పరిహరించినను, అతిగా యవలంబించినను వ్యక్తిగత జీవనము, సమాజ జీవనములసమగ్రములు ధర్మరహిత అర్థకామములు, అర్థకామ రహిత ధర్మమూ వ్యర్థమగును సమగ్ర మానవ స్వరూపమును పరిగణనలోనికి దీసికొని నాడు విద్యావిధానమును నిర్ణయించినట్లు గన్పడుచున్నది అతిథియను రాజు ధర్మార్థ కామములకు సమాన ప్రతిపత్తి యొసగెను

"నధర్మ మర్థకామాభ్యాం బబాధే నచతేనతౌ నార్థం కామేన కామం వానోర్థేన సదృశస్త్రిషు" (17 సర్గ, 37 శ్లో) దీనికి వ్యతిరేకముగా ప్రవర్తించిన రాజు అగ్నివర్మ భోగలాలసుడై స్వధర్మమునే మరచి ధర్మచ్యుతుడై వినాశము దెచ్చుకొనెను మిగిలిన రాజులు క్షాత్రధర్మమును, ఆధ్యాత్మిక జ్ఞానములను సమన్వయముజేసి గీర్తి గాంచిరి.

"స బభూవ దురాసదః పరైః గ్గురుణా థర్వ విదా కృతక్రియః పవనాగ్ని సమాగమోహ్యయం సహితం బ్రహ్మయదస్త్ర తేజసః" (8 స, 4 శ్లో)శౌర్య వర్జితమైన నీతి భీరుత్వము, నీతిరహిత శౌర్యము పశు ప్రవృత్తియని దెలసికొనిరి "

"కాతర్యం కేవలా నీతిః శౌర్యం శ్వాపద చేష్టితమ్" (17స, 47శ్లో) రఘుమహారాజు యొక్క ఆధ్యాత్మిక సంపద, అజ మహారాజుయొక్క ఆర్థిక సంపదతో బోల్చబడినది దీనినిబట్టి విద్యావిధానములో శౌర్యమునకును, నీతికిని సమానప్రాధాన్యత నిచ్చినట్లు స్పష్టమగుచున్నది వ్యక్తిలో చైతన్యమునకు కేంద్రస్థానము ఆత్మ ఆత్మకు విద్యలో ప్రాధాన్య మీయబడినది

క్రమశిక్షణ బాల్యమున యలవరచుకొనగినది దినచర్యయందు కొన్ని నియమము, బాటించుటవలననూ, మనోనిగ్రహము ననూ క్రమశిక్షణ యలవడును రఘువంశరాజుల దినచర్యను జూడ, వారు క్రమబద్ధమైనజీవితము గలవారనితెలియును

"యథా విధి హుతాగ్నీనాం యథా కామర్చితార్థినామ్ । యథాపరాధ దండానాం యథాకాల ప్రబోధినమ్" (1 స, 6 శ్లో) త్యాగాయ సంభృతార్థానాం ప్రజాయై గృహమేధినామ్ (1 స, 7 శ్లో) బాహ్యమైన క్రమశిక్షణకు మూలము ఆంతరంగికమైన శిక్షణ అతిథి కామక్రోధాదులను జయించి శత్రువులను జయించెను క్రమబద్ధముకాని జీవనము నీతిబాహ్య మగును ప్రజలు నీతిబాహ్యులయిన సమాజము పతనము నొందును ఆధ్యాత్మికజ్ఞానము, నీతి, క్రమశిక్షణ యనునవి పరస్పర బద్ధములైనవి ఈ పై నుదహరించిన యంశములు జూడ నాటి విద్యావిధానమున క్రమశిక్షణకు ప్రాముఖ్యత యీయబడినట్లు విదితమగుచున్నది విద్యయొక్క యాశయములలో క్రమశిక్షణ యొకటి యని నేడు విద్యాప్రణాళికలో క్రమశిక్షణకు తావొసగబడుట మనము చూచుచున్నాము

విద్యయొక్క వేరొక పరమార్థము వ్యక్తిగతాభివృద్ధి వ్యక్తులకు సద్గుణముల నలవరచవలసినది విద్య రఘువంశరాజుల గుణవర్ణన వారి సద్గుణములను నిరూపించును జ్ఞాను లయినను వారు మౌనులు, శక్తివంతులైనను ఓర్మి కలవారు

"జుగోపాత్మానమత్రస్తో భేజే ధర్మ
మనాతురః
అగృధ్నురాదదేసో ర్థమసక్తః
సుఖమన్వభూత్।
జ్ఞానేమౌనం క్షమాశక్తే త్యాగే శ్లాఘ
విపర్యయః
గుణాగుణాను బంధిత్వాత్తస్య
సప్రసవా ఇవ।
అనాకృష్టస్య విషయై ర్విద్యానాం పార
దశ్వనః
తస్యధర్మరతే రాసీ ద్వృద్ధత్వం జరసా
వినా'' (1సర్గ, 21,22,23 శ్లో)

పైన చెప్పిన వ్యక్తిగత గుణవికాసము (Development of individual qualities) నకును, సంఘజీవనమునకు దగు గుణ (Social qualities) వికాసమునకు తోడ్పడినట్లున్నది ఆనాటి విద్య రంజింప జేయువాడు రాజు (సో అభూదన్వర్థో రాజా ప్రకృతి రంజనాత్) యని గుర్తించి ప్రజారంజకముగా ప్రవర్తించిరి ప్రభువు నకిష్టుడను నేను యని ప్రజలు భావించు చందంబున ప్రవర్తించెడివారు వీరు వీరు ప్రసన్నవదనులై స్మితిపూర్వాభిభాషణులై యొప్పిరి

రఘువంశరాజులు ఆదర్శరాజులు ప్రజలు నీతిబాహ్యులు గాకుండుటకు, వారికి దర్శప్రాయ మగుటకు రాముడు సీతను కాననముల బాలుచేసెను ఇందుమతీ వియోగమున గుందుచున్నను అజుడు కుమారుని కొఱకు ప్రాణముల నిలుపుకొనెను ధర్మనిర్వహణకొఱకు వీరు పాటుపడిరి వీరాదర్శప్రాయులుగా, బాధ్యత నెరింగిన వ్యక్తులుగా తీర్చిదిద్దబడిరి

ఆనాడు గురుకులములే విద్యాసంస్థలు గురు శుశ్రూషచేసి విద్యాపార్జన జేసెడివారు ఆనాడు బ్రహ్మచర్యమున కత్యంత ప్రాధాన్యమీయబడినది విద్యార్థి దశానంతరము గృహస్థాశ్రమము స్వీకరించెడివారు ఆశ్రమములలో స్త్రీలు, పురుషులు, అన్నివర్ణములవారుకూడ కలసియుండి విద్య నేర్చుటచే సంఘీభావము పెంపొందింపబడి సహజీవన మలవడుట కవకాశ మీయబడినది

సీత రామున కంపిన సందేశము, స్త్రీల వర్ణాశ్రమ ధర్మములు తెలిసినట్లు చూపుచున్నది ఇందుమతీ స్వయంవర సందర్భమున యామె, స్వయం వరార్థము విచ్చేసిన రాకుమారుల స్వభావమును వారి చేష్టలచేత తెలిసికొని వారు తన కనర్హులని దాటి వెడలినట్లు వర్ణించబడెను దానినిబట్టి యామె విద్యావతియని స్పష్టమగుచున్నది

"తతోనృపాణాం శ్రుతవృత్తవంశాపుం వత్ప్రగల్భీ ప్రతిహారరక్షీ"(6స,20శ్లో) యను శ్లోకముద్వారపాలిక అయినను సునంద

వాక్చాతుర్యము గలదనియు, నాటి రాజ వంశ చరిత్రను క్షుణ్ణముగా నెరిగినదనియు, పురుషులకు ధైర్యములో నేమాత్రము దీసిపోదనియు తెలుపుచున్నది. రాజులను, వారి వంశములను, వారి రాజధానీనగరములను, ఆ పరిసర ప్రాంతములను వర్ణించిన దీమె. ఉదా॥ సింహాన్వయమునకు చెందిన శూర సేనాధిపతి యయిన సుషేణుని వర్ణన. కళింగాధిపతి యయిన హేమాంగదుని వర్ణనలో యాతని రాజ్యము సముద్రతీరమందున్నట్లు ఈమె వర్ణించినది. అచ్చట తాళ వృక్షములు, సమీప ద్వీపములందు లవంగ లతలు మెండనిగూడ ఈమెకు తెలియును.

"అనేనసార్థం విహరాంబు రాశే స్తీరేషు తాళీవనమర్మరేషు ద్వీపాంతరానీత లవంగపుష్పై రపాకృత స్వేదలవామరుద్భిః (6స, 57శ్లో) స్త్రీలకు దేశచరిత్ర, భూగోళశాస్త్రమూ - ఆయా ప్రదేశమందలి యాచారములు, పంటలు మొదలయిన విషయములను గురించి బాగుగా తెలిసినట్లు కన్పడుచున్నది. దేశచరిత్ర, భూగోళశాస్త్రముగూడ నేర్చుకొనిరి ఆనాటి ప్రజలు. అగ్నివర్మ యనంతరము యతని సహధర్మచారిణి పట్టాభిషిక్తురాలయి అమాత్య సహాయమున రాజ్యపాలనము చేసినది. స్త్రీలు విద్యావంతులు, రాజ్యపాలనాదక్షులు, చారిత్రకజ్ఞానము కలవారని స్పష్టమగుచున్నది.

రఘువంశము రాజుల చరిత్ర యగుటంజేసి విద్యావిధానమువలన వా రెటువంటి జ్ఞానము సంపాదించిరో దెలిసికొనగల్గుచున్నాము. మిగిలిన వర్ణము వారుగూడ పరిపూర్ణత జెందిన వ్యక్తులని యూహించవచ్చును. ప్రజలు రాజు ననుగమించినట్లు ఈ క్రింది శ్లోకము నిరూపించుచున్నది.

"రేఖామాత్ర మపిక్షుణ్ణా దామనో వర్త్మనః పరమ్
నవ్యతీయుః ప్రజాస్తస్య నియంతుర్నేమి వృత్తయః (1స, 37శ్లో)

దీనినిబట్టి పౌరధర్మములందు శిక్షణయీయబడినట్లు తెలియుచున్నది.

ఆనాటి విద్యావిధానము వ్యక్తులను క్రమశిక్షణగల యాదర్శ పౌరులుగా తీర్చిదిద్దినది. వ్యక్తుల సర్వతోముఖాభివృద్ధి, సమాజశ్రేయస్సులే యానాటి విద్యయొక్క మహోన్నత లక్ష్యములు.

భాగ్యచక్రం

ఆరెకపూడి కౌసల్యాదేవి

జరిగిన కథ

వైద్య శాస్త్రపట్టభద్రుడు నగేష్‌యొక్క సేవాతత్పరత మామయైన శ్రీపతికి నచ్చదు సైన్యంలో వైద్యాధికారిగా చేరిన నగేష్ ప్రవర్తన వీరికి హాస్యాస్పదముగా ఉంటుంది శ్రీపతి కుమారుడు శ్రీహరికి వివాహం నిశ్చయంకాగా, సమయానికి, కట్నం అందని కారణంగా — వివాదం జరుగుతుంది పెళ్ళిపందిట్లో రసాభాస నగేష్ ప్రేమపూర్వక వచనములతో అంతమౌతుంది.

5

"అదేమిటి నాయనా, పెళ్ళికి వెళ్ళినవాడవు, అప్పుడే వచ్చేశావ్ నాలుగు రోజులుంటానన్నావ్?" శ్రీదేవి ఆశ్చర్యంగా ప్రశ్నించింది కుమారుని

శ్రీనగేష్ పరధ్యానంగా, అయిష్టంగా [illegible] చెప్పాడు, "పెళ్ళి జరగలేదమ్మా!"

"ఏమిటీ!" ఆశ్చర్యంగా అన్న శ్రీదేవి తేరుకోవడానికి అయిదు నిముషాలు పట్టింది, "ఏం, ముహూర్తం ఏకారణానైనా మారిందా?"

నిట్టూర్చాడు శ్రీనగేష్, "ముహూర్తం మారడంకాదు. మనుష్యుల మనస్సులే మారిపోయాయి ఈ దెబ్బతో పరువు గౌరవాలే మంటగలసిపోయాయి ఎంత డబ్బుంటే మాత్ర మెందుకు పదుగురిలో పలుచనై పోయినప్పుడు? కట్నం సమకూడలేదని పీటలమీది పెళ్ళి కాలదన్నుకు పోయారు ఛీ ఛీ, ఆ మగపెళ్ళివారి తరపున బంధువుగా వెళ్ళినందుకు చాలా సిగ్గుపడ్తున్నాను"

"ఎంత దారుణం! ఛీ ఛీ అన్నయ్యే యిలా ప్రవర్తించాడా? డబ్బుకోసం ఆ ఆడపిల్లబ్రతుకు బండలు చేశాడా? పాపం ఏం అఘాయిత్యానికి పాల్పడుతుందో యేమో ఆపిల్ల?"

"లేదు అదొక్కటే సంతోషకరమైన విషయం అమ్మాయి చాలా ధైర్యస్థురాలు. చెప్పుతో కొట్టినట్టు మాట్లాడి, పొమ్మంది"

శ్రీదేవి కనుబొమ్మలు ముడివేసింది, ఆలోచనాపూర్వకంగా అడిగింది, పిల్ల రూపం ఎలాగుంది?"

"అప్సరసలను తలదన్నుతూన్నది. మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతూందిట అయితేమాత్రం, డబ్బుపిచ్చిలో కళ్ళు కప్పుకు పోయినవాడికి ఆ యోగ్యతలన్నీ కన్పిస్తాయా?"

"ఆహా!" నిరసనగా, హేళనగా అన్నది శ్రీదేవి, "వాళ్ళకు కళ్ళు కప్పుకు పోయాయి, పోనీయ్, మరి ఈ వెళ్ళిన బలగమంతా తమ తమ నేత్రాలనూ, వివేకాన్నీ ఏం చేశారు? చూస్తూ ఊరుకున్నారా? నాలుగుతన్ని ఆ మూడుముళ్ళూ వేయించలేకపోయారా? లేకుంటే 'నేనూ ప్రయోజకుడిని' — అంటూ ముందుకువచ్చి ఎవడూ ఆ అమ్మాయిని ఆ అవమానం నుంచి కాపాడి చేపట్టేవాడే లేకపోయాడా? ఛీ ఎందుకొచ్చిన జన్మలు ఆడదానికి ఎక్కడయితే గౌరవం లేదో అక్కడ అంతా అనర్థమే."

నిరుత్తరుడై తలవాల్చి నిల్చున్నాడు శ్రీనగేష్

శ్రీదేవి మధుర మంద్ర గంభీర స్వరంతో అన్నది "నేను అందరి పెద్దలకు మల్లే అర్థంలేని అధికారాలు చేయను; అలజడి లేవదీయను ఈ విషయం నేను క్రొత్తగా వివరించనక్కరలే దబ్బాయ్ నాకూ తెల్సు. నీ ఆదర్శాలు నాకూ తెల్సు నీతో సరిగా ప్రజాసేవ చేయగల డాక్టర్నే వివాహం చేసుకోవాలని నీ అభిలాష అది నాకూ తెల్సు కాని ఒక్కొక్కప్పుడు ఆదర్శం కన్న ఆపన్నరక్షణ ప్రధానమౌతుంది 'అందరిలో అవమానాలనుండి ఒక ఆడపడుచును తప్పించి మంచి పని చేశాను — ఇదిగో —' అని నా కుమారుడు వెంట తెస్తే చాలా ఆనందించి వుందును"

ఒక్క పేలవహాసం మెదిలింది శ్రీనగేష్ పెదవులపై "ఈ లోకంలోని స్త్రీలందరూ నీవంటి అమృతమూర్తులైతే

ఇన్ని సమస్యలే లేవు అయినా అమ్మ అమృతం అందించినా అందుకోలేని నా వంటి నిర్భాగ్యులు కొందరు ''


శ్రీదేవి కలవర పడింది. "అదేమిటి నగేష్? నీ నోటినుండి ఎన్నడూ వినని నీరసపు మాటలు వింటున్నాను! ఏం, ఇప్పుడు నీకేం?"

''ఏంలేదమ్మా ఏంలేదు." నిట్టూర్పును బలవంతంగా అణచుకుంటూ అన్నాడు "నేను వెళుతున్నాను. మళ్ళీ ఏడెనిమిది నెలలకుగాని సెలవు దొరకకపోవచ్చు. శత్రువులకు అంతుచిక్కకుండా వుండడానికై బహుశః మా సైనిక స్థావరాలు తరచూ స్థలం మారవచ్చు ఆ హడావుడిలో నీ వుత్తరాలు నాకూ, నా ఉత్తరాలూ నీకూ కూడా అందకపోవచ్చు. అంతమాత్రాన కంగారు పడకు"

శ్రీదేవి కనులలో నీరు నిలచింది

"అమ్మా!" కలవరపాటుతో సంబోధించాడు శ్రీనగేష్

''ఏంలేదుబాబూ నువ్వు చేస్తున్న పనీ, ఎన్నుకున్న మార్గమూ మంచివే. నాకు సంతోషమే కాని చూడు, నాకు ఒక్కగాను ఒక్క బిడ్డవు నా బాధ ఏమని వర్ణించను? నువ్వున్న ఈ నాల్గురోజులూ నాల్గునిముషాలలా గడచాయి ఇక నువ్వు వెళ్ళాక ప్రతిక్షణం ఒక వర్షమైపోతుంది



''నిజమే నమ్మా. నాకు తెలుసు కాని అమ్మలందరికీ అమ్మకు—దేశానికే ఆపద వచ్చింది ఆ ఆపదనుండి ఆ అమ్మను రక్షించడానికి మరి నీ వంటి అమ్మలు కొందరు బాధపడక తప్పదు తమ తనయులనూ, స్వసుఖాన్నీ అనేకుల రక్షణకై త్యాగం చేయక తప్పదు,'' అన్నాడు శ్రీనగేష్ తల్లి చెంపలనుండి జాలువారుతున్న కన్నీరు అద్దుతూ

"నిజమే నాయనా! కాని చూడు—దేశమాతను ఆదుకుని అండగా నిలబడడానికి తనయు లింకా చాలామంది – లక్షలాది, కోట్లాదిగా ఉన్నారు. కాని...కాని ఈ తల్లికి మాత్రం నువ్వే ఏకైక తనయుడివి నువ్వే దిక్కువు నువ్వే ఆశాజ్యోతివి నీవు మినహా" మరిమాట్లాడలేక పోయింది శ్రీదేవి

శ్రీనగేష్ హృదయం భారమైంది "నిజమేనమ్మా. కొద్ది రోజులు ఓపికపట్టు ఈ అత్యాయిక స్థితి దాటితే, నా వంటివారు కొద్దిమంది తప్పుకొన్నా భయంలేదు తల్లులంతా తనయుల్ని నిండుగా ఆశీర్వదించి పంపితే, దేశంపైకి వచ్చిన పెనుభూతం తక్షణం వెన్నిచ్చి పారిపోదూ?''

తల్లి పాదాలను స్పృశించి, నమస్కరించి భారంగా సాగిపోయాడు. వీధి గడప దాటుతూ దాటుతూ చెప్పాడు: "మామయ్యను నువ్వొకసారి కబురంపి మందలించమ్మా, ఈ ఘటన జరిగాక యింక నేను వాళ్ళతో మాట్లాడలేదు వాళ్ళ దారిన వాళ్ళు పోయారు, నాదారి నాదైంది "

"అలాగే "

* * *

కాలచక్రం పరుగులో ఒక సంవత్సర కాలం కరిగిపోయింది. కాలపురుషుని లీలలు కడు వర్ణనాతీతమైన మార్పులను కొని తెచ్చాయి.

ఒక అపరాహ్ణవేళ శ్రీనగేష్ తన స్వగ్రామంలో స్వగృహములో గదిలో ఆశీనుడై వున్నాడు గవాక్షంనుండి తన అదృశ్య ప్రశ్

బింబం 'భాగ్య చక్రం' సందడి వెదజల్లుతూ కన్పిస్తూవున్నది. రోగుల తాలూకు జనం నర్సులూ అటుయిటూ తిరుగుతున్నారు.

శ్రీనగేష్ చేతిలో ఏదో గ్రంధమున్నా, ఆలోచనావల్లరిమాత్రం అలవిమాలిన అల్లరి చేస్తూ ఎక్కడెక్కడో విహరిస్తూన్నది

"జీవితాని కర్థంలేదు!"

ఎవరో మహావిజ్ఞాని వెలువరచిన గొప్ప అభిప్రాయం - అనుభవైకవేద్య కఠోరసత్యం. ఆలోచించవలసిన అవసరం లేని రోజులలో, అనుభవా లెరుగని తొలి జీవితంలో చదివి, నిర్లక్ష్యంగా మరచిపోయిన విషయం. ఈనాడు మాత్రం గుర్తుకు వచ్చి, ఆలోచనలను కల్పిస్తూన్నది. అర్థమేలేకపోతే ఈ కోటానుకోట్ల జీవరాసులు ఎందుకు జీవిస్తూన్నట్లు? ఈ నిరంతర వృష్టి, తపన, వ్యయప్రయాసలూ ఎందుకు? ఈ రాగద్వేషాలు దేనికి?

యౌవనారంభంనుండీ డాక్టర్ శ్రీనగేష్ మస్తిష్కంలో మెదలుతూన్న ప్రదానమైన తర్కవితర్కాలు యివి అడుగడుగునా తలఎత్తి తిరిగి అణచివేయబడుతున్నాయి 'జీవితానికి అర్థమైనా అనర్థమైనా, వివేకంగానో అవివేకంగానో ఆపాదించుకొని సాగిపోయే వాళ్ళమే కాని, ఆరా తీసి నిశ్చితార్థం తెలుసుకోగల సమర్థులంకాదు' అని సరిపెట్టుకొంటూ వచ్చాడింతవరకూ కాని నేడు ఉదయం తిరిగి ఒక్కసారి గతపు స్ఫురణ జరగడంతో, అనవరతం తలఎత్తిపోయి అణగిపోతూన్న ఆ ప్రశ్న, అవకాశం లభించిందన్నట్లు సగర్వంగా నిటారుగా నిలబడింది గతం తలపోతలలోనికి రావడానికి కారణం ఉదయమే జయశ్రీ మనిషిచేత కబురుపెట్టింది-'తానూ, తండ్రి శ్రీపతీ వచ్చి ఆ పల్లెలోనే ఉన్నామనీ, ఒక్కసారి వచ్చి చూచిపొమ్మనీ,

తనలో తాను, అసహాయుడై, నీరసంగా నవ్వుకున్నాడు. పల్లెసేవకే అంకితమైపోవాలని భాగ్యచక్రాన్ని నిర్మించిన తాను, 'శమాత ఆర్తనాదాలు వినగానే తక్షణం వెళ్ళిపోయాడు - కదనరంగంలో కడు విలువైన తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించివేసియైనా స్వతంత్ర భారతిని ఉద్ధరింపబూనుకొన్న దైవతుల్యులైన సేవకులకు సేవ చేసి, ఉద్ధరించి, శక్త్యానుసారం తల్లి భారతి ఋణం తీర్చుకు తరించుదామనుకున్నాడు. ఆశయం నెరవేరిందికూడ ఈ పురాణభూమి పుణ్యమో, వీరగడ్డ శౌర్యమో, తల్లి భారతి తపః ప్రభావమో, తల్లుల దీవనో లేక తనయుల శౌర్యమో, తదితరుల ఐకమత్యమో - మొత్తంమీద ఆపద గడిచింది, శత్రువు వరి చేతులతో వెనుదిరిగాడు దేశానికి ఆత్యయిక స్థితి తగ్గింది. శ్రీనగేష్ మదిలో తృప్తితోబాటు, అనేక అనుభవాలుకూడ చెరగని ముద్రలుగా జీవితంలో నిలచిపోయాయి దేశానికి ఆపదా అవసరమూ గడచిపోయాయి గనుక అతడు తిరిగి తన ఆదర్శ జీవితాన్ని కొనసాగించడానికై పల్లెకు జేరుకున్నాడు తనయుని క్షేమాగమనానికి తల్లి శ్రీదేవి అమితానందంజెందింది తిరిగి యింట తల్లీ పుత్రుల ప్రశాంత జీవనం ప్రారంభమైంది 'భాగ్యచక్రం' పల్లెజనులకు ఆరోగ్య భాగ్యాన్ని ప్రసాదించే నిలయమైంది!

మధ్యాహ్నపు ఎండలో మహారీవిగా కన్పట్టుతూన్న తన ఆ ఆసుపత్రి భవనాన్ని తేరిపార జూచాడు శ్రీనగేష్ 'హుఁ! సుమారు రెండుసంవత్సరాలకు పూర్వమే ఈ భాగ్యచక్రం పల్లెప్రజలకు ఆరోగ్య భాగ్యప్రసాదం పంచిపెట్టవలసింది. కాని పరిస్థితులు అనుకూలించలేదు అంతకంటే అతి ముఖ్యమైన సేవకు తాను వెళ్ళిపోవడంతో రెండేండ్లూ ఆసుపత్రి నిరర్థకంగానే వుండిపోయింది పల్లెలో వుండలేక పారిపోయాడని పదుగురూ పకపకలాడారు పల్లెలో ఆ భవనం అడవిన గాచిన వెన్నెలతోనే సమానమని పరిహసించారు కాని తిరిగి ఈనాడు తాను వచ్చి, రోగుల సేవలో నిమగ్నం కావడంతో 'భాగ్యచక్రం' రోగులతో కిటకిటలాడిపోతూన్నది 'ఆ పల్లెలో అతి సాహసంతో ఆసుపత్రిని నిర్మించడం, అందునా ఆపరేషన్ థియేటర్‌కూడా ఏర్పరచడం నిజంగా అతి ప్రశంసనీయం. దేశానికి నీవంటివారే నిజమైన పుత్రులు' అంటూ ఆ పరిహసించినవారే ఇప్పుడు తిరిగి అభినందన పరంపరలు కురిపిస్తున్నారు. అనుదినం అటువంటి అభినందనా ప్రశంసాపూర్వక లేఖలు కనీసం అయిదారుకు తక్కువ వుండవు!

''హుఁ! జీవితానికే కాదు, అర్థంలేనిది మనిషి స్వభావపు తీరుతెన్నులకు కూడ ఓ అర్థమంటూ లేదు మానవులే సమయంలో ఎలా ప్రవర్తిస్తారో, ఏం మాట్లాడుతారో అనూహ్యం"

ఎదురుగా డ్రాయర్‌పై పడివున్న ఉత్తరాల గుట్టను చూస్తూ శ్రీనగేష్ ఆలోచనావాహినిలో కొట్టుకుపోతూ, తల్లిప్రవేశాన్ని కూడా గమనించలేదు.

''ఏమబ్బాయ్ మళ్ళీ నాలుగయితే ఆసుపత్రికి వెళ్ళిపోతావ్ జయ దగ్గరకు ఓసారి వెళ్ళిరాకూడదూ? కబురంపించింది కదా?' అన్నది శ్రీదేవి

''ఊ'' పరధ్యానంగా అని వూరుకున్నాడు శ్రీనగేష్.

ఒక్కక్షణం తనయుని పరీక్షగా తిలకించి సానునయంగా అన్నదామె "రాక రాక వచ్చినవాళ్ళు. వస్తూనే మన యింటికి రాక వేరే వుండి కబురంపడ మేమని కోపం తెచ్చుకున్నావా? లేక ఏమయినా గతమంతా తలచుకొని అభిమాన పడుతున్నావా?"

''..................''

''మన కటువంటిపట్టింపులు అనవసరం జయ సహజంగా కొంచెం పెంకిపిల్ల. వివేకం తక్కువ సరే మీ మామయ్య మతిమాలినవాడయ్యాడు కదా! అయినా అవన్నీ ఎందుకు? నువ్వు డాక్టరవు బంధువువు వెళ్ళి చూడడం నీ ధర్మం నేను ఎక్కడకీ వెళ్ళనిదానను

మీ నాన్నగారు చనిపోయిననాటినుండీ ఇంతవరకూ నేను గడపదాటలేదు లేకుంటే నేనే వెళ్ళేదానను."

శ్రీనగేష్ చలించాడు. ''ఎందుకమ్మా అంత మాటలు? ఇదుగో, యిప్పుడే వెళ్తున్నాను." లేచి జోళ్ళుతొడుక్కొంటూ అన్నాడు.

"అలా ఎవరో పరాయివాళ్ళు ప్రవర్తించినట్టు ప్రవర్తించడం నాకేం బాగుండలేదన్నానని చెప్పు. వచ్చి ఇక్కడే మన యింట్లోనే వుండమను"

''అలాగే''

* * *

''జీవితానికర్థం లేదు: ఔనా?''

'ఎవరో మహానుభవజ్ఞుడు జీవన సాగరాన్ని మధించి వెలికితీసిన సత్యాలలో– క్షీరసాగర మధనఫలితంగా, అమృతంతో బాటు ఉద్భవించిన హాలాహలంలాగా, సిరితోబాటు అవతరించిన జ్యేష్ఠలాగా నిలిచిపోయిన చేదువిషయం ఈసూక్తి అయితే యిది కొందరు దురదృష్టవంతులకు మాత్రమేనా–అందరికీ ఎప్పుడో ఒకప్పుడు గుర్తింపు కలిగేదేనా?'

"డాక్టరుబాబు వచ్చారు అమ్మాయిగారూ!"

ఆలోచనలతో సతమతమౌతున్న జయశ్రీ దాసిపిలుపు విని లేచింది

''ఇప్పుడే వస్తున్నాను హాలులో కూర్చోబెట్టు

శ్రీనగేష్ జయశ్రీ లిద్దరూ కొలది నిముషాలు మౌనంగా ఒకరినొకరు తిలకిస్తూ వుండిపోయారు.

ఉన్నట్లుండి జయశ్రీ అన్నది, "ఆర్మీలో పనిచేసి వచ్చావనీ, చాలా అనుభవజ్ఞుడవైన డాక్టరుగా పేరు కెక్కావనీ విన్నప్పుడు ఎందుకో నిన్ను బాగా ఎదిగిపోయిన వ్యక్తిగా, అతి గంభీరంగా ఊహించ బుద్ధైంది కాని నువ్వేం మారలేదుబావా, అలాగే పాతికేళ్ళ సుందర యువకుడుగానే వున్నావే!'' అంటూ నవ్వేసింది, కాని అది కళాహీనంగా ఉండడం గమనించాడు శ్రీనగేష్

శ్రీనగేష్ పెదవులపై కన్పించీ కన్పించని చిరుహాసం మెదలి మాయమైంది. "ఏం? నే డెబ్భై ఏళ్ళ వృద్ధుడినై పోయాననుకున్నావేమిటి?''

దాసి కాఫీ ట్రేతో ప్రవేశించడంతో సంభాషణ ఆగింది.

''ఎందుకు కబురుపెట్టావ్?" కాఫీ కప్పు బల్లపై వుంచుతూ ప్రశ్నించాడు.

"అదేమిటి బావా, మరీ అంత పరాయివాడిలా అడుగుతున్నావ్?"

''మరి ఎలా అడగను? పరాయివాళ్ళమని అనుకోకపోతే, తిన్నగా మాయింటికే వద్దువు కదా? కలకత్తాలోనో ఎక్కడో వున్నారని విన్నాను. ఇంత హఠాత్తుగా వచ్చారేంటి, ఏ వార్తా లేకుండా?"

జయశ్రీ వదనం ఉదాసీనంగా, విచారంగా మారిపోయింది

"ఏ ముఖంతో రావాలి మీ యింటికి? ఇంత దారుణం జరిగిపోయినా నువ్వుగాని, అత్తయ్యగాని ఒక్కసారైనా వచ్చి నన్ను పలుకరించి, ఓదార్చిన పాపానపోలేదు. అక్కడికి సిగ్గువదలి, అత్తయ్యకు ఉత్తరం వ్రాశానుకూడా, పరిస్థితులు వివరిస్తూ, నాకు సాహాయంగావచ్చి వుండమని అర్థిస్తూ, నిర్మొహమాటంగా వ్రాసింది 'రా'నని. .ఈ ఏడాదినుండీ తిరుగని నగరమూ, ఆసుపత్రీ లేదనుకో, కాని ఎక్కడా నాన్నకు మతి స్థిమితం లభించలేదు. ఒక్కొక్కసారి మరీ ఆవేశపడి నానాహంగామా చేసేస్తాడు ఇక అటువంటి మనిషితోవచ్చి మీ యింట్లో వుండడం ఎలాగా? అదీగాక అంత జరిగాక, ఏడాదికి మనం తిరిగి ఈనాడే కలుసుకున్నది!''

విట్టూర్చాడు శ్రీనగేష్, "అటువంటి అభిమానాలూ, అభ్యంతరాలు పెట్టుకోకు జయా, అమ్మసంగతినీకు తెలియనిదేమున్నది? ఈదేశంలో చాలమంది స్త్రీలకు భర్తతోగడిపిన జీవితమే గణనీయం; అతడితోనివసించి గృహమే దేవాలయం, ఆ స్థలమే కైలాసం అమ్మ అచ్చతెలా భరతనారి. ఆమె ఇక జీవితకాలంలో ఆగడప దాటదనే నా నమ్మకం ఇక నా సంగతంటావా, నాబాధలలో – గొడవలలో నేనున్నాను నెలక్రితం నేనిక్కడికోచ్చే వరకూ నాకీసంగతే తెలియదు అసలు మీ విషయాలు వివరంగా తెలియనే తెలియవు."

"నీకు బాధలా బావా!" జయశ్రీ ఆశ్చర్యం.

పేలవహాసంతో జవాబిచ్చాడు శ్రీనగేష్ "పోనీయ్ ఏంలేదులే ఇక యిలా కష్టాలు మననం చేసుకుంటే అయినట్లే అసలు, నన్ను చూడడంతోనే నువ్వెంత బాధపడి అధైర్యం ప్రదర్శిస్తావో–ఎలా ఊరడించాలో, అని భయపడుతూ వచ్చాను నువ్వు ధైర్యంగా వున్నావు నాకంతేచాలు!"

కొద్ది నిముషాలు నిశ్శబ్దం పరిపాలనకు దాసోహమన్నాయి.–

''అయితే, మామయ్య ఎక్కడ? కన్పించరేం?" శ్రీనగేష్ కడకు ప్రశ్నించాడు

"ఉన్నారు మేడమీద. అయితే, అంతా వినేవుంటావ్ ఆయనను ఇక కడసారిగా నీ వైద్యం చేయించాలని ఇక్కడకు తీసుకొచ్చాను విషయమంతా నీకే తెల్సుకదా?"

తల అడ్డుగా ఊపాడు శ్రీనగేష్ "ఊఁహూ, తెలియదు ఏదో విషయం కర్ణాకర్ణిగ వినక తప్పక వింటాను, అంతే. కాని ఎవరివిషయాలూ కూడా – వారి పరోక్షంలో ఎవరు ఎంతటి ఆత్మీయులు చెప్పినా సరే వినను నేను ఎవరివిషయం వారి ముఖతఃగానే వినాలని నాసిద్ధాంతం చెప్పిన మాటలలో విమర్శాదూషణలు, చిలవలు పలవలు తప్పనిసరిగా జేరతాయని నా ఉద్దేశ్యం"

(సశేషం)

ఉగాది - నవయుగాది

ముదిగొండ శివప్రసాద్

"ఝరీఝుంకారము కాహళారావముగా, ఆనంద సందోహ తుందిలములో కోకిల గానములో మధుర గీతారావములోగా లతాలలనాస్యములొప్ప మాధవ కరీంద్రప్రాప్తి నుల్లాసివై విలసద్భూత భుజరీతి రాగదవె సంప్రీతిన్" అని ఒక మహాకవీంద్రుడు వసంతాన్ని ఆవాహన చేస్తున్నాడు. వసంతమనగానే బంతులూ చేమంతులూ, విరిసిన పువ్వులనవ్వులూ, మురిసేకన్నెల కన్నుల బాసలూ, పేరంటానికివెళ్ళే పిన్న బాలిక తలలో గుబాళించే మల్లెమొగ్గ (విశ్వనాథ), చిరుచెమటతో మలయానిలానికై ఆరుబయటపూచి, రాలేవేపచెట్టుక్రింద ఎదురుచూచే జనసమూహం — ఎన్నో మధుర మధుర దృశ్యాలు మన మదిలో మెదులుతాయి. మనముందు రూపుకట్టి నిలుచుంటాయి. కాలపురుషుడు చిగురుటాకు కుంచతో గీచిన వర్ణచిత్రం వసంతం!!

వసంతమనే నూతన గ్రంథానికి తొలిపుట ఉగాది — నవ్యవత్సరమనే మహా కావ్యానికి నాందీవాక్యం ఉగాది. ఒకయేటి మహా వ్రతానికి విఘేశ్వరపూజ ఉగాది — ఉగాది చైత్రశుద్ధ పాడ్యమినాడు వచ్చే పండుగ. ఆంగ్లేయ కాలమానంలో జవవరి 1కి గల ప్రాధాన్యంకన్నా సంవత్సరాదికి గల ప్రాధాన్యం చాలా ఎక్కువ. కారణమేమంటే వారు కేవలం కాలవిభజన ప్రాతిపదికగానే జనవరి 1కి ప్రాముఖ్యమిచ్చారు. కాని ఉగాది మనజాతీయ జీవనంతో ముడివేసికొని పోయిన మహా పర్వదినం. భూతకాల నిశీధిని" గడసినపిదప నూతన వసంత మషమోదయ బ్రాహ్మీముహూర్త మహాఫలం ఐతిహాసిక జీవనస్ఫూర్తితో జాతిని ముందుకు నడిపించే విజయశంఖారావం:

ఉగాదినాడు జరిగే ఆచారాలు, వింతలూ వేడుకలు తెలుగు వానికి సుపరిచితమే. ఆంధ్ర కర్ణాటకులకి అమిత ప్రీతిదాయకమైన పండుగ. ఉదయమే అన్ని జాతుల వారూ అభ్యంగన స్నానం చేస్తారు, వారి తాహతుననుసరించి కొత్తగుడ్డలు ధరిస్తారు. ఇంతలో పురోహితుడు వచ్చి పంచాంగాన్ని వినిపిస్తాడు. ఈ పంచాంగ శ్రవణమే వారి నూతనవత్సర జీవితానికి ఆశాజ్యోతి. కందాయ ఫలాలు వగైరా వింటారు. ఆ సంవత్సరం సంకురమయ్య ఎక్కివచ్చిన వాహనము, పెట్టుకున్నబొట్టూ, ధరించిన ఆభరణాలూ, వాటితీరుతెన్నులూ ఇవే రాజ్యపు భవిష్యత్తును నిర్ణయించే నిగూఢ రహస్యాలు— అనంతరం బ్రాహ్మణాశీర్వాదం పొంది, దేవాలయానికి వెళ్ళుతారు, ఇలా నూతన సంవత్సరం ఆరంభమౌతుంది.

మానవజీవితానికీ, నక్షత్రగమనానికీ చాలా సన్నిహిత సంబంధంవుంది, శ్రీ గొబ్బూరి ప్రభృతులైన రచయితలీ విషయంలో ప్రముఖగ్రంథాలు వ్రాశారు. అయితే మానవుని సంకల్పశక్తి సర్వశ్రేష్టమైనది. కాబట్టే సంవత్సరాదిలోనే నక్షత్రగమనాన్ని గుర్తెరిగిన మానవుడు ఆ శుభాశుభ ఫలితాలతో తృప్తిపడి ఊరుకోక తన కార్యదీక్షతో అమంగళాన్ని మంగళంగా మార్చుకోవడానికి విశ్వప్రయత్నముచేసి విజయం సాధిస్తాడు. పంచాంగ శ్రవణమందు కొఱకే— అలాగే సంకల్పసిద్ధులైన మహర్షుల ఆశీర్వాదమూ, నూతన సంవత్సరానికి విజయధ్వజమై నిలుస్తుంది— అనంతరం భగవంతుని ఆశీర్వాదంకూడా, ఆ అఖండాత్మకు చిన్న ప్రతీక అయిన మానవునిలో దివ్యజ్యోత్స్నలను నింపేందుకు సాయపడుతుంది. ఇలా నూతన సంవత్సరం ఆరంభమౌతుంది.

సంవత్సరాదినాడు దేవపూజ కాగానే ఉదయం తినే పదార్థం 'వేపప్రసాదం' దానిని మామిడిముక్కలూ, వేపపూత (మహారాష్ట్రీలు చిగురును ఎక్కువగా వాడుతారు.) కొత్తబెల్లమూ, పానకమూ గసగసాలూ, పప్పులూ, చింతపండు మొదలైన చిరుచేదు, మృదుమధురము అయిన పదార్థాలతో గొజ్జు, లేక ఉగాదిపచ్చడి అనే పేరుగల ఖాద్యాన్ని తయారుచేస్తారు. ఇందులో చాలా అంతరార్థంవుంది. అవన్నీ సంవత్సరంలో కొత్తగా లభించినవస్తువులు, వానితో నూతన సంవత్సరావిష్కరణ జరిగిందన్నమాట. అయితే అవన్నీ తియ్యగానూ ఉండవు — చేదుగానూ ఉండవు, వెలుగు చీకట్లవలె, కష్టసుఖాలవలె చేదూతీపి కలిసివుంటాయి. కాబట్టే మహాసర్గలో ఋతుపూజలో "జీవితమంతా చేదూతీపీ సమ్మిశ్రితమై సాగునటంచును, వేపపచ్చడుల రుచిచూపించెను" అని అనడం జరిగింది.

తర్వాత వేడుకలూ, వినోదాలూ వారివారి స్థాయిననుసరించి ఉంటాయి. విద్యావంతులకు కావ్యగోష్ఠులుంటాయి. ఈమధ్య ఆకాశవాణివారు సంవత్సరాది సాహిత్యగోష్ఠులకు ఏర్పాటు చేస్తున్నారు — ఇవి చాలా మనోరంజకంగా ఉంటున్నాయి — మామూలు పల్లెటూరిప్రజలు సాయంత్రము పూట ఎడ్ల పందెములూ, బండ్ల పందెములూ

ఏర్పాటుచేస్తున్నారు వాటికవసరమైన సన్నాహాలతో రోజంతా గడుపుతారు – ఈరోజు ఎంతో ఆనందంగా, ఉంటే– సంవత్సర మంతాకూడా అలాగేనడుస్తుందనేది ఒక నమ్మకం।

మధ్యాహ్నం షడ్రసోపేతమైన భోజనం– సాయంత్రం వింతలూ, వినోదాలు – రాత్రి కొందరు దేవాలయంలో పురాణాన్ని విని నూతన సంవత్సర ఫలితాలచర్చలో గడుపుతారు – అయితే ఆధునిక నాగరికతా ఫలితంగా కార్యక్రమాలు. ఇలా యధావిధిగా జరగడంలేదు

చాలామంది తమ తమ నూతన కార్యాలనీ దినాన్నే ప్రారంభిస్తారు నిజానికి కృష్ణపక్షంవెళ్ళిన పాడ్యమి మంచిదికాదు శుక్లపక్షానంతర కృష్ణపాడ్యమిమాత్రం మంచిదే. అయితే సంవత్సరాదినాడు మాత్రం ఆ పట్టింపులేదు సంవత్సరాది మానవులకు భగవంతుడు ప్రసాదించిన ఒక వరంగా మనవారి భావం।

భవిష్యత్ పురాణోత్తర భాగాన్ని పట్టి పూర్వం 'యుగాది' అన్న ఉత్సవం చేస్తున్నట్లు మనకు తెలియవస్తున్నది ఇది దీని ఐతిహాసిక ప్రాముఖ్యానికీ, ప్రాచీనతకూ నిదర్శనం. యుగాది శబ్దమే శబ్దాది యకారంలోని హల్లుపోగా ఉత్తుమాత్రమే మిగిలి ఉగాది రూపం సిద్ధించడం సహజమే కదా। ధర్మరాజుతో కృష్ణుడు ''కృత యుగము వైశాఖ తృతీయనాడు ప్రారంభమైనదనీ, త్రేతాయుగము కార్తీక నవమినాడు మొదలైందనీ, ద్వాపరమున భత్రయోదశినాడు ఉద్భవించిందనీ, మాఘ పౌర్ణమితో కలియుగం ఆరంభమైందనీ." ఒక ఐతిహ్యం ఉంది –

శ్లో॥ యుగాదయశ్చకథ్యంతేతధైః
సర్వాసూతిభః

ఈ నాలుగు యుగముల ఆదితిథులందు ఆయా దేవతాపూజలు నిర్వహించి, బ్రాహ్మణులకు దానమివ్వవలసిందిగా శాస్త్రం చెపుతున్నది – అయితే మన ఉగాది మాఘమాసంలో కాక చైత్రంలో జరుగుచున్నది – ఈ అంశంపై కొంత పరిశోధన జరుగవలసి వుంది.

ముఖ్యంగా ధర్మసింధుకారుడు, నిర్ణయసింధుకారుడూ ఈ ఉగాదిని సంవత్సరాది పండుగగా నిర్ధారించారు – ధర్మసింధులో ఇలా వుంది "అత్ర శుక్ల ప్రతిపదాది రమాంత ఏవమాసః ప్రాయేణ దాక్షిణాత్యై రాద్రియతే"– "అంటే ఈ పండుగ దాక్షిణాత్యులచేత ఎక్కువగా ఆదరింపబడుతున్నదని వివరించాడు ఈ పండుగనాడు

''నూతన సంవత్సర కీర్తనాద్వారంభం ప్రతిగృహ ధ్వజారోహణం నింబపత్రాశ సంవత్సరాది శ్రవణం నవరాత్రారంభః–" అంటే ఈనాడు ప్రతియింటికీ తోరణాలు కట్టి వేపపూతతో ఉగాది పచ్చడి చేసి పంచాంగ శ్రవణం చేయాలనీ, కొందరికి నవరాత్రులు ప్రారంభ మౌతాయనీ అర్థం – నవరాత్రులు, విఘ్నేశ్వర చతుర్థికీ, దసరాకూ జరుగుతాయి. ఇక్కడ సంవత్సరాది నుండి రామనవమివరకూ నవరాత్రులు జరిపే సంప్రదాయాన్ని ధర్మసింధుకారుడు అభివర్ణిస్తున్నాడు –

''చైత్రశుక్ల ప్రతి పన్మాత్స్య జయంతీత్యేకే" అనే మరొక వాక్యమువలన ఈనాడే మత్స్య జయంతి (మత్స్యావతార జయంతియా ?–ఆదే అయితే పరిణామ వాదానికి దశావతారాలు చిహ్నమనే మాటే నిజమయితే సృష్టి ఆది అవుతుంది – పరిణామ వాదంలో ముందు జలజంతువులు చేపలు, తర్వాత డిప్పగల జంతువులూ పుట్టినట్లు ఉంది) అని తెలుస్తున్నది. ఈ మత్స్య జయంతి విషయంలో నిర్ధారణగాగాక శాస్త్ర కర్త లను మానాన్ని వ్యక్తంచేశాడు –

హిందీలో 'ఆర్యపర్వ పద్ధతి' అన్న గ్రంథం ఒకటిఉంది దానిని పండితభవానీ ప్రసాదు (ఆర్య) రచించారు. అందులో 'నవసంవత్సరోత్సవము' లేక 'సంవత్సరేష్టి' అనే శీర్షికక్రింద "ఉగాదిపండుగ మధుశ్చ మాధవశ్చ వాసంతికావృత్ – అనే యజుర్వేదవాక్యాన్నిపట్టి సంవత్సరము వసంతముతో ప్రారంభమౌతుందనీ, ఋతు మాసముల పేర్లు మధువు, మాధవముగా ఉండేవనీ" వ్రాశారు – అవే కాలక్రమాన చైత్రాది మాసములుగా వ్యవహార సిద్ధములైనాయట

శ్రీ హేమాద్రి ఇదే విషయంపై.

"చైత్రేమాసి జగద్బ్రహ్మ ససర్జ
ప్రథమేహని.

శుక్లపక్ష సమగ్రంతుతదా సూర్యోదయోపతి"

అంటే బ్రహ్మదేవుడు చైత్ర శుక్ల ప్రతిపత్తునాడు విశ్వాన్ని సృష్టించాడని అర్థం

మహాగణిత శాస్త్రవేత్త భాస్కరాచార్యులు తమ సిద్ధాంత శిరోమణిలో

"లంకా నగర్యా ముదయాచ్చ భానౌత స్యైవవారే ప్రథమం బభూవ। మధోస్సితా దేర్దిన మాసవర్షం యుగాదికానాం యుగపత్ప్రవృత్తిః"

అంటే లంకానగరంలో భానూదయం జరిగింది కాబట్టి మధుమాసము (చైత్రము) యొక్క శుక్లపాడ్యమినాడు యుగాదుల ప్రారంభమైందని తెలుస్తున్నది. ఇందులో 'యుగాది' శబ్దం ప్రయోగింపబడివుంది,

ఔరంగజేబు తన కొడుకు మొఅజ్జమ్‌కు వ్రాసిన ఒక లేఖలో (పార్సీ) ఉగాది గూర్చి వ్రాస్తూ "ఈదినము అగ్నిపూజలగు పారసీకుల పండుగ మఱియు నిది కాఫరులైన హిందువుల విశ్వాసానుసారముగ ధిక్కృతుడైన విక్రమార్కుని రాజ్యాభిషేక దివసము హిందూదేశములో ఇదే సంవత్సరాది." అని పేర్కొన్నాడు – పార్సీవాళ్ళకుకూడా ఈనాడు అగ్నిని ఉపాసించే దినం అనడంతో వేదకాలపు ఆర్య జాతియొక్క వలస విధానమూ, ఇక్కడి ఆరాధనలూ, పండగలూ కొలది మార్పులతో నేటికీ ఇతరప్రాంతంలో ఉన్న పద్ధతి ఋజువౌతున్నది ఉగాదినే పార్సిలో 'నౌరోజ్' అంటారు అక్బరునాడూ ఇది

చాలా గొప్ప ఉత్సవం మన సంవత్సరాది కాలంలోనే ఇది సామాన్యంగా వస్తుంది దీనివల్ల ఆర్యుల తొలి నివాసం భారత దేశమనీ ఇక్కడివారే అన్ని ప్రాంతాలకూ వలస వెళ్ళారని తెలుస్తున్నది. శ్రీ భవానీ ప్రసాద పండితుడు పూర్వం చైత్రశుద్ధ పాడ్యమినే ఉగాదిగా యావ ద్భారతమూ పాటించిందనీ, క్రమంగా ఔత్తరాహులు సౌరమానా న్ననుసరించి మేష సంక్రాంతి (సూర్యుడు మేషరాసిని ప్రవేశించినదినాన్ని) జరుపుతున్నారనీ, దాక్షిణాత్యులు మాత్రం చాంద్రమాసం ప్రకారం నేటి ఉగాదినే జరుపుతున్నారనీ తెలుస్తున్నది. శాలివాహన శకం పాటించే వారందరికీ ఇదే ఉగాది"

ఉగాదికి సంబంధించిన పౌరాణిక చారిత్రికాంశాలలో కొన్ని యివి—ఇక అను స్యూతంగావచ్చే ఉగాది గాథలూ చాలా ఉన్నాయి. వాటన్నిటికీ ఇది స్థలంకాదు నిజానికి ఉగాదిశోభ వసంతపు ఆనందం ఆంధ్రులకంటే ఏ కాశ్మీరియులో ఎక్కువగా అనుభవిస్తారు మనకది ప్రకృతిదృష్ట్యా మండు ఎండలకు ఆరంభం. కాగా వారికది మధుర వాతావరణానికినాంది అయినా ఉగాదిని వర్ణించని ఆంధ్రకవి. ఉగాదికి పరవశించని తెలుగుబిడ్డ లేనేలేడు ఉగాది అతని జీవితానికొక విజయ కాహళ ఉగాది విశ్వసృష్టికేకాదు, తనస్థితికే యుగాది. అట్టి ఉగాదితో నేడు,

1 "కోకిల భారత గానంచేసెను
2 కాకము యిక కావ్యం వినిపించెను,
3. తేనెముత్తమూ తుమ్మెదకిచ్చియు,
4 త్యాగారుణ పంకజ పులకించెను,
5 భారతమాత పదార్చనకొఱకై,
6 కాశ్మీరములో కుంకుమ పండెను,
7 భారతదేవి మహా రథమునకై,
8 బృందావన సుందర లతలమరెను,
9 మళ్ళీ మ్రోగెను మధుఋతువిపంచి,
10 మళ్ళీ పలకెను మధుఋతు కావ్యం,
11 మళ్ళీవీచెను మధుఋతు పవనం,
12 మళ్ళీచూచెను మధుఋతుసుందరి"

ఋతుపూజ

ఉగాది మోదుగులు

దాశరథి

విరగబూచిన పాలాశ తరువునీడ
చెలి వసంతాల రాణి మత్తిలి నటించె,
అరుణ పాలాశ కుసుమ పర్యంకమందు
బంభరస్వామి మధువాని పరవశించె.

పేదవారి గులాబీలమీద నేను
పద్దెములు వ్రాయనెంచితి; ముద్దులొలుకు
పల్లెపడుచు కచమ్ముల నుల్లసిల్లు
మోదుగును మించినట్టి పువ్వేది జగతి ?

ఈ యుగాదిని మోదువు లింత విరివి
గా సుమించుట జూడ నక్కజము గలిగె,
న న్నసంఖ్యాక మదవతీ నవనవాధ
రములు రమ్మన్న యట్లుగా భ్రమసినాను.

మల్లెల మొల్లలన్ గొనుట మాతరమా ! ధర హెచ్చె మోదుగుల్
కొల్ల లమూల్యముల్ గనుక కోమలి కొప్పున కుప్పబోసెదన్;
గొల్లుననవ్వి, మెచ్చుకొని, కోర్కెలు తీర్పగ చెంత జేరి నా
ఉల్లమునిండ తానగుచు నుల్లసిలున్ ప్రణయైక మూర్తియై.

నేను మోదుగుపూల్ తెచ్చినా నటన్న
దోసిట గల మల్లెలు పారబోసికొనును,
సహజవాసన గల మల్లెసరముకన్న
ప్రణయ వాసనల పలాశ గణము మిన్న

కింశుక సుమము వృథా యని
శంశయ పడబోను నేను; సకలజగతి ప్రే
మాంశము కలదు — సతీ ప్రణ
యాంశుకమై బుజము జారి అలరించు ననున్

బతికిన కాలేజి

పాలగుమ్మి పద్మరాజు

సీరియల్

జరిగినకథ

పెద్దలకు నచ్చక పెళ్ళిచూపులు ఆగినా అబ్బాయి పట్టు మాత్రం అమ్మాయి రాధనే పెళ్ళి చేసుకోవాలని అనుకొని స్నేహితుడు చింతా సలహాతో తండ్రిని ఒప్పిస్తాడు పెళ్ళిపీటలమీద పెళ్ళికూతురు రాధ కాగపోగా విరాగియై తిరిగి ఇంటికి వస్తాడు రాధకు, కల్యాణికి, శర్మగారు నాట్యం నేర్పుతాడు వారి నాట్యప్రదర్శనకు ఏర్పాట్లన్ని రామలింగయ్య చేస్తాడు

ప్రదర్శనం అయిపోయింది బ్రహ్మాండమైన చప్పట్లతో హాలంతా అదిరిపోయింది ఆ తరవాత రోశయ్య వాణీరాణీతో స్టేజిమీద ప్రత్యక్ష మయాడు. సర్దణిగిన తరవాత రోశయ్య చెప్పాడు

"ఇంతమంది పెద్దల సమక్షంలో మాట్టాటాని కసలు తాకత్తే లేదు అయినా గాని, ఈపని బుజాన్నేసురున్నాను గనుక, రొండు ముక్కలు సెప్పక తప్పదు మొదట్లో మిస్‌నటీరావు నాట్యమనుకున్నాం. కాని కారణాల మూలకంగా అది జరగలేదు అయితే మనం ఇశారించాల్సిన పనిలే అంతకన్న యెయ్యింతలు బాగుం దీ అమ్మాయిల డాన్సు ఈ పెదర్శనంలో వొచ్చిన డబ్బంతా మన శ్రీ బాలాజీ ఫుట్‌బాల్ ప్రోత్సాహక సంగానికి చెందుద్ది మొత్తం యెంత వొసూలైందో లెక్కింకా తేల్లేదు, అయితే మన్ని ఇన్నిందాల ఆనంద వోర్యంలో ముంచెత్తినటువంటి కుమారి వాణీ రాణీగార్లకి మనం సంతోసంగా–ఏదో–అరి ఇద్య కిది ఇలవగాకపోయినా – ఏదో–కర్పుల మింజావలె అనుకోండి, యెయ్యి న్నూటపదార్లు–..." తక్కిన మాటలు జనం కోలాహంలో మునిగిపోయాయి. అయితే ముందు వరసల్లో వాళ్ళకి రామలింగయ్య

"ఒరే దొంగపీనుగా," అంటూ స్టేజి మీదకి రావడం కనబడింది

మిగతా పెద్దల కివి బోధపడకపోయినా దీన్నిగురించి తెలుసుకోవాలన్న కుతూహలంకూడా లేదు

మిస్టర్ చింతా అది చూశాడు రామలింగయ్య అన్నమాటలు విన్నాడు అది ఏమిటో తెలుసుకోవాలని స్టేజిమీది కెక్కాడు. అప్పటికప్పుడే రోశయ్య సంజ్ఞ చెయ్యడం, తెర దింపెయ్యడం జరిగిపోయింది అయితే మిస్టర్ చింతాకి తెరలు అడ్డవుగా అతను పక్కనుంచి దారి చేసుకుని లోపలికి వెళ్ళాడు, ఒకమూల నిలబడి చూశాడు

రామలింగయ్య రోశయ్య చొక్కా పట్టుకుని అంటున్నాడు

"ఒరేయి! నీ ఆటలన్నీ నా దగ్గర సాగవు ముందు మూడువేలూ అక్కడ పెట్టు"

"బావగారికి కోపం జాస్తి. నేను సెప్పేది. ."

"ఏమిట్రా నువ్వు చెప్పేది మూడు వేలూ ఇస్తానని నాఎదట ఒప్పుకుని, ఇప్పుడిల్లా అన్యాయం చేస్తావా! ఆడపిల్లలు గదా అని.. !"

"అఁ కాదు బావగారూ! వొత్తే ఇవ్వకేం, కర్చులయిపోయినియ్యి ఈ యెయ్యినూట పదార్లన్నా నా సేతిసొమ్ము నా మాట నమ్మండి"

"అయితే లోతక్కువకూడా నీ చేతిదే ఇచ్చెయ్యి"

"ఉంటే ఇవ్వటానికి యెనకాడతాడా ఈ రోశయ్య మీకు తెల్దా?"

"తెలుసుగనకే — అడుగుతున్నా..."

మిస్టర్ చింతా ఆ సమయంలో అడుగు పెట్టాడు రంగంలోకి

"మీరు రామలింగయ్యగారు కదూ గ్రేట్ ఏక్టర్ నేనింతప్పుడు చూశా మీ హరిశ్చంద్ర నాటకం ఆహా! "చతురంభోధి పరీత భూవలయరక్షా దక్ష చామీకరాయత దండంబు ధరించు ఈ కరమె.. "అన్న పద్యం ఈనాటికీ నా చెవుల్లో మోగుతూ ఉంటుంది సుదినం మిమ్మల్ని ప్రత్యక్షంగా చూసే భాగ్యం ఇన్నాళ్ళకి కలిగింది నా పేరు మిస్టర్ చింతా— మీ అనంతకోటి శిష్యుల్లో వీడొకడు '' అంటూ తన్ను తాను పరిచయం చేసుకున్నాడు మిస్టర్ చింతా

''మా వూరి పెద్దల్లో ఒకరం ఓడు మా సంగం కమిటీలోకూడా ఉన్నాడు సదువుకున్నా వోడు దులిపితే యెలురాల్తాయండి," అంటూ పరిచయం చేశాడు రోశయ్య

ఇంవాకా స్టేజీమీదెక్కి కూచున్నది నువ్వే కాదుటయ్యా." అన్నాడు రామలింగయ్య

"అవునండి ప్రదర్శనానికి అనుకోకండా అంతరాయం కలిగింది నావల్ల పెద్దలు మన్నించాలి"

"ఎందుకు మన్నించడం? నువ్వు చేసింది రైటు ఇటువంటి దొంగపీనుగులకి అల్లాగే బుద్ధిచెప్పాలి చూశావా ఈ దుర్మార్గు డేం చేశాడో ..''

"అర్థమయిందండి మొదట మూడువేలిస్తానని ఒప్పుకున్నాడు మిస్టర్ రోశయ్య



ఇప్పుడు వెయ్యిన్నూటపదహార్లు చేతితో పెట్టాడు."

"అదికూడా తన చేద్దట. ఏదో దయా ధర్మ భిక్షం ఇచ్చిన ట్టనుకుంటున్నాడు కాబోలు."

"పాపం మిస్టర్ రోశయ్య స్వభావమే అటువంటిది. ప్రజల సొమ్ము ఇవ్వవలసిన వాళ్ళకి ఇచ్చేటప్పుడుకూడా తన సొంత సొమ్ము పోతున్నట్టు బాధపడతాడు. పాపం అతని కల్లా అలవాటై పోయింది. ఏం జేస్తాం ?''

"మీవంటి వాళ్ళంతా ఇలాంటి అన్యాయం జరుగుంటే చూస్తూ ఊరుకోడమేనా ?'' అన్నాడు రామలింగయ్య.

"ఇంతవరకూ ఊరుకున్నాం నిజమే, అయితే ఇప్పుడింక ఊరుకో దలుచుకో లేదు," అన్నాడు మిస్టర్ చింతా ?

"ఏంటయ్యా నువ్వు చేసేది?'' అన్నాడు రోశయ్య చిరాకుగా.

"ఏంటయ్యా సేసింది, అని అడుగు మిస్టర్ రోశయ్యా. మిస్టర్ రామలింగయ్యా! ఈ ప్రదర్శనం ముందేమాకు — అంటే కమిటీ మెంబర్లలో కొందరికి—ఈ సంఘం తాలూకు జమాఖర్చులు కొంచెం అనుమానాస్పదంగా తోచి, దీని బాంక్ అకౌంటు, ఇతర పత్రాలు కోర్టువారి అధీనంలో పెట్టించాం, ఈరోజే.''

''ఏంటి ?" అని అరిచాడు రోశయ్య.

"ఈరోజు టిక్కెట్ల అమ్మకం తాలూకు రూ. 15000 కూడా రిసీవర్ ఇప్పుడే లెక్క చూసి...''

''ఏంటి ?" అన్నాడు రోశయ్య మళ్ళీ.

"మిస్టర్ రోశయ్య గనక ఈ నటీమణులకు మూడువేలు ఇస్తానని నోటిమాటగా అన్నా, మీబోటి పెద్దలసాక్ష్యం ఉందిగనక అది కమిటీవారిచేత ఇప్పించేపూచీ నాది — అంటే — మిస్టర్ రోశయ్య సొంతంగా తన సంతోషంకొద్దీ ఇచ్చిన వెయ్యిన్నూటపదహార్లుగాక...''

రోశయ్య కప్పని మింగలేక మింగినట్టు రెండు పెద్దగుటకలువేసి వొస్తున్న మూర్ఛను ప్రయత్నంమీద ఆపుకుని, తూలుతూ అవతలికి పరిగెత్తాడు. రామలింగయ్య విరగబడి నవ్వాడు.

"బలే కుర్రాడివయ్యా నువ్వు. ఇలాంటి దొంగపీనుగులికి నీలాంటివాళ్ళే ఉండాలి. రా, అమ్మాయిల్ని పరిచయం చేస్తాను. నాకు మేనకోడళ్ళవరుస, రా.''

"క్షమించండి. అవతల మా స్నేహితుడొకడు నాకోసం కాచుకునిఉంటాడు. రేపు సావకాశంగా మీరున్న లాడ్జికొచ్చి మీ అందరి పరిచయం చేసుకుంటాను. ఇప్పుడు పొద్దు పోయిందికూడా,'' అనేసి, మిస్టర్ చింతా ఇవతలికి వొచ్చేశారు.

హాలులో పట్టూ లేడు. మిస్టర్ చింతా పిలిచాడు. ఆ పిలుపుకి సమాధానంరాలేదు. ఇవతలికొచ్చాడు; అక్కడలేడు పట్టూ. గుమ్మందగ్గర కునికిపాట్లు పడుతున్న ఆసామీని అడిగాడు పట్టూ అనబడే కుర్రాణ్ణి అతను చూశాడేమోనని.

హఠాత్తుగా మెలుకువ వచ్చిన ఆ ఆసామీ కళ్ళు నులుపుకుని మిస్టర్ చింతవంక చూశాడు. పట్టూని వర్ణించాడు మిస్టర్ చింతా. ఆసామీ 'అతనా ?' అన్నట్టు తల ఊపి, హాలుపక్క సందులోకి చేత్తో సంజ్ఞ చేసి మళ్ళీ నిద్రపోయాడు. మిస్టర్ చింతా అటుపోయి తొంగిచూశాడు. సందులో ఎవరూ లేరు. కాని ఎదురుగా "పురుషులకు," అన్న పెద్దబోర్డుచూసి, బహుశా పట్టూ అందులోకి పోయిఉంటా డనుకున్నాడు మిస్టర్ చింతా. మామూలుగా అయితే అతని కోసం వేచిఉండేవాడుకాడు. ప్రస్తుతం పట్టూ స్థితికొంచెం అనుమానాస్పదంగా ఉంది. అదీగాక తనే అతన్ని ఇంటి దగ్గర్నుంచి తీసుకొచ్చాడు. అంచేత అతన్ని ఇంటికి చేర్చవలసిన బాధ్యత తనమీదే ఉందను

కున్నాడు మిస్టర్ చింతా. రోడ్డు సందులోకి తిరిగే మూల, లాంతరు స్తంభాన్ని ఆను కుని కరోనా వెలిగించాడు. నాట్యాన్నీ, నాట్యంచేసిన అమ్మాయిల్నీ గుర్తుతెచ్చుకో డానికి ప్రయత్నిస్తు పొగవొదులుతున్నాడు.

రామలింగయ్య కల్యాణితోటి రాధతోటి జరిగిన విషయమంతా చెప్పి, ఆ కుర్రత నెవరో రోశయ్యగాణ్ణి భూస్థాపితం చేశా డనీ, రావలిసిన డబ్బు అణా పైసలతో వొచ్చేస్తుందనీ ధైర్యంచెప్పాడు. ఇంకా ఊళ్ళోవా శైవళ్ళో వాళ్ళనిద్దర్నీ అభినంది స్తున్నారు. పిల్లలింకా మేకప్పులు తుడి చేసుకోలేదు. వాళ్ళు అందర్నీ విడిపించుకు రావడానికింకా అరగంటైనా పడుతుంది. అంచేత తవింక కూచోలేనని చెప్పి లాడ్జికి బయలుదేరాడు రామలింగయ్య. థియే టరు పక్కగుమ్మంలోంచి అవతలికి పోబో తుంటే, చీకట్లోంచి ఇవతలికొచ్చాడు పట్టూ. అతని చేతిలో పూలగుత్తి వొణుకుతోంది.

"ఆ అమ్మాయితో..." అని మిగతా మాటలు మింగేశాడు పట్టూ.

"ఏ అమ్మాయితో?" అని అడిగాడు రామలింగయ్య.

"కల్యాణిగాక ఇంకో..." అని మళ్ళీ గుటకలువేశాడు పట్టూ.

"వాళ్ళ అసలు పేర్లెల్లా తెలుసు నీకు? ఎరుగుదువా ఏవిఁటి? బంధువులా?"

ఔనో కాదో తెలీకండా తలఊపాడు పట్టూ. వాళ్ళు పేర్లు మార్చుకున్నట్టే అతడికితెలీదు. శుభలేఖలో అచ్చువేసిన పేరు కల్యాణి అని మాత్రం తెలుసు.

"గ్రీన్ రూంలో ఉన్నారు," అని వెళ్ళ బోయాడు రామలింగయ్య.

"ఆ రెండో అమ్మాయి..." అన్నాడు పట్టూ.

"రాధేనా?" అన్నాడు రామలింగయ్య. పట్టూకి ఆ పేరేకావాలి. అతని ధోరణి రామలింగయ్యకి అనుమానంగా ఉన్నా, వాళ్ళకి తోడు కామన్న ఉన్నాడుగదా అని అతను వెళ్ళిపోయాడు.

పట్టూ గ్రీన్‌రూం దగ్గరకు వెళ్ళేసరికి, అభినందనాలు చెప్పడానికొచ్చిన ఆఖరు అభిమానులు వెళ్ళిపోతున్నారు. కళ్యాణీ, రాధా దీర్ఘంగా నిట్టూర్చి చెవులనున్న ఆభర ణాలు తీయడానికి ఉపక్రమించారు.

పట్టూ గ్రీన్‌రూం గుమ్మంలోకొచ్చి నిల బడ్డాడు. అతని ప్రతిబింబం అద్దంలో చూశారిద్దరూ. మరో అభిమాని - ఎవరో అనుకుని చిరునవ్వుతో అతనివంక తిరిగారు. పట్టూ శిలావిగ్రహంలాగ కదలకుండా నిలబడ్డాడుగుమ్మంలో. కల్యాణి అతని ముఖం ఎప్పుడూ చూడలేదు. రాధకి మాత్రం ఆ ముఖం—అలా తెల్లబోయి కళ్ళప్పగించి చూసే ముఖం—ఎక్కడో చూసినట్టుగుర్తు. బొమలు ముడివేసి అతని వంక పరీక్షగా చూసింది, చటుకుని గుర్తు కొచ్చిందామెకు. ఆరోజుని అరుగుమీంచి చూసిన ముఖం! నేలమీద బోర్లాపడి పైకెత్తిన ముఖం!

"నువ్వా!!" అంది రాధ—తన కళ్ళని తనే నమ్మలేనట్టు.

సమాధానంగా పట్టూ పూలచెండు ఆమె చేతికిచ్చాడు. అది ఆమె లాక్కొని నేలని వేసికొట్టి, కాళ్ళకింద ఆ పూలను రాసేసింది. కల్యాణి కిదంతా అయోమయంగా ఉంది.

"మాకు పువ్వులు పట్టుకొచ్చి ఇవ్వడా నికి నీకు సిగ్గులేదూ? నువ్వూ మనిషివేనా?" అంది రాధ.

"నేను చెప్పేది..." అన్నాడు పట్టూ—

"ఫో అవతలికి," అని అరిచింది రాధ.

"నేను కావాలని చెయ్యలేదు..."

"మా అక్కయ్య బతుకు నట్టేట్లో ముంచావు చాలదూ? పుండుమీద కారం జల్లడానికొచ్చావా, ఈ పువ్వులట్టుకుని?"

కల్యాణి గతుక్కుమంది. వాల్మీకాశ్ర మంలో సీతమ్మవారిలాగ అక్కడే భూమిలో ఏకమైపోతే బాగుండు ననిపిం చింది ఆమెకు. సిగ్గు, అవమానంతో నవ నాడులూ కుంచుకుపోయాయి.

"అన్నయ్యా!" అంటూ అవతలకి పరిగెత్తింది.

కామన్న మండూకాసనంలో ఉన్నాడు.

"అన్నయ్యా, ఆ దుర్మార్గుడు..." అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది కల్యాణి; చిక్కుపడిన కాళ్ళనీ, చేతుల్నీ ముడి విప్పుతూ.

"ఎవడే?" అని అడిగాడు కామన్న.

"వాడే ... పె ... ళ్ళికొడుకు," అన గలిగింది కల్యాణి.

"ఆ!!" అని గర్జించి పెద్ద అంగలు వేసుకుంటూ బయలుదేరాడు కామన్న.

ఫో" అంటోంది రాధ, వందోసారో ఏమో.

"నేను ఎందుకలాచేశానో తెలిస్తే..."

పట్టూ వాక్యం పూర్తికాకండానే అతని మెడమీద ఏదో దూలం విరిగి పడ్డట్టైంది. ఎదరికెళ్ళి తెరల్లో చిక్కుపడ్డాడు. తేరుకుని ఇవతలికొచ్చేలోగా కల్యాణీ, రాధా వెళ్ళి పోతున్నారు.

"మీరుముందు వెళ్ళిపోండి. వీణ్ణి భూస్థా పితం చేసి, తాపీగా వొస్తా," అంటున్నాడు కామన్న. కల్యాణీ రాధా బయలుదేరారు.

"రాధా! నేనుచేసినదానికి కారణముంది" అంటూ వెంట పడబోయాడు పట్టూ.

"నేను చేస్తున్నదానికి అంతకన్నా మంచికారణముంది," అన్నాడు కామన్న. అంటూ పట్టూ మెడదగ్గర చొక్కా పట్టు కుని బలంగా తనవైపు తిప్పుకున్నాడు.

"నేను చెప్పేది విను," అన్నాడు పట్టూ.

"నేను చెసేది చూడంటే," అన్నాడు కామన్న. ఎడమదవడమీద, కుడి గుప్పి డితో హాలంతా మారుమోగే దెబ్బకొట్టాడు. పట్టూ కళ్ళముందు వేలకొద్దీ నక్షత్రాలు మెరిశాయి.

పురుషుల దొడ్డిలోకి వెళ్ళినపట్టూ ఇంత వరకూ రాకపోయేసరికి మిస్టర్ చింతా ఆ దొడ్డి పరీక్షిద్దామని బయలుదేరాడు. పెద్దగా దుమ్ము లేపుకుంటూ ఒకకారు సందులోంచి రోడ్డుమీదికి 'కీచు' మంటూ తిరిగి వెళ్ళి పోయింది. కార్లో ఆ అమ్మాయి లిద్దరూ

ఉండడం చూశాడు మిస్టర్ చింతా కారు వంక ఒక చిరునవ్వు పారేసి. కొత్తచుట్ట అంటించి సందులోకి బయలుదేరాడు నాలు గడుగులు వెయ్యడంతోటే పట్టా పక్క గుమ్మంలోంచి ఎగిరొచ్చి ఇవతలపడ్డాడు ఎగిరిపడడం అంత వింతగాతోచలేదు మిస్టర్ చింతాకి పట్టా ప్రవర్తన కొంత అసంద ర్భంగానే ఉంటోందీ మధ్య అం చే త అతను ఏ గుమ్మంలోనించైనా ఎగిరి ఇవత లికి ఉరికాడంటే, అంత ఆశ్చర్య పడవలి సిన పనిలేదు అయితే ఎ గి రి వ చ్చి న విధానంమట్టుకు వింతగా ఉంది అతని వీపు ఉండీయ బద్దలా వంగింది చే తు లు గుమ్మంవేపు దేన్నో పట్టుకోడానికి లాగ జాచాడు కాళ్లు గాలిలో నేలకోసం వెతు క్కుంటున్నాయి వెనక్కు ఎగురుతూ వచ్చి సందులో ఉన్న లాంతరు స్తంభాన్ని ఢీక్కొ బోయి, ఏ కారణంవల్లో వెంట్రుక వాసిలో తప్పించుకుని, చెత్తడబ్బాని నేరుగా వీపుతో గుద్దాడు చెత్తడబ్బా పక్కకి వాలింది తనంతట తను ఇలా ఎల్లా ఎగరగలిగాడా అని మిస్టర్ చింతా ఆలోచిస్తుండగా ఈ ఎగరడానికి మూలకారణం గుమ్మంలోంచి ఇవతలికొచ్చింది.

"అంతా ఓ చిన్నపొరబాటు," అన్నాడు పట్టా

"అదికాదురా పొరబాటు, నువ్విక్క డికి రావడం పెద్దపొరబాటు.'' అంటూ కామన్న కూచున్న పట్టాని లేవదీసి నిల బెట్టాడు

''నేను చెయ్యాలని చేయలేదు," అన్నాడు పట్టా

''నేను చంపాలనే చంపుతున్నా," అంటూ కామన్న మరొక గుమికీ దొక్కలో ఇచ్చాడు పట్టా ఊపిరంతా కాళీ అయి పోయి నేల మీదఉండగ చుట్టుకుని పడి పోయాడు.

"మీకిద్దరికీ తగాదా ఎందుకొచ్చిం దసలు"? అన్నాడు మిస్టర్ చింతా

"వాణ్ణే అడుగు '' అన్నాడు కామన్నా, పట్టాని చొక్కా పట్టుకుని లేవనెత్తికుడి దవడ పగిలే దెబ్బతీశాడు సందులో సగం దూరం ఎగిరాడు పట్టా తల ఒక్కసారి విదిలించుకుని లేచి నిలబడ్డాడు

''మీ చెల్లెలి జీవితం పాడుచేద్దామని కాదు నేను పారిపోయింది నేను చెప్పేది''

మిగతా వాక్యం పూర్తి కానివ్వలేదు కామన్న పట్టా మరోలాంతరు స్తంభాన్ని వెంట్రుక వాసిలో తప్పించుకుని గోడమీద పడ్డాడు

మిస్టర్ చింతాకి చటుకుని అంతా అర్థమై పోయింది

''మిస్టర్...అతను చెప్పేది..." అన బోయాడు. కామన్న తన మాట వినిపించు కోదం లేదని గ్రహించి విరమించుకున్నాడు

అయితే ఆ ద్వంద్వయుద్ధంలో అతను జోక్యం కలిగించుకో దలచుకోలేదు ముఖ్యకారణం అతని దుస్తులు దుమ్మై పోతాయి, చిరిగిపోవచ్చుకూడా మిస్టర్ చింతాకి తన దుస్తులంటే అమిత గౌరవం ఈలోగా పట్టాని మరో లాంతరు స్తంభం దాకా ఎగరగొట్టాడు కామన్న ఇంక బజారు వీధికీ వాళ్ళకీ మధ్య ఒక్కలాంతరు స్తంభమే ఉంది తాపీగా ఆరిపోయిన చుట్ట తిరిగి అంటించాడు మిస్టర్ చింతా ఈలోగా జావలాగ జారిపోతున్న పట్టాని నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు కామన్న పట్టా తన తల బలంగా విదిపాడు మత్తు దిగడానికి అతన్ని శాశ్వతంగా పడుకోబెట్ట డానికి తగినంతబలం కూడబెట్టుకుంటూ, మంచి అనుకూలమైన వాటం కోసం చూస్తు న్నాడు కామన్న. మిస్టర్ చింతా సురక్షిత మైనంత దగ్గరగా వచ్చాడు

"తిరిగి ఇచ్చెయ్యి." అన్నాడు మిస్టర్ చింతా.

"ఆ ?'' అన్నాడు పట్టా.

''దెబ్బకి దెబ్బ,'' అన్నాడు మిస్టర్ చింతా

మిస్టర్ చింతా వేపు వెటకారంగా చూశాడు కామన్న. అదే అతను చేసిన పొరబాటు మణుగుదెబ్బ ఛాతీమీద పడ్డం తోటే అంత మనిషీ వెనకనున్న లాంతరు స్తంభాన్ని వెళ్ళిగుద్దేశాడు ముందు దెబ్బ, వెనక లాంతరు స్తంభం అతని తల మీద తీసిన దెబ్బ, వీటికన్న అసలు పట్టా అంత దెబ్బ కొట్టినందుకు ఆశ్చర్యం, అన్నీ అతన్ని క్షణంసేపూ నిశ్చేష్టుణ్ణి చేశాయి. కాని పట్టా దగ్గరకు రావడంతోటే మెల్లగా ఒడుపుగా లేచాడు

అక్కణ్ణించి యుద్ధం రెండు దీప స్తంభాలమధ్య కేంద్రీకృతమైంది పట్టా కామన్నని ఒక దీపస్తంభం దగ్గిరికి కొడితే, కామన్న పట్టాని రెండో దీపస్తంభం దగ్గిరకు కొట్టడం — ఇలా చాలా సేపు నడిచింది దెబ్బలాటకి అసలు కారణం ఇద్దరూ మరిచిపోయారు మెదడుకి తగిలిన దెబ్బలతో అన్ని ఆలోచనలూ చెదిరి పోయాయి ఇద్దరికీ శత్రువుని చచ్చేదెబ్బ తియ్యాలన్న సంకల్పం ఒకటే మిగిలింది ఇద్దరిలోనూ

మనస్సులో ఎంత ఆవేశమున్నా శరీరాల్లో బలం సన్నగిల్లినమూలంగా దెబ్బ కొడితే వెనకటంతదూరం ఎగిరిపడ్డం లేదెవ్వరూ గుమికీలు నీరసపడ్డాయి దెబ్బ తగలకపోయినా అక్కడికక్కడే తూలిపడి పోతున్నారిద్దరూ ఆస్థితిలో తన ఆసనాలని తలుచుకుని ఆవేశమంతా పిడికిలిలో బిగించి పట్టా తలమీద ప్రయోగించాడు కామన్న. పట్టా పడిపోయాడు కామన్న ముదుసులు మెదడులోకంటా తేలుకుట్టినంత బాధ పెట్టాయి పట్టామీద పడ్డాడుకామన్న నిద్ర పోబోతున్న తనమీదపడి నిద్ర చెడగొట్టి నందుకు పట్టా శరీరానికి పౌరుషమొచ్చింది. అక్కణ్ణించి అమెరికన్ ఫ్రీస్టైల్ కుస్తీ ప్రారంభమైంది. ఒకరిమీద ఒకరు దొర్లుతూ సందుచివరదాకా వొచ్చేశారిద్దరూ, మళ్ళీ సందులోకి దొర్లారు ఎల్లా నిలడ్డారో ఇద్దరూ నిలబడ్డారు వాటేసుకున్నారు. ఒకళ్ళమెడ మరొకళ్లు విరిచెయ్యడానికి విశ్వప్రయత్నం చేశారు చటుకుని పట్టాకి తన చిన్నప్పు

దొక వస్తాదు సరదాకి నేర్పిన పట్టొకటి గుర్తుకొచ్చింది చప్రుని కామన్నని, అతని వీపు తనవేపు వచ్చేటట్టు తిప్పుకున్నాడు పట్టూ కామన్న చేతులు రెండూ వెనక మెలేసి మణికట్లు రెండూ పట్టేశాడు

కామన్నకి ఆశ్చర్యంతో మతిపోయింది చేతులు వొదిలించుకోడానికి ప్రయత్నిస్తే వొంట్లో నరాలన్నీ ఎలక్ట్రిక్‌షాక్ తగిలి నంతబాధ పెట్టాయి ఒక్కవేలన్నా కదప లేకపోయాడు కామన్న

''ఏదీ మళ్ళీపట్టి చూపించు,'' అన్నాడు

"ఒప్పుకున్నాడు, ఇంకొదిలెయ్యి." అన్నాడు మిస్టర్‌చింతా ?

"ఆఁ" అన్నాడు పట్టూ, అతనికేమీ అర్ధంకాలేదు

"వొదిలెయ్యి.'' అన్నాడు మిస్టర్ చింతా

పట్టూ వొదిలేశాడు కామన్న నలిగి పోయిన నరాల్ని కాస్త సముదాయించు కుంటూ అన్నాడు,

''పదేళ్ళుగా ఆసనాలు వేసిన ఘటాన్ని అంత సులువుగా ఎల్లా పట్టేశావు ? ఎవరు నేర్పారు పీ కీ పట్టు ? ఏదీ, ఒక్కసారి మళ్ళీ పట్టు,'' అన్నాడు

"జెంటిల్‌మన్! ఇప్పుడు పానీయాలకు విశ్రాంతి తరువాత పోటీ తిరిగి జరప బడును మిస్టర్..." అని ఆగాడు మిస్టర్ చింతా

"కామన్న." అన్నాడు కామన్న ఒగరుస్తూ.

''మిస్టర్ కామన్నా' మీ పరిచయ భాగ్యం కలిగినందుకు సంతోషం అవతల పక్క నా కారు సిద్ధంగాఉంది అందులో ఎక్కి మా ఇంటికి పోదాం టీ సేవించిన తదుపరి, ఈ వివాదం పరిష్కరించడానికి ప్రయత్నం చేద్దాం ఒక హెచ్చరిక, సందు తిరగ్గానే బజారు వీధి. అక్కడ పోలీసు లుంటారు అంచేత దుమ్ము దులుపుకుని, జుట్టు సాధ్యమైనంత సద్దుకుని ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని ప్రాణ స్నేహితుల్లా రావాలి ఈ కుస్తీ తాలూకు చాయ లేమన్నా అక్కడ కనబడితే, మీరు పెద్దమనుషులని పోలీసుల్ని నమ్మించడం కష్టం అంచేత హెచ్చరిక. రెడీ, పదండి"

రెండడుగులు వేశాక మిస్టర్ చింతా ఆగాడు పట్టూ కామన్నాకూడా ఆగారు

"జెంటిల్‌మన్! మరొక హెచ్చరిక మా ఇంట్లో ఈ యుద్ధం తిరిగి ప్రారంభిం చడం ఇందుమూలంగా నిషేధించడమైనది. ఇంటిచుట్టూ, అతి వ్యయ ప్రయాసలకోర్చి పెంచిన విలువగల పూలమొక్కలకు ఏమాత్రం అపాయం వొచ్చినా మేం సహించం ఇక ఇంటిలోపల ఎన్నో విలువైన ఫొటోలు, చిత్రపటాలు, అద్దాలు, తివాసీలు, సోఫాలు, అతి సున్నితమైన ఫర్నీచరూ ఉన్నాయి అవి వెంట్రుకవాసి కదలితే మేం తీవ్రమైన చర్యతీసుకోవలసి ఉంటుంది అంచేత మీ వివాదం నోటినిదాటి మిగతా అవయవాలవరకూ వ్యాపించడానికి వీల్లేదు తెలిసిందా ?" (సశేషం)

శ్రీరామనిర్వేదము

"రాజన్నకవి"

(సీతా పరిత్యాగానంతరము శ్రీరాముడుపడిన విరహవేదన ఇందు వర్ణింపబడినది)

శా॥ ఓ నిష్పంద సుధాస్రవంతి ! రఘువంశోద్ద్యోతినీ ! త్వద్రసా
ఖ్యానాఖ్యాపిత మైనజీవితము జీర్ణారణ్యమై చావకు
న్నానే ! మృత్యుభుజోపగూహన మనన్యస్త్రీపరిష్వంగకీ
ర్త్యానందమ్ములు కొల్లవెట్టుటని — రామాకారసంజీవినీ ! !

చ॥ మెదలును నెచ్చెలీ ! అనునిమేషము తావకదీనదీనదృ
గ్వదనము రామహంతకునిపాడుమనస్సునయందు — లోకభ
ద్రదమగు నీ స్వరూపము వృథావృజినాస్పద మౌ నటంచు నే
బెదరెదఁ, జూడకే కృతకవీరుఁడు రామునివైపు జానకీ ! !

చ॥ అణువణువందు నీవిరహ మగ్ని రగిల్చెడుమేను, కన్నుఁగూ
ర్కిన గడెలేదు, నిస్వశిత కీలితమైనది రాచగద్దె, నా
ప్రణయము ధర్మదేవతకుఁ బట్టిన బోనముఁగాఁగ నిట్టులే
మననమొనర్తు నీదగు సమాఖ్య నఖంపచబాష్పమాలికన్.

శా। నీకై యెంతదురంతదంతురితవహ్నిప్రాయదుర్దాంతచిం
తాకాకోలవిషంబు ద్రావితినొ సీతా ! యేకపత్నీవ్రత
మ్మాకారంబు ధరించినట్టినను సంహారంబు సేయంగఁ దా
నేకల్పించెనొ ధాత యిట్టిగతి ? యూహింప న్విచిత్రంబగున్ !

ఉ॥ కాలము కాలసర్పమయి, గాఢతరోగ్రవిషాగ్నివిస్ఫురత్
జ్వాలల భూనభోంతర దిశావలయమ్ములఁ జుట్టి నిట్టి యీ
భీలభవద్వియోగపృథువిష్టరముష్టికిఁ జిక్కి ప్రాణముల్
చాల హ్రసింప, భీకరవిషాదముఁ గూర్చె ధరాతలాత్మజా ! !

శా॥ ఈనాలోక మనేకధావళబలంబీరమ్య రాగోల్లసత్
క్వాణప్రీత ఘుమంఘుమారభటికాగ్రామమ్ముగా, తోష మెం
తే నిండారఁ దదీయ వీక్షణ కళాహేవాకకార్యోన్ముఖ
శ్రీనిత్యోత్సవమందుఁ బాల్గొనవె ! ఓ సీతా ! దయోపేతవై ! !
నవచైతన్యవిశృంఖలోరితల మీనాఁ డేమొ నిశ్చేతన
వ్యవహారమ్ముల స్రగ్గి మ్రగ్గినది, యూహాతీతమై, మద్విదూ
రవు నీమనగడకున్ గతమ్మయిన కార్యా కార్య నిర్ణాయక
ప్రవణత్వమ్మెద నిల్వఁజేయఁగదె! తత్రత్యుల్ వినోదింపఁగన్.

అదృష్టము

దోర్బల, వేంకటరామశర్మ

అదృష్టమన్నిటికన్న మిన్నయైనది అది తారుమారైనప్పుడు లక్షాధిపతి భిక్షాధిపతిగను, భిక్షాధిపతి లక్షాధిపతిగను మారుచుండును అదృష్టమునకడ్డునది అసలు లేనేలేదు మానవుడాశతో జీవించునట్లు అదృష్టముతో నభివృద్ధినిగాంచుచున్నాడు అతడుపుట్టినమండి గిట్టునంతలో అదృష్టమతనిలో ఒక వెలుగు వెలిగి, ఒక మెఱపుమెరిసి అతనిని మహోన్నత స్థానమునకు, గొంపోవును భోగభాగ్యములతో నోలలాడించును కీర్తిప్రతిష్ఠలను పెంపొందించును వేయేల? అదృష్టమతని నావరించిన నతనితో సమానుడు లోకములో లేడనియే చెప్పవచ్చును నేను దీనిని గురించి ఆలోచించుచుండగా దీనికి సంబంధించిన ఒకకథ జ్ఞాపకము వచ్చినది

పూర్వమొక గ్రామములో "హరిశర్మ" అను బ్రాహ్మణు డుండెను ' అతడు నిరక్షరకుక్షి. ఆగర్భదరిద్రుడు దీనికితోడు బహుకుటుంబీకుడు దరిద్రు లధికబాధల నొందుటకు గాబోలు అధికసంతానము కలుగుచుండును మన కథానాయకుడగు హరిశర్మ, యీతిబాధలకు తాళజాలక, కుటుంబ పోషణకై భిక్షాటనముచేయుచు, ఊరూర తిరుగుచు, స్థూలదత్తుడను మహాధనికునాశ్రయించి, అతనియొద్దనే భార్యా, పిల్లలూ, తానూ పనిచేయుచు కాలముగడుపుచుండెను.

కొంతకాలము గడిచినపిమ్మట స్థూలదత్తుని కూతురువివాహము నిశ్చయమయ్యెను బంధుమిత్రాదులతో ఇల్లు కిటకిటలాడుచుండెను మహాధనికుడు కాబట్టి మహావైభవముగ వివాహము చేయుచుండెను హరిశర్మ యత్యధిక సంతోషముతో "బ్రాహ్మణో భోజనప్రియః అన్నట్లు భార్యా పిల్లలతో బాగుగా భోజనము సేయుదునని యువ్విళ్ళూరుచుండెను ఆనాడింటిలో వంట మాన్పించెను భోజనమునకు నిరీక్షించుచుండెను కాని, యా సమయమున నెవరుకూడ నతనిని పిలువ లేదు పిలుచుట యటుంచి, చివరకు జ్ఞాపకముకూడా చేయలేదు అందువలన నతనికి కినుక కలిగి, రాత్రి బాగుగా నాలోచించి, భార్యతో నీవిధముగ ననెను

"దారిద్ర్యమువలన, మూర్ఖతవలన నాకీ అగౌరవము గలిగినది కావున యుక్తిచేత, కృత్రిమ విజ్ఞానమును గనబరచి, గౌరవమును పొందుదును నీవు మాత్ర మవసర సమయమున నన్ను 'మహాజ్ఞానిగ' నతనికి తెలుపవలసినది,'' అని చెప్పి, హరిశర్మ అందరు పడుకున్నది చూచి, స్థూలదత్తుని అల్లునిఅశ్వము నొకచోట దాచివచ్చెను.

తెల్లవారిన తరువాత అల్లునిగుఱ్ఱము పోయినదని అందరు చింతించిరి. అది యమంగళమని తలంచిరి ఆ సమయమున హరిశర్మభార్య వచ్చి. మాఆయన మహాజ్ఞాని, జ్యోతిశ్శాస్త్ర విశారదుడు అనుభవజ్ఞుడు మీరాయనతో విచారించిన మీ అశ్వము తప్పక దొరుకునని ధనికునితో ననెను ఆమాట వినిన వెంటనే నతడు హరిశర్మ నాహ్వానించెను ''నిన్న జ్ఞాపకమురానివాడను అశ్వమపహరింపబడగా నేడు జ్ఞాపకము వచ్చితినని' అనుచు వచ్చిన బ్రాహ్మణుని చూచి స్వామి మేము మిమ్ములను పిలువనందులకు మా యపరాధమును క్షమించు"మని ప్రార్థించి, స్థూలదత్తుడు, అశ్వము నెవరపహరించిరో తెలుపుడని సగౌరవముగ నడిగెను అప్పుడు హరిశర్మ అబద్ధపు లెక్కలు వేయుచు, "మీ గుఱ్ఱము మీ ఊరి దక్షిణ దిశలో దాచబడినది సాయంకాలంలోపల చోరులు దానిని దూరము తీసికొనిపోక ముందు తేవలయునని చెప్పెను వెంటనే స్థూలదత్తుడు చారులను పంపి అశ్వమును తెప్పించెను హరిశర్మ ప్రజ్ఞను వేనోళ్ళ కొనియాడెను జనులంద అతనిని ''మహాజ్ఞాని' యని గౌరవించుచుండిరి ఈ విధముగ హరిశర్మ స్థూలదత్తునివలన గౌరవము పొందుచు, అతని యింటిలో సుఖముగ నివసించుచుండెను

ఇట్లు కొన్నిదినములు గడిచిన తరువాత ఒకనాడు రాజు ఖజానాలో దొంగలు పడి రత్నముల దొంగిలించిరి రాజెంత వెతకించినను దొంగలు దొరకనందున, మహాజ్ఞాని

జ్యోతిశ్శాస్త్ర పండితుడవి ప్రసిద్ధిజెందిన హరిశర్మను తొందరగ పిలిపించి, తద్విషయము గురించి ప్రశ్నించెను నిజమైన జ్ఞానములేని హరిశర్మ యేమిచెప్పవలయునని యాలోచించుచు, అడిగినపుడెల్ల రేపు చెప్పుదునని వాయిదాలు వేయుచు రాజభవనములోనె కాలము గడుపుచుండెను

రాజభవనములో 'జిహ్వ' అను పేరుగల దాసియుండెను అది తన తమ్మునితో కలిసి రత్నముల నపహరించెను. ఈ బ్రాహ్మణుడు మహాజ్ఞాని అను అనుమానముతో ఏతదేమనుచుండునోయని రాత్రి యతని గది ముందు విలుచుండెను హరిశర్మ తనమిథ్యా నటనకు చాల చింతించి, ఉదరపోషణార్థమై అసత్యమాడుచున్న తననాలుక నీవిధమున నిందించెను "దురాచారముల ఓ జిహ్వా! భోగలాలసచేత నీ వేమిపని చేసితివి? ఇప్పుడు రాజశిక్ష ననుభవించు" మనెను ఆదాసి యామాటలు విని, ఇతడు నన్ను నిజముగ తెలికొన్నాడని తలంచి, తన విషయమంతయు చెప్పి, తనను కాపాడుమని లంచమిచ్చినట్లు కొంత ధనమిచ్చి ప్రార్థించెను.

హరిశర్మ యదృష్టము కలిసివచ్చినది ఇది మంచిసమయమని తలంచి, సగర్వముగ దానితో నిట్లనెను, "పొమ్మ నాకు భూత భవిష్య ద్వర్తమానములు తెలియును. దీనురాలవగు నీవు నన్ను శరణు సొచ్చినందున కాపాడుదును కాని, మిగత ధనమును కూడ నాకు ఇవ్వవలయును" అని తప్పనిసరి అయినందున మిగత ధనము దాచిన స్థలము చూపి దాసి వెళ్ళిపోయెను హరిశర్మ, ఆశ్చర్యముతో ననుకొనెను అహా! అదృష్ట మెంతటి యసాధ్యమైన కార్యమునైనను అవలీలగ సాధించును కదా! దీని కిదే నిదర్శనము నా కిపు డాపద కలుగునని అనుమానించగ, ఆపద పోయి, హాయిగ కార్యము సిద్ధించినది మ్రొక్కపోయిన దేవు డెదురు వచ్చినట్లు, నాజిహ్వను నిందించుచుండగ, దొంగజిహ్వ స్వయముగ నెదుటికి వచ్చినది ఆశ్చర్యము "ప్రచ్ఛన్న పాతకులు అనుమానముచేతనే తమ దోషమును తమంతట తాము తెలుపుచుందురు కాబోలు" అను నాలోచనతో నెటులనో యారాత్రి గడిపెను.

మరునాడు ఉదయముననె హరిశర్మ తన అలౌకిక విజ్ఞానయుక్తిని నటించి, సభ నేర్పాటు గావించి రాజుకు ఉద్యానవనములో దాచబడిన ధనము చూపించి, మిగత ధనమును చోరు లపహరించిపోయిరని చెప్పెను. రాజు మిక్కిలి సంతసించి, ప్రజ్ఞను ప్రశంసించి అతనికి గ్రామములను బహుమానముగా నిచ్చుటకు పూనుకొనెను

అపుడు ప్రతిభావంతుడగు మంత్రి రాజుతో రహస్యముగ నీ విధము గననెను "శాస్త్రము లేనిదే (విద్వాంసుడు కానిదే) మానుషాగమ్యమగు నిటువంటి జ్ఞాన మెట్లు కలుగును? ఇతనియందు విద్వత్ లక్షణము లేవి గోచరించుటలేదు కావున నీతడు నిశ్చయముగా చోరసంకేతమును గుర్తించి, ధూర్తుడుగా జీవించుచున్నాడు ఈజ్ఞాని నింకొక యుక్తితో నింకొకసారి పరీక్షింపుడు" అని

రాజు మంత్రి సలహాను గౌరవించి, వెంటనే ఒకకుండలో మండూకమును దాచి, తెప్పించి, ఓజ్ఞానీ! ఇందులో నేమి యున్నదో నిజము చెప్పినచో నిన్ను గొప్పగ పూజింతు ననెను

హరిశర్మ రాజుమాటను విని తనకు తప్పక వినాశకాలము సంభవించినదని తలంచి, చిన్నతనములో తండ్రి, తనచేష్టలను చూచి పెట్టిన 'మండూక' అనుపేరును స్మరించి, అదృష్టము పలికించినట్లుగ తొందరగ యీ విధముగ ననెను, "ఓరి మండూకమా! సాధువు అవశుడవై నీకు నిష్కారణముగ, అకస్మాత్తుగ వినాశమునకే ఘటము సంప్రాప్తమైనది"

హరిశర్మ, అకస్మాత్తుగ పలికిన వాక్యము ప్రస్తుత విషయమున కనుగుణముగ నున్నందున, సభాసదు లందరు ఆశ్చర్యముగ మహాజ్ఞానియైన యితడు మండూకమునుకూడ తెలిసికున్నాడని ముక్తకంఠముతో ప్రశంసించిరి తరువాత రాజు హరిశర్మ ప్రజ్ఞావంతుడని తలంచి, సంతోషించి, అతని కనేక గ్రామములను, స్వర్ణరత్నాభరణ వాహనాదులను బహుమానముగా నిచ్చి సన్మానించెను ఆ క్షణంలో హరిశర్మ సామంతరాజువలె అయెను ఈవిధముగ సత్కర్మ నాచరించువారికి సత్ఫలములను దైవమే సాధించును, లోకములో అదృష్టముతో సమానమైన దేదియు లేదు అదృష్టవంతు డందరికన్న గొప్పవాడు.




ఢిల్లీలో రిపబ్లిక్ దినోత్సవం


స్వర్గీయ లాల్‌బహద్దుర్ శాస్త్రీజీ హోమి భాభాలను కోల్పోయిన హృదయభారంతో ఈసారి దేశం జనవరి 26 న రిపబ్లిక్ దినోత్సవాన్ని అతి నిరాడంబరంగా, హుందాగా జరుపుకొన్నది. ఢిల్లీ పరేడులో మా ప్రధానసంపాదకులు తీసిన ఫొటోలలో


కొన్నింటిని యిక్కడ ప్రకటిస్తున్నాము


లోగడకన్న యీసారి, శక్తిసమన్వితులమై వున్నామన్న ఒక నిండుదనం యిక్కడ కన్పిస్తుంది. ఆనాడు అక్కడ కదిలిన టాంకులు, ట్రక్కులు, సైన్యం - యివన్నీ ఒక కొత్త


అర్థాన్ని, ఒక కొత్త వెలుగును వెదజల్లాయి














లోగడవలె యీసారికూడా రాష్ట్రాల అలంకృత శకటాలు ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి. ఇంతకుముందుకన్న యిప్పుడు అలంకరణలో, నిర్మాణంలో, రూపొందించడంలో మరింతశ్రద్ధ తీసుకోవడం జరిగింది. రాష్ట్రాలన్నీ యించుమించు ఒకేవిషయంమీద తమతమ నమూనాలను రూపొందించాయి. అటు వందేమాతరం రూపకల్పన చేసిన పశ్చిమ బెంగాలు లగాయితు యిటు భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భవించిన భవనం నమూనా చూపించిన మహారాష్ట్ర వరకు — అన్నిటికీ విషయం ఒక్కటే



పశ్చిమ బెంగాలు




తొలి స్వాతంత్ర్య పోరాటాన్ని తెలియజేసే అలంకరణ శకటం




మధ్య ప్రదేశ్


రాష్ట్రాల నమూనాలు



గోవా




జై జవాన్ జై కిసాన్



మహారాష్ట్ర

పరేడు ఆఖర్లో కదలివచ్చిన జానపద నృత్యకారులు పూర్వంకన్న మరింత ఆకర్షణీయంగా, చైతన్యవంతంగా దారిపొడుగునా నృత్యం చేసుకుంటూనే వచ్చారు




నాగాలాండ్ నాట్యకారులు




రాజస్థాన్ నాట్యకారులు




ప్రధానమంత్రితో గోషది జానపద నాట్యకారులు




రిపబ్లిక్ దినోత్సవాలలో మనరాష్ట్రం తరపున పాల్గొన్న గోషది (ఆదిలాబాదులోని గోండ్లు) జానపద నృత్యకారులు రాష్ట్రపతితో




నాగాలాండ్ నుండి



ఎవరెస్టు మౌంటెనీరింగ్ సంస్థతాలూకు అలంకరణ శకటం



యుద్ధవీరులు



పరేడును తిలకిస్తున్న ప్రజలు

పంచతంత్రము

జరిగిన కథ

సంజీవకుని స్నేహముచే పింగళకుడు జ్ఞానశీలి అయెను దమనకుడు ఉపాయముతో ఎన్నో పనులు సాధించవచ్చునని తెలిపి కృష్ణ సర్పము ఉపాయముచే చచ్చుటయు సూచించెను. దీనితోపాటు ఎంద్రకాయ కథనుకూడ నక్క చెప్పును

ఒక వనమునందు భాసురకుడు అనుపేరు గల ఒక సింహము నివసించుచుండెను అది ప్రతినిత్యము అనేక మృగములను చంపుచుండెను. ఇట్లుండగానొకనాడు ఆవనమునందలిమృగములన్నియుసింహమువద్దకువచ్చి "స్వామీ, ప్రతిదినము దొరికిన మృగముల నెల్ల చంపుటవలన ప్రయోజన మేమి? మీ ఆహారమునకు కావలసినది ఒకటే మృగము కదా! కనుక మీరు మాతో ఒక ఒడంబడిక చేసుకొనుడు. అది యేమనగా నేటినుండి మీరు ఉన్నచోటికే దినమొక మృగము చొప్పున, మృగజాతిక్రమము ననుసరించి, మీ ఆహారార్థమై మీ వద్దకు వచ్చుచుండును. ఈ నియమముచేత మీ ఆహారముకూడ మీరు వెతుకకుండ ప్రతిదినము మీకు సులభముగా లభించుచుండును ఇంతేగాక ఇచ్చటి మృగము లన్నియు ఒకేనాడు నశించకుండ క్షేమముగా ఉండగలవు మీరు మా కందరికి రాజుగదా! ప్రజలమైన మా రక్షణము రాజధర్మము కదా!" అని చెప్పెను

ఆ మృగముల మాటలను విని భాసురకుడు ఈవిధముగచెప్పెను – "మీరుసత్యమే చెప్పితిరి. కాని నేను కూర్చున్న చోటికే దినమొక మృగము చొప్పున వచ్చిన ఎడల ఈ ఒప్పందము బాగుగనే యున్నది దాని వలన మృగము లన్నియు వ్యర్థముగా ఒకేసారి చావక నాకు ఆహారముగానే క్రమముగా ఉపయోగింపబడును" ఆ మాటకు మృగము లన్నియు అంగీకరించి శాంతించినవై ఆ వనమునందే మృగరాజా భయము లేక తిరుగుచుండెను ఆ ఒడంబడిక ప్రకారము జాతిక్రమముగా ఒక్కొక్క మృగము వృద్ధుడో, విరాగియో, దుఃఖితుడో, లేక భార్యా పుత్రుల నాశమువలన భయపడినవాడో, సింహము కడకు మధ్యాహ్న సమయమునందు దాని ఆహారార్థమై వెళ్ళుచుండెను

ఇట్లుండగా ఒకనాడు జాతిక్రమము ననుసరించికుందేళ్ళజాతివంతువచ్చెను ఒకవృద్ధశశమునకు వెళ్ళుటకు ఇచ్ఛలేకుండెను కాని విధిలేక మెల్లమెల్లగ వెళ్ళుచుండెను సింహముయొక్క వధోపాయమునుగూడ చింతించుచుండెను ఇట్లు ఆహార వేళను దాటించి, జాగుచేసిపోయెను వెళ్ళునప్పుడు దారిలో ఒకనూతిని చూచెను ఆ నూతిపైకి పోయి నూతిలో చూచుసరికి తన ప్రతిబింబము నీటిలో కనబడెను అది చూడగనే ఒకమంచి ఉపాయము దానికి తోచెను తరువాత ఆ కుందేలు నిదానముగా సాయంకాలమునకు భాసురకుని సమీపించెను సింహము కాలాతిక్రమమువలన ఆకలిబాధచే నకనకలాడుచుండెను. కోపోద్రేకమువలన పెదవులు నాలుకతో తడుపుచుండెను. "ఆహా! రేపు ప్రాతఃకాల ఆహారమునకే నేను ఈ వనమంతయు మృగరహితము చేసెదను" అని చింతించుచుండెను, ఇంతలో శశము మెల్లమెల్లగా సింహమును చేరి నమస్కరించి యెదుట నిలచెను అతనిని చూడగనే సింహము మండిపడి గద్దించుచు –

సింహ: ఒరే శశకాధమా! యీనాడు నాకు ఆహారముగా వచ్చిన జంతువు నీవు. అతి అల్పశరీరము గలదానవు. ఆ లోప మట్లుండగా ఇంతకాలాతిక్రమము చేసితివి ఈ అపరాధమునకుగాను ఇప్పుడు నిన్ను చంపుటయేగాక యీ వనమునందలి మృగముల నన్నింటిని గూడ రేపు తెల్లవార చంపెదను.

కుందేలు: (వినయముతో) స్వామీ! యిందు నా తప్పేమియు లేదు. ఇతర మృగముల దోషముగూడ లేదు. నేను ఆలస్యముగ వచ్చినందుకు కారణము వినుడు

సింహ: నా కోరల నడుమ చిక్కి నీవు చచ్చులోపల ఆ కారణ మేదో త్వరగా మనవిచేయుము.


కుందేలు: స్వామీ! అన్నిమృగములు జాతిక్రమముగా ప్రతిదినము మీ ఆహారార్థమై వచ్చుచుండెను. ఈ నాటినుండి మా జాతివంతు ఆరంభమైనది ఇంత చిన్న జంతువు ఒక్కటి మాత్రము ప్రభువు ఆహారమునకు సరిపోదని మృగము లన్నియు విచారించి నేడు నాతోపాటు అయిదు కుందేళ్ళను తమ ఆహారముకొరకు పోవలెనని నిర్ణయించెను ఆ ప్రకారము మేము

ఐదుగురము మీ కడకు వచ్చుచుంటిమి. ఇంతలో మధ్యమార్గమున మరియొక పెద్దసింహము భూవివరమునుండి వచ్చి 'ఒరే! మీ రెక్కడికి వెళ్ళుచుంటిరి? మీ ఇష్టదేవతను ధ్యానించుకొనుడు' అని అనెను. ఆ మాటకు నేను— 'మేము మా ప్రభువైన భాసురక సింహరాజు యొక్క ఆహారమునకు గాను ఒడంబడిక ప్రకారము ఆయన వద్దకు వెళ్ళుచున్నాము,' అని చెప్పితిని. ఆమాటకు ఆ సింహము "అయితే యీ వనము నాది. కనుక మృగము లన్నియు అట్టి ఒడంబడిక ప్రకారము నాకు ఆహారముగా రావలెను. భాసురకుడు దొంగరూపములో రాజు పేరు పెట్టుకొని తిరుగుచున్నాడు. అతడు రాజైనచో అతనిని తీసుకొనిరమ్ము. అతని రాచరికమును నావద్ద ఋజువుచేసుకొనునుగాక అంతవరకు మీలో నలుగురు నావద్ద నమ్మకము కొరకై ఉండి ఒక్కడుమాత్రము వెళ్ళిరావచ్చును. పొమ్ము, త్వరగారమ్ము. మా యిరువురిలో ఎవడు పరాక్రమవంతుడో అతడే యీ మృగముల నన్నిటిని భక్షించగలడు,' అని చెప్పి నన్ను పంపగా నేను ప్రభువులవారి సన్నిధికి వచ్చితిని. నా కాలాతిక్రమణమునకు కారణ మిదియే. దీనిపై తమచిత్తము.

సింహ: భద్రుడా, అలాగా, త్వరగా ఆ దొంగసింహమును నాకు చూపుము! నేడు నాకు మృగములపైన వచ్చిన కోపమును అతనిపై ప్రయోగించి శాంతించెదను.

కుందేలు: స్వామీ! తమ రాజ్యముకొరకు రాజులు పోరాడుట సహజమే. కాని యిప్పుడా సింహము తన కోటలో ఉన్నది. కోట నాశ్రయించియున్న శత్రువును జయించుట కష్టము.

సింహ: అది దుర్గములో నుండిన నేమి నాకు చూపుము, ఒక్క నిమిషములో చంపివేసెదను.



కుందేలు: స్వామీ అది చాలబలముగలది; నేను చూచితిని కనుక దానిశక్తిని తెలుసుకోకుండా స్వస్థానమును విడిచి మీ రక్కడకు వెళ్ళుట యుక్తము కాదు.

సింహ: ఓయీ యెందుకీ వ్యర్థాలాపములు; నాకు త్రోవ చూపుము.

కుందేలు: అయితే దయచేయుడు స్వామీ!

అని చెప్పి కుందేలు సింహము ముందు నడచుచువచ్చి ఆ కూపమునుచూపి "స్వామీ తమ ప్రతాపమును ఎవడు ఓర్చుకోగలడు. దూరమునుండియే తమ రాకను చూచి ఆ దొంగసింహము తన దుర్గములో దూరినది. రండు. చూపెదను," అని చెప్పెను.

ఆ మాటలకు సింహము "నాకు దుర్గము చూపుము." అనినతోడనే శశము ఆ కూపమును చూపెను. ఆ మూర్ఖ సింహము కూపములోని నీటియందు తన ప్రతిబింబమును చూచి సింహనాదము చేసెను. ఆ కూపమునుండి ఆ ధ్వనికి ప్రతిధ్వనివచ్చెను. అది శత్రు సింహనాదముగా భావించి ఆ శత్రువును చంపుటకు భాసురకుడు ఒక్కసారిగా తన ప్రతిబింబముపై కూపములోనికి దుమికి ప్రాణములు పోగొట్టుకొనెను. అప్పుడు ఆ కుందెలు సంతోషించి, అన్ని మృగములకు ఆ వార్త తెలిపి, ఆ వనమునందు వాటితో ఆనందముగా నివసించుచుండెను.

పైకథను దమనకుడు కరటకునికి చెప్పి బుద్ధిబలము కలవారికి అలవికాని పని యేదియులేదు అని ఋజువుచేసెను. ఆ మాట విని కరటకుడు "అయినచో మిత్రమా నీవు వెళ్ళుము. కార్యము సాధించుము. నీకు క్షేమము కలుగుగాక!" అని చెప్పి పింగళ సంజీవకులకు మిత్రభేదము కల్పించుటకు గాను దమనకుని పంపెను.

(సశేషము)

పరిమళాలు

వసంతఋతువు

శ్లో॥ శ్రుతిసుఖభ్రమరస్వనగీతయః కుసుమకోమలదంతరుచో బభుః
ఉపవనాంతలతాః పవనాహతైః కిసలయైః సలయైరివ పాణిభిః॥

— కాళిదాసకవి.

వసంతఋతువులో ఉద్యానవనమునందలి లతాకాంతలు, చెవులకు ఇంపైన భృంగస్వనములనెడు గీతములను పాడుచు, పువ్వులనెడు కోమలదంతముల కాంతులను వెదజల్లుచు, గాలికి కదలుచున్న చిగురుటాకులనెడు చేతుల చేత లయలు వేయుచు అభినయించుచున్నవా యనునట్లు నేత్రానందమును గల్గించుచుండెను

శ్లో॥ యోఽయం జనాపకరణాయ సృజత్యపాయం తేనైవ తస్య నియమేన భవేద్వినాశః।
ధూమం ప్రసౌతి నయనాంధకరం యమగ్నిః భూత్వాంబుదః స శమయేత్ సలిలైస్తమేవ॥

— కల్హణకవి.

ఎవడైతే, జనులకు అపకారము చేయుటకై అపాయములను సృజించునో, ఆ అపాయములవల్లనే వానికి వినాశము తప్పక కలుగును ఎట్లనగా, అగ్ని సృజించిన నయనాంధకరమైన ధూమమే మేఘమై జలమును కురిసి ఆ అగ్నినే చల్లార్చునుకదా। కనుక పరులకు అపకారమును తలపెట్టకూడదని భావము.

కం॥ క్షమలేని తపసి తపమును, బ్రమత్తుసంపదయు, ధర్మబాహ్యప్రభు రా
జ్యము భిన్నకుంభమునతో యములట్టుల యధ్రువంబు లగు నివియెల్లన్॥

— నన్నయ భట్టారకుడు

ఓర్పులేని మునీశ్వరుని తపస్సు, పొగరెత్తి పొరపాట్లు చేయు ధనవంతుని సంపద, ధర్మదూరముగా పరిపాలించు ఏలిక రాజ్యము, ఇవన్నియు పగిలిన కడవలోని నీరువలె అశాశ్వతములై నశించును

తే॥ గీ॥ చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు, డడ్డపడి వారితోడఁ గొట్లాడి యైన।
దాని నుడుపంగఁ జూరకున్నవానిఁ గ్రూర కర్ముఁడని చెప్పుదురు కర్మకాండవిదులు॥

— తిక్కన సోమయాజి.

బంధువులలో పరస్పర ద్వేషము కలిగినప్పుడు వారితో కొట్లాడియైనను ఆ ద్వేషమును మాన్పుటకు పూనుకొననివాడు క్రూర కర్ముడగును అని కర్మశాస్త్రజ్ఞులు చెప్పుదురు అనగా, బంధుద్వేషమును మాన్చుట కర్తవ్యమని భావము

ద్వి॥ తల్లి గల్గిన నేల తపసి గానిచ్చు - దల్లి గల్గిన నేల తలజడల్గట్టు,
దల్లి యున్న విషంబు ద్రావ నేలిచ్చు - దల్లి యుండిన తోళ్ళు దాల్ప నేలిచ్చు
తల్లి పాములనేల ధరియింపనిచ్చు - తల్లి బూడిదయేల దా బూయనిచ్చు
దల్లిపుచ్చునె భువిదనయుని దిరియ - దల్లి పుచ్చునె సుతు వల్లకాటికిని.

దల్లి లేకుండిన తనయుఁడుగాన - ప్రల్లదుఁడై యిన్నిపాట్లకు వచ్చె,
జన్నిచ్చి పలుమాఱు వెన్నయుఁ బెట్టి - పన్నుగా నిన్నియుఁ బాలును బోసి
యాఁకొనఁగా కడు పరసి పాలిచ్చి – సాకించి పనుపదే జనని గల్గినను.
దానింతవాఁ డయ్యెఁ దల్లి లేకయును - దా నెంత పెరుగునో తల్లి గల్గినను.

— పాల్కురికి సోమనాథకవి

బెజ్జమహాదేవి శివభక్తురాలు. శివుని మాతృప్రేమతో ఆరాధించుచు పై వాక్యములను పలికెను

సీ॥ నెలలోని యిఱ్ఱికి నీలకంఠునిచేతబోలుపారు లేడికిఁ బుట్టెనొక్కొ,
యజుఁ డన్ని రత్నంబులందునుం గలుగు క్రొమ్మించుల దీని గల్పించెనొక్కొ
రోహిణాచలము మేరువుఁ గూడి యురుతరప్రభల నీ హరిణంబు బడసెనొక్కొ
క్రొక్కారు మెఱుగులు చుక్కలయొరపును గలిసి యీ మృగమయి వెలసెనొక్కొ
గీ॥ దీనిఁ బోలంగ జంతువుల్ త్రిభువనముల - యందు మఱి కలవొక్కొ యని యాత్మ మెచ్చఁ
బ్రీతి వనదేవతలు సూడ సీతదృష్టి - మార్గమునకెల్ల చనియె న మ్మాయయిఱ్ఱి.

హుళక్కి భాస్కరకవి

సీతను వంచించుటకై రావణుడు ప్రేరేపించిన మాయలేడి. చంద్రునిలోని లేడికి శివుని చేతి జింకవలన పుట్టినదియో, బ్రహ్మదేవుడు వివిధ రత్నముల కాంతికి లేడిగా రూపకల్పన చేసెనో రత్నాచలము, బంగరుకొండ రెండును గూడి తమ కాంతులచేత ఈ లేడిని కనెనో, వర్షామేఘపు మెరుపులు, నక్షత్రములు ఈ రెంటి కాంతి కలిసి యీ మృగముగా రూపొందెనో, లేకున్న మూడులోకములలో లేని రూపకాంతులతో ఈ లేడి ప్రకాశించుట యెట్లు పొసగును

ఉ॥ వెన్నెలవెల్లి పాల్కడలి వేడ్కదనంబునఁ బేర్చి దిక్కులున్
మిన్నును ముంప, నందు రజనీకరబింబము కుండలీభవ
త్పన్నగతల్పకల్పనము భంగిఁ దనర్చెఁ, ద దంతరంబునన్
వెన్నునిభంగిఁ జూడ్కులకు వేడ్క యొనర్చెఁ గలంక మత్తఱిన్.

— ఎఱ్ఱాప్రెగ్గడ కవి

పూర్ణచంద్రుడు శేషతల్పశాయి యగు విష్ణువవలె నున్నాడు ఎట్లనగా, వెన్నెల సమస్త ప్రపంచము నందు వ్యాపింపగా అది పాలసముద్రమువలెను, అందలి చంద్రుడు శేషతల్పముగను, ఆ చంద్రునిలోని కళంకము ఆతల్పముపైన శయనించిన విష్ణువవలెను చూపరులకు కనపడెను

వసంత ఋతుపవనములు

ఉ॥ దోలల నూగు ద్రావిడవధూటుల శ్రోణుల వేగ మీగుచున్,
లాలితసింహళీవదన లబ్ధఘనసారవాసనన్
దేలుచు దక్షిణాచలవినిర్గతవాతవితానముల్ విలా
సాలసలోకజాలసముదంచితసేవలఁ గాంచఁగల్గెడిన్.

— ఆంధ్ర బిల్హణ

దక్షిణదిక్కునుండి వచ్చు వసంత ఋతువాయువులు ద్రవిడదేశస్త్రీల శ్రోణీభరమును తాకుటచేత వేగము తగ్గి మందము లగుచును, సింహళస్త్రీల తాంబూల కర్పూర వాసనలతో తేలుచు వీచుచు వచ్చి వివిధ విలాసములతో అలసిన విలాసిజనములకు హాయిని గలిగించుచుండెను అని దక్షిణ వాయువునకు గల శైత్య సౌరభ్య మాంద్యములు అను మూడు గుణములు చెప్పబడినవి, అందులో మాంద్య సౌరభ్యములు వాచ్యముగా చెప్పి శైత్యగుణము వ్యంగ్యముగా చెప్పబడినది.

గ్రామనాయకుల శిక్షణ

డా. రాం. కె. వేపా, ఐ ఏ ఎస్.

రాష్ట్రంలోని పది జిల్లాలనుండి ఎన్నిక చేసిన యాభైమంది వ్యక్తులకు మూడు వారాలపాటు హైదరాబాదులో ఏర్పాటు చేసిన శిక్షణజనవరి 8వ తేదీతోముగిసింది. దీనిలో ఒక ప్రత్యేకత వుంది. అంటే యిలాంటివి యింతకుముందు జరగలేదని కాదు అప్పుడప్పుడూ జరుగుతూనే వచ్చాయి. నిజానికి యీ శిక్షణ ఏర్పాటు చేయబడిన ఇ ఎమ్ ఇ. కేంద్రం యింతకు పూర్వం యీలాంటి పనులకు ఎప్పుడూ ఉపయోగించబడలేదు అందువల్లనే దీనికి యింత ప్రాముఖ్యం ఉందనుకోవడానికి కూడా వీల్లేదు. అసలు ఉన్న ప్రత్యేకత అంతా యీ శిబిరంయొక్క లక్ష్యంలోనూ, దీనిని ఏర్పాటు చేయడంలోని ప్రోత్సాహంలోనూ ఉన్నది.

శిక్షితులకు ఉద్దేశించబడిన శిక్షణ స్వరూప స్వభావాల్ని చూస్తేనూ, శిక్షణ గరిపిన విధానాన్ని పరిశీలిస్తేనూ యీశిక్షణ లక్ష్యమూ, యిందులోని ప్రోత్సాహమూ స్పష్టంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. గ్రామనాయకులకు సర్వం తెలిసిఉండాలని పదిమంది ప్రముఖుల్ని పిలిచి, వాళ్ళచేత ప్రసంగాలు యిప్పించి, వాళ్ళకు అర్థమయినా, కాకున్నా వాళ్ళ నెత్తిన రుద్దాలనుకునే యీనాటి చిరపరిచిత పద్ధతిలో యీ శిక్షణ గరపడం జరగనేలేదు అదే దీని ప్రత్యేకత అసలు యీశిక్షణ కార్యక్రమం తెల్లవారుఝామున ఆరున్నరకే ఆరంభమవుతుంది మంచి శరీరదార్ఢ్యంకలిగివుండడానికిగాను శిక్షితులకు ఆరున్నరనించి నలభై నిమిషాలపాటు వ్యాయామ సంబంధమైన శిక్షణ యిస్తారు ఉదయం, భోజనం చేశాక, 45 నిమిషాలపాటు డ్రిల్లువుంటుంది. ఆ తర్వాత అసలు బోధన కార్యక్రమం ఆరంభమౌతుంది. రైఫిల్ వాడకంతోపాటు సాంప్రదాయక ఆయుధాల వాడకం, యుద్ధరంగంలో వాటి ఉపయోగాలు, వినియోగించవలసిన - తీరు మొదలైన విషయాలన్నిటినీ తెలియజేసేందుకు 90 నిమిషాల క్లాసు వుంటుంది తర్వాత, యీ కార్యక్రమంలో శిక్షణ యివ్వడానికై ఉద్దేశించబడిన నాలుగు సబ్జెక్టుల్లోనూ ఒక సబ్జెక్టు చెప్పేందుకుగాను 90 నిమిషాలు కేటాయించారు ప్రస్తుత విషయాలు, ఉత్పత్తి, సాంకేతిక శిక్షణ, పౌర రక్షణ— యివి యిక్కడ చెప్పడానికి ఉద్దేశించబడిన నాలుగు సబ్జెక్టులు మధ్యాహ్నభోజనం, ఆ తర్వాత కొద్దిసేపు విశ్రాంతి, ఆపైన పై నాలుగింటిలో ఇంకొక సబ్జెక్టు నిమిత్తం మరొక 90 నిమిషాల్ని కేటాయించారు ఆ తర్వాత ఆటలు రాత్రి 7 గంటలకు భోజనం ఆఖర్లో నిద్ర పోయేముందువరకు అంటే రాత్రి తొమ్మిదింటివరకూ ఏదోఒక విషయంమీద చర్చ జరపడమో, లేదా సినిమా ఏర్పాటు చేయడమో వుంటుంది – ఇదీ స్థూలంగా యిక్కడి కార్యక్రమం.

ఈ శిక్షణ అనేక రకాలుగా ప్రత్యేకతను కలిగివుంది ఇది ఒక మిలటరీ కేంద్రంలో ఏర్పాటు చేయబడింది పెద్దపెద్ద సైనికాధికారుల ప్రోత్సాహమూ, ప్రోద్బలమూ వుంది పౌరఅధికారులకు, సైనికాధికారులకు మధ్య పెరుగుతున్న సత్సంబంధాలూ, సాన్నిహిత్యమూ – ముఖ్యంగా ఇటీవలి పరిహద్దు సంఘర్షణ తర్వాత మరింత బలపడిన పద్ధతి – వీటికి ఇదొక తార్కాణం. సుశిక్షిత, సువ్యవస్థిత, సుసంఘటిత జనవాహిని హృదయపూర్వక సహకారం యుద్ధరంగంలోని సైనికులకు లభించడానికి సైనిక బలాలు తీసుకోవలసిన చర్యలూ, ఇవ్వవలసిన ప్రాధాన్యతనూ యీ శిక్షణ సుస్పష్టం చేస్తుంది మధ్యతరగతి వర్గంలో చదువుకున్న కుటుంబాలలో నుండే యీ శిక్షితులను ఎన్నికచేశారు అలాంటి యీ వ్యక్తులు సైనిక క్రమశిక్షణలూ, సైనికాధికారులుఇచ్చే శిక్షణకూ అంగీకరించి రావడం ముఖ్యంగా పేర్కొనతగినది ఇక్కడ బోధించిన విషయాలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో వుంచుకునీ, శిక్షితుల స్థాయిని దృష్టిలో ఉంచుకునీ రూపొందించడం జరిగింది ప్రసంగాలకు సంబంధించిన నోట్సులను రూపొందించి అచ్చొత్తించి, ముందుగానే పంచడంవల్ల శిక్షితులకు నోట్సు వ్రాసుకోవడానికని కాలాన్ని వృధా చేయవలసిన అవసరం లేకుండా పోయింది ఆ కాలాన్ని ప్రయోజనాత్మకమైన చర్చలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది.

శిక్షితులకు ఉద్దేశించబడిన శిక్షణ స్వరూప స్వభావాల్ని చూస్తేనూ, శిక్షణ గరిపిన విధానాన్ని పరిశీలిస్తేనూ యీ శిక్షణ లక్ష్యమూ, యిందులోని ప్రోత్సాహమూ స్పష్టంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి

> ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి పంచాయతీ రాజ్‌శాఖ రాష్ట్ర స్థాయిలో యీ విధమైన కోర్సులను మూడు, నాలుగింటిని నిర్వహించాలని భావిస్తున్నది. ఈ విధంగా యిక్కడ శిక్షణ పొందినవారు సుమారుగా నూటయాభై మంది వుంటారు, వీరంతా తమతమ జిల్లాలలో యీ మాదిరి శిబిరాలను ఏర్పాటు చేస్తారు, ఒక్కొక్కరూ ఏడాదికి అరవై లేదా డెబ్బయ్ మందికి శిక్షణయిస్తే ఆ సంవత్సరాంతానికి శిక్షణపొందినవారు వెయ్యిమంది అవుతారు. గ్రామీణ ప్రాంతాలలో పటిష్ఠమైన వ్యవస్థ ఏర్పడుతుంది. గ్రామాలలో శాంతి పరిరక్షకులుగా వీరు వ్యవహరించగలరు ఇది చాలా ప్రాముఖ్యతగల అంశం.

ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన పంచాయతీరాజ్‌శాఖ రాష్ట్రస్థాయిలో ఈ విధమైన కోర్సులను మూడు, నాలుగింటిని నిర్వహించాలని భావిస్తున్నది ఈ విధంగా ఇక్కడ శిక్షణపొందినవారు సుమారుగా నూటయాభై మంది వుంటారు. వీరంతా తమతమ జిల్లాలలో యీ మాదిరి శిబిరాలను ఏర్పాటు చేస్తారు. ఒక్కొక్కరూ ఏడాదికి అరవై లేదా డెబ్బయిమందికి శిక్షణయిస్తే ఆ సంవత్సరాంతానికి శిక్షణపొందినవారు వెయ్యిమంది అవుతారు గ్రామీణ ప్రాంతాలలో పటిష్ఠమైన వ్యవస్థ ఏర్పడుతుంది. గ్రామాలలో శాంతి పరిరక్షకులుగా వీరు వ్యవహరించగలరు ఇది చాలా ప్రాముఖ్యతగల అంశం గ్రామీణ వాతావరణంతో అక్కడి సమస్యలతో పరిచయమున్నవారందరికీ ఇందులోని సత్యం బోధపడగలదు భారతదేశం గ్రామీణ దేశమని వ్యవహరింపబడుతూ వున్నది గ్రామాలే భారతదేశానికి జీవనాడులు అయితే గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిస్థితి చాలా వెనుకబడిపోయివుంది దానిని పైకి తీసుకురావాలి

ఉద్యోగావకాశాలు

మొత్తంమీద దేశంలో - ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో - జనాభా పెరుగుదల రోజురోజుకూ ఎక్కువ అవుతుండగా ఉద్యోగావకాశాలు మాత్రం తదనుగుణంగా పెరగడంలేదు. అందువల్ల గ్రామీణప్రజలు పట్టణ ప్రాంతాలకు తరలి వెళ్ళిపోతున్నారు పట్టణాలు శీఘ్రంగా పెరగడమైతే పెరుగుతున్నాయిగానీ తగిన వసతులూ, వనరులూ మాత్రం పెరగడంలేదు గ్రామాలలో వుండిపోయినవారికి కూడా ఏళ్ళపొడుగునా ఉపాధి వుండడంలేదు. ఎకరాకు దిగుబడి అలాగే వుండిపోయింది వ్యక్తి ఆదాయంలో పెరుగుదల కనిపించడంలేదు తాము అభివృద్ధి చెందాలనీ, తమ పెట్టుబడులను లాభదాయకం చేసుకోవాలనీ బలమైన కాంక్ష లోపించడం కూడా ఒక కారణం

అయితే ముఖ్యంగా చెప్పుకునే ప్రకృతిసిద్ధమైన కారణాలు ఎంతమాత్రం కారణాలు కావు నిరంతర స్రవంతులై పారే జీవనదులూ, భీకరమృగపాదప సంకీర్ణములై గహ్యదూరములైన అడవులూ, అపార లోహ, ఖనిజ నిక్షిప్తములూ, సారవంతమైన భూములూ ఉన్న భారతదేశం అపారంగా ఉత్పత్తి చేయగల శక్తి సామర్థ్యం కలిగినదే అయితే మానవశక్తి కూడా పెద్దఎత్తున కావాలి మరి ఇన్నివుండినా యీ బృహత్ప్రయత్నానికి పూనుకునేవారు బహు తక్కువే అపారమైన మన మానవశక్తి నిద్రాణమై పడివుంది దానిని మేల్కొలపాలి సాగునీటి కాలువల్ని త్రవ్వడం, నీటిగుంటల్ని బాగుపరచడం, పొలాలలో భూసార పరిరక్షణకు గట్లు కట్టడం, మురుగునీటిని మళ్ళించడం- వీటన్నటికీ మానవశక్తితో ఎంతో చెయ్యవచ్చు ఇలా వరుసగా చెప్పుకుపోవాలంటే ఎన్నయినావున్నాయి మానవశక్తి ప్రయోజనాన్ని గుర్తించి మనిషి ముందుకు రావాలి నిద్రాణమైన ఈశక్తిని జాగరితం చేయాలి సక్రమ మార్గంలోకి మళ్ళించాలి

స్వచ్ఛంద కృషి

నిజానికి, ఈ స్వచ్ఛంద కృషిని సమీకరించడానికే, 1952 లో ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ ప్రోత్సాహకర ఆశీర్వాదాలతో సామాజిక అభివృద్ధి ఉద్యమం ప్రారంభించబడింది. ఢిల్లీలో ప్రాజెక్టుగా చిన్నయెత్తున మొదలయిన ఈ ఉద్యమం త్వరలోనే మొత్తం దేశాన్ని సామాజిక అభివృద్ధి పథకాలతోనూ, జాతీయవిస్తరణ కేంద్రాలతోనూ ఆవరిస్తూ జాతీయఉద్యమంగా వ్యాపించింది ఈ బ్లాకుల్లో - కేంద్రాల్లో - ప్రత్యేకించి ఉద్యమ ప్రారంభ దశలో యెంతో ప్రయోజనకరమైన పని జరిగింది ఒక నూతన సమాజంకొరకు, ఇది గ్రామీణ ప్రజలకు ఒకకొత్త దృక్పధాన్నీ, నూతనోత్సాహాన్నీ కలిగించిది; ప్రభుత్వ సహాయంతో గ్రామీణ అభివృద్ధికి ఇదొక వ్యవస్థను యేర్పరచింది ప్రాథమిక విద్యా, ప్రజారోగ్య రంగాల్లో గణనీయమైన అభివృద్ధి జరిగింది, ఇది మరొక విధంగా సాధ్యం కాకపొయ్యేది ఇది, గ్రామీణప్రాంతానికి ఒక కొత్తవ్యవస్థను - బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని - ఒక కొత్త - చిహ్నాన్ని జీప్ కారును - పరిచయం చేసింది.

వ్యవసాయిక ఉత్పత్తి గ్రామీణ పరిశ్రమలూ, కుటుంబనియంత్రణావంటి కీలక రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించడంలో యీఉద్యమం విఫలమైనదని అంగీకరించకతప్పదు ఈవైఫల్యానికి కారణాలు అనేకం దేశంలోని ఈ మూలనుండి ఆ మూలకు సామాజిక అభివృద్ధి ఫణితి ఒకే తీరుగా ఉండడం ఒకకారణం ఢిల్లీనుండి, రాష్ట్రాల రాజధానులనుండి స్థానిక అవసరా

> అటువంటి నాయకుడు తన అధికారం, కులం ప్రాతిపదికమీద కాక తాను చేయగలిగిన సేవలద్వారా విశ్వాసాన్ని రేకెత్తించాలి. కాలానుగుణ్యంగా అతను అభిజ్ఞుడూ, తెలివికలవాడూ అయిఉండాలి, అతనికి అన్ని విషయాలు తెలిసి ఉండాల్సిన అవసరం లేదు కాని అతని మస్తిష్కం నూతన ఆలోచనలకు ఆహ్వానం పలికేదిగా ఉండాలి. తాను సేవచేస్తున్న ప్రజల అభిమానం, కృతజ్ఞతల రూపంలోనే కాని కేవలం డబ్బురూపంలో అతను బహుకృతినిఆశించరాదు. గాంధీజీ దేశానికిచ్చిన నాయకత్వం అటువంటిది, తన నిర్మాణాత్మక కార్యక్రమంద్వారా గాంధీజీ నిర్మించదలచిన నాయకత్వం అటువంటిది.

లకు అనుగుణంగా కార్యక్రమాన్ని రూపొందించమని ఆదేశాలు పంపినమాట నిజమే. అయితే ఈ ఆదేశాలు సమర్థవంతంగా అమలు జరిగిన విషయం అనుమానాస్పదమైనది.తత్కారణంగా, యేవోకొన్ని ముఖ్యమైన అంశాలమీద దృష్టిని కేంద్రీకరించడానికి బదులు కృషి సహాయం అనేక రంగాలమీదపలుచపలుచగా ప్రసరింపబడ్డది మహిళామండలులు, భజన మందిరాల ప్రారంభానికీ, వ్యవసాయ ఉత్పత్తులపెంపుదలకు ఒకేవిధమైన ప్రాధాన్యత యివ్వబడింది సామాజిక అభివృద్ధి కార్యక్రమం యొక్క ప్రధానమైన లోపం యేమిటంటే అది తన అసలు ఉద్దేశ్యమైన స్వావలంబనానికి విరుద్ధమైన ఫలితాలను యివ్వసాగింది. ప్రభుత్వ కృషిమీదనే ఎక్కువగా ఆధారపడడం జరిగింది ప్రభుత్వకృషికిసమానంగా రావలసినకృషి రాలేదనే చేప్పాలి స్థానికకృషికి 'ప్రోత్సాహం' కావలసింది స్వయంగా కృషిగా తయారయింది అందుచేత సహాయం ఆగిపోవడంతోనే బ్లాకులో అభివృద్ధికృషి ఆగిపోసాగింది, లేక కొన్ని సందర్భాల్లో ఆగిపోయింది; అందులో ఆశ్చర్యంలేదు.

ఈ కార్యక్రమంయొక్క అంతిమశక్తి కేవలం ఆర్థికసహాయంలో లేదనీ, రూపొందించబడే నాయకత్వంమీద అది ఆధారపడి ఉందనీ సామాజిక అభివృద్ధి ఉద్యమం వెల్లడిచేసింది. రాష్ట్రనాయకత్వం స్థాయికి, జిల్లా, బ్లాకు, గ్రామస్థాయిలనుండి నాయకత్వాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతో సామాజిక అభివృద్ధి ఉద్యమానికి అనుబంధంగా 1956లో పంచాయత్‌రాజ్ కార్యక్రమం (ఇప్పుడు దాదాపు మొత్తం దేశంలో వ్యాపించింది) ప్రారంభించబడింది. చాల ప్రాంతాల్లో దురదృష్టవశాన, యీ నాయకత్వ అభివృద్ధి ఆరోగ్యవంతంగా లేదు రాజకీయ పదవి అందించే సేవలకు కాక ఆ పదవి పోషకత్వాన్ని పంచాయత్‌రాజ్ ఆకర్షవంతం చేసిందన్న అనుమానం కలుగుతున్నది చాల సందర్భాల్లో, ఒక సర్పంచ్ లేక సమితి అధ్యక్షుని విజయం అతను గ్రామానికి కాని లేక బ్లాక్ సమాజానికి కాని చేసే సేవలను బట్టి కాక అతను తన రాజకీయ లేక మత వర్గాలకు అందించిన సహాయాన్ని బట్టి బేరీజు వేయబడుతున్నది. స్థానిక నాయకత్వపు మధ్యతరగతి దశలవారికిపంచాయత్ రాజ్ వ్యవస్థకల్పిస్తున్న అద్భుతమైనశిక్షణావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారన్నది అనుమానాస్పదమైన సంగతి

నిజమైన శక్తి

గ్రామ నాయకత్వపు అసలుశక్తి దాని అధికారంలో కాకుండా దాని సేవలో ఉన్నది. అటువంటి నాయకుడు తన అధికారం, కులం ప్రాతిపదికమీద గాక తాను చేయగలిగిన సేవల ద్వారా విశ్వాసాన్ని రేకెత్తించాలి కాలానుగుణంగాఅతను అభిజ్ఞుడూ, తెలివిగలవాడూ అయిఉండాలి అతనికిఅన్ని విషయాలూతెలిసి ఉండాల్సిన అవసరంలేదు, కాని అతని మస్తిష్కం నూతనఆలోచనలకు ఆహ్వానం పలికేదిగా ఉండాలి. తాను సేవచేస్తున్న ప్రజల అభిమానం, కృతజ్ఞతల రూపంలోనే కాని కేవలం డబ్బురూపంలో అతను బహుకృతిని ఆశించరాదు గాంధీజీ దేశానికిచ్చిన నాయకత్వం అటువంటిది, తన నిర్మాణాత్మక కార్యక్రమం ద్వారా గాంధీజీ నిర్మించదలచిన నాయకత్వం అటువంటిది ఒకవేళ ప్రతిబ్లాకులోనూ అటువంటి నాయకత్వం యివ్వగలిగినవాళ్ళు ఒకరిద్దరు ఉంటే, వారికి పదవి ఉన్నా లేకున్నా, వారు పునరుజ్జీవితమైన గ్రామీణ అభివృద్ధి కార్యక్రమానికి కేంద్రస్థానాలు కాగలరు ఈ రోజు, ఒకలక్షమంది ప్రజ లున్న ఒక బ్లాకులో, బహుళమైన ఆమోదాన్ని పొందగలిగినటువంటి ఒకవ్యక్తిని పొందడం గూడా కష్టమైన విషయమే.

ఇంతకుముందు యివ్వబడిన దానికంటే యింకా యెక్కువశ్రద్ధ యివ్వబడవలసిన అంశం యిది, అందువల్ల యిటీవల నిర్వహించబడిన శిక్షణ కార్యక్రమం, పార్టీరహితమార్గంలో అటువంటి గ్రామీణ నాయకత్వాన్ని నిర్మించడంలో ఒక చిన్నపాటి ప్రారంభయత్నంగా ప్రాతినిధ్యం వహిస్తుంది ఆ ప్రయత్న సాఫల్యంలోనే భవిష్యత్తుమీది ఆశ యిమిడిఉంది.

పంచవర్ష ప్రణాళికల క్రింద అటవీశాఖ సాధించిన అభివృద్ధి

మన అడవులమీద పెట్టుబడి

పి. యస్. రావు

ప్రజల జీవనభృతికీ, వారి అభివృద్ధికి భూదేవే ఆధారం గోదావరీ, కృష్ణా శుభ్రజలాలతో తడిసి పునీతమైన సస్యశ్యామలమైన ఆంధ్రప్రదేశ్ దక్షిణధాన్యాగారంగా ప్రసిద్ధి కెక్కిన విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు ఈ సత్యం సర్వజనవిదితమే కృష్ణానదీతీరస్థ భూములు మొదలుకొని గోదావరీ సైకత శ్రేణుల వరకూ పరివ్యాప్తమై తూర్పుకనుమలకు పచ్చటి వలువలుచుట్టి అందచందాలు కూర్చి నల్లమల, లంకామల, శేషాచలం, వెలుగొండ ఆదిగాగలకొండ లన్నిటినీ ఆవర్తించి దట్టమై, సమున్నతమై చీకటులను కురిపించగలవృక్షసంతతితో దుర్భేధ్యమైనకాననము విస్తరిల్లి వున్నదని బహుకొద్దిమందికి మాత్రమే తెలుసును. ఈ అడవుల్లో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్పరిమళకుసుమాలు వికసిస్తున్నాయి ఈ సంపదను యావత్ జాతికీ అందించేందుకు మరింతగా అభివృద్ధిపరచి పంచవలసిన గురుతర బాధ్యత అటవీశాఖది మనతరువాతి తరాలవారికి మనం అందించవలసిన యీ సంపదను సాధ్యమైనంతగా అభివృద్ధిపరచడం మనకర్తవ్యం.

ఈ లక్ష్యసాధనకు పంచవర్ష ప్రణాళికల క్రింద ఒకానొక నిర్దిష్ట కార్యక్రమం రూపొందించబడి అమలుపరచబడుతున్నది.

భూసార పరిరక్షణ, గిరిజన సంక్షేమం, తదితర కార్యక్రమాలు అడవులకు సంబంధించిన పథకాలపై ఈమూడుపంచవర్ష ప్రణాళికలకాలంలోనూ మొత్తం రూ 420 61లక్షలు వెచ్చించడం జరిగింది ఇందులో 40శాతం అంటే సుమారు రూ 150లక్షల వరకూ కేవలం అడవుల్ని పెంచడానికి అడవులు నాశనమై పోతున్న ప్రాంతాలలో అడవులను సంరక్షించడానికి, భూసార పరిరక్షణకు ఖర్చుచేశారు. దీనినిబట్టి ఒకవిషయము మనకు విశదమౌతున్నది ఈనాడు పెరుగుతున్న అవసరాలను దృష్టిలోవుంచుకుని రాష్ట్రంలో కలప ఉత్పత్తిని అభివృద్ధి పరచాలనే యేకైక లక్ష్యానికి అటవీశాఖ ఎంతటి దృఢదీక్షతో అంకితమైవున్నదో తేటతెల్లమౌతున్నది

ఈనాడు చేయవలసిన పని అడవుల్ని విస్తరింప జేయడం ఎక్కడబడితే అక్కడ దేశంలో కొత్త పరిశ్రమలు తలెత్తుతున్నాయి వీటికి అడవులనుంచి ముడిసరకు అవసరమౌతున్నది. పైగా పల్లెల్లో తాటాకు పాకలన్నీ పెంకుటిళ్ళు, భవనాలుగా మారిపోతున్నాయి వెనుకటికన్నా యిప్పుడు వాటికి కలప ఎక్కువ అవసర పడుతున్నది గనుక ఎక్కువ కలప [illegible]గుబడి అయ్యే రకాలను విస్తారంగా నాటాల్సిన అవసరం యీనాడు ఎంతయినా వుంది

1950 నుండి 1965వరకు 28,585 ఎకరాలలో టేకు, 20,479 ఎకరాలలో సరుగుడు, 13435 ఎకరాలలో యూకలిప్టస్, 1,066 ఎకరాలలో చందనం, 16,38 ఎకరాలలో రక్తచందనం, 5,316 ఎకరాలలో వెదురు నాటారు అదిగాక 22,406 ఎకరాలలో తీవ్రతరభూసార పరిరక్షణ చర్యలు తీసుకోవడంద్వారా భూసారాన్ని కాపాడారు

28,585 ఎకరాలలో టేకు అడవిని పెంచడం అంటే కోటీ ఎనభై లక్షల పైచిలుకు టేకుచెట్లని నాటడం అన్నమాట, టేకు అన్ని కలపల్లోకీ అగ్రగణ్యమైనది. ఫర్నీచరుగా ఉపయోగించడానికి యిది బాగా పనికివస్తుంది ఓడలనిర్మాణంలోనూ, రైలు పెట్టెలు, 'శక్తిమాన్' ట్రక్కులు తదితర పరికరాల నిర్మాణంలోనూ దీని ఉపయోగం యింతా అంతాగాదు. మనదేశరక్షణలో దీని ప్రాముఖ్యత చెప్పశక్యం కాదు (చెప్పుకోదగ్గది). మన రాష్ట్రంలో టేకు స్వభావసిద్ధంగా పెరుగుతున్నది గోదావరీ, కృష్ణానదీతీరస్థ భూములు టేకు తోటలతో శోభాయమానములై వెలుగుతున్నాయి. సహజసిద్ధంగా గాక మనిషి పెంచుతున్న టేకు అడవి 28,500 ఎకరాలకు పైగా వుంది ఇది ఎనభై కోట్ల రూపాయల విలువచేస్తుంది.

టేకుపెరిగే వసతులున్నచోట ఎకరాకు టేకుతోట నాటడానికి రూ 300 మాత్రమే అవుతుంది ఇది బాగాపెరిగి పెద్దదైతే దీనివల్ల ఖర్చులన్నీపోను రూ. 28,000 లు లభిస్తాయి అంటే పెట్టుబడిమీద అధమపక్షం 7 శాతం వడ్డీ లభిస్తున్నదన్నమాట.

యూకలిప్టస్ చెట్ల పెంపకం

కాగితం పరిశ్రమకు యూకలిప్టస్ చాలా చక్కటి ముడిసరుకు కాగితానికి పారిశ్రామికంగానూ, వాణిజ్యవిషయంగానూ వున్నదానికన్న ఎక్కువ విలువే వుంది. ఒక దేశంయొక్క సంస్కృతికి కాగితం కొలబద్దవంటిది కాగితం వాడకాన్నిబట్టి ఆ దేశ విజ్ఞానాన్ని లెక్కగట్టవచ్చు. ఈనాడు భారతదేశంలో సగటున 1–2 కిలోల మధ్య కాగితాన్ని వాడుతున్నాం మనం అమెరికా వంటి బాగా అభివృద్ధిచెందిన దేశాల్లో సగటున 200 కిలోలు వాడుతున్నారు. ప్రస్తుత స్థితిగతులు మెరుగ్గా లేకపోయి

నప్పటికీ ఏటా 12½ శాతం చొప్పున కాగితమువాడకం పెరిగే సూచన కనిపిస్తున్నది.

నిజానికి దేశం 1947 లో స్వాతంత్ర్యం పొందిన అనంతరం కాగితపు పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. 1947 లో కాగితము ఉత్పత్తి 1 లక్ష టన్నులుకాగా 1964 లో 5 లక్షల టన్నులకు పెరిగింది. రానున్న పదేళ్ళలో 20 లక్షల టన్నులకు పెరుగుతుంది. యిరవైలక్షల టన్నుల కాగితాన్ని తయారు చేయాలంటే ఇప్పటికన్న నాలుగురెట్లు ఎక్కువగా ముడిసరుకు సరఫరా కావలసివుంది,

అందుచేత యూకలిప్టస్ చెట్ల పెంపకాన్ని యింకా ఎక్కువచేయాలని ఉద్దేశిస్తున్నారు. నాటిన ప్రదేశాలన్నీ ఉపయోగంలోకి వచ్చేస్తుంది. ఈ మూడు ప్రణాళికల్లోనూ యింతవరకు మనం 13,436 ఎకరాలలో యూకలిప్టస్ చెట్లని నాటాం. ఎకరాకు ఖర్చులుపోను 12 వేల రూపాయలు ఆదాయం వస్తుంది. ఒక మూడు వందల రూపాయలు ఎకరాకు ఖర్చుపెడితే చాలు పన్నెండువేల రూపాయలు లాభం అంటే 9 శాతం వడ్డీ లభిస్తున్నట్లు అన్నమాట.

వెదురు బొంగుల పెంపకం

కాగిత పరిశ్రమలో సాంప్రదాయకంగా మనంఉపయోగిస్తున్న ముడిసరుకు వెదురు. మూడు ప్రణాళికల కాలంలోనూ మన రాష్ట్రంలో 5,316 ఎకరాలలో వెదురు తోటలు నాటడం జరిగింది.

కాఫీ తోటలు

భారతదేశంలో ప్రయివేటు రంగం క్రింద కాఫీతోటల పెంపకానికి మొట్టమొదట ఒక పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. ఇది చాలా విజయవంతమైందనే చెప్పాలి. ఈ తోటల వల్ల యింతవరకు 31.20 టన్నుల మేలు రకం కాఫీ గింజలు లభించాయి. ఈ గింజల అమ్మకం గత రెండేళ్ళుగా సాగుతున్నది. దీని వల్ల రాష్ట్రానికి రూ 1.40 లక్షల ఆదాయం లభించింది.



చతుర్థ ప్రణాళిక ముగిసేనాటికి 32_36 లక్షల రూపాయల విలువచేసే 700_800 టన్నుల కాఫీగింజల్ని అమ్మకంచేయడం జరుగుతుందని అంచనా.


మొత్తం 1,000 ఎకరాలలో కాఫీ తోటల్ని పెంచాలని ఉద్దేశించారు. ఇది ఆర్థికంగా చాలా లాభసాటి కాగలదు. ఈ పథకాన్ని 1960_61 లో అమలుపరిచారు. 1961 లో మొదటి కాఫీతోట నాటడం జరిగింది. ఇంతవరకు అయిదు కేంద్రాలలో 862 ఎకరాలలో కాఫీతోటల్ని నాటారు. వచ్చే 1966 నాట్లకాలంలో మరో 250 ఎకరాలలో కాఫీతోటల్ని నాటుతారు.

కాఫీతోటల పెంపకంవల్ల గిరిజనులకు ఉపాధి లభిస్తున్నది. గిరిజన కార్మికులు యీ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. వారి జీవనప్రమాణం క్రమక్రమంగా అభివృద్ధిచెందుతున్నది. ప్రతి ఎకరానికి 50 నుండి 75 మంది కార్మికులను శాశ్వత పద్ధతిని నియమించే ఆలోచనకూడా ఒకటి వుంది.

తమ దొడ్లలో కాఫీతోటల్ని పెంచడానికి ముందుకొచ్చే గిరిజన వ్యవసాయదారులకు ఉచితంగా కాఫీమొలకల్ని అందజేసే పథకాన్ని ఒకదానిని వర్తమాన సంవత్సరంలోనే ప్రవేశపెట్టారు. 1965 లో గిరిజన వ్యవసాయదారులకు ఉచితంగా 12,000 కాఫీ మొక్కల్ని పంచిపెట్టారు. 1966 లో అలాంటివి 25000 లను పంచిపెట్టారు. ముందు ముందు యీ పంపిణీ మరింత ప్రోత్సాహకరంగానూ, శీఘ్రతరంగానూ కొనసాగుతుంది.

విస్తరణాధికారులద్వారా గిరిజన వ్యవసాయదారులకు యీ కాఫీతోటల పెంపకం, వాటి సంరక్షణ విషయాలు తెలియజెప్పడానికి అటవీశాఖ ఉద్దేశించింది. గిరిజన వ్యవసాయదారుడికి కాఫీతోటల పెంపకం ఆసక్తికరంగానూ, లాభదాయకంగానూ వుండి పోడుసాగు సమస్యకు ఒక పరిష్కారం లభించినట్లవుతుంది. అటవీసంపద, భూసారం యింతవరకు ఎందుకూ పనికిరాకుండా పోతున్నవి. పోడు వ్యవసాయంగా కాఫీ తోటల పెంపకం ప్రతిచోట అమలులోకి రావడంతో వ్యర్థమైపోతున్న అటవీసంపద, భూసారం మానవ ప్రయోజనకరంగా, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదకారిగా కాగలదనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

కాఫీతోటలు, నాటిన నాలుగేళ్ళ అనంతరం ఉపయోగంలోకి వస్తాయి. సక్రమంగా



బాగా పెరిగిన టేకు తోటలు

నిర్వహింపబడుతూవున్న కాఫీతోటనుంచి ఏడాదికి పాతికసార్లు గింజలు దిగుబడి అవుతాయి. ఒక ఎకరానికి కాఫీతోట జీవిత కాలంలో 7 టన్నుల గింజల్ని దిగుబడి చేస్తుంది. వీటి విలువ రూ. 31,000 లు వుంటుంది. ఒక ఎకరంలో కాఫీతోటను పెంచి, 30 సంవత్సరాలపాటు దానిని పెంచడానికి సుమారు రూ. 15,000 లు అవసరమౌతాయి. ఒక ఎకరం కాఫీతోటమీద ఖర్చులుపోను రూ 16,000 లాభంవస్తున్నదన్న మాట. అంటే ఏడాదికి సగటున సుమారు రూ. 530 ఆదాయం.

భూసార పరిరక్షణ

భూసార పరిరక్షణ అంటే కొండవాలుల్లో సాధ్యమైనంత నీటిని భూమికి అందజేసి, ఎక్కువ అయిపోయిన నీటిని భూసారానికి ఏమాత్రం నష్టం కలగకుండా తొలగించడం అన్నమాట. భూసార రక్షణవల్ల నీటియొక్క వుపయోగం అధికమౌతుంది. నదులు జన్మించేచోట సాధారణంగా అడవులు నిండివుంటాయిగనుక వాటి ప్రవేశ్య వాగుల ఒరవడికి లోనవుతూ వుంటాయిగనుక యిట్టి ప్రదేశాలలో భూసార పరిరక్షణచర్యల్ని ఎక్కువగా తీసుకోవాలి తొలి ప్రణాళికా కాలంలో అటవీశాఖ భూసార పరిరక్షణచర్యల నిమిత్తం రూ. 52 లక్షల్ని వెచ్చించింది. ద్వితీయ ప్రణాళికా కాలంలో హైదరాబాదులోని సాహిబ్‌నగర్‌లో ఒక భూసార పరిరక్షణ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నదుల గట్లవెంట 920 ఎకరాలలో అడవుల్ని పెంచడం జరిగింది. బోడిగా వున్న కొండలమీద 555 ఎకరాలలో చెట్లను నాటడం జరిగింది. ఈ రంగంలో పరిశోధనలు చేయడానికి అటవీశాఖ ఎక్కువగా వెచ్చించింది. మాచ్ ఖండ్ బేసిన్‌లో భూసార పరిరక్షణకు రూ. 66 లక్షల ఖర్చుతో ఒకపథకాన్నే చేపట్టడం జరిగింది. ఈ పథకం మొత్తం 11,286 ఎకరాలకు వర్తిస్తుంది.

విజయవాడలోని ఇంద్రకీలాద్రి పర్వతవాలు భూసార పరిరక్షణకు ఒక కొత్త ప్రయోగం 1964 లో చేపట్టబడింది, త్వరలోనే యీ కొండమీద వృక్షసంతతి పెరుగగలదు. దానితో వేసవిలో విజయవాడ పౌరులకు రేడియేషన్ బాధతొలగి చల్లగాలులు వీధుల్ని చుట్టుముట్టగలవు.

రోడ్లు, భవనాలు

అడవుల లోపల రోడ్ల నిర్మాణంవల్ల అటవీ సంపదను వెలికి తీసుకురావడానికి, బట్టబయలుచేయడానికీ వీలుకలుగుతున్నది. అడవుల్లో అటవీశాఖ సిబ్బందికి గృహాలను నిర్మించే పనినీ, రోడ్లనువేసేపనినీ అటవీశాఖే స్వయంగా చేపట్టింది. గత మూడు ప్రణాళికల కాలంలోనూ యీ విషయంలో ఎంతో అభివృద్ధి సాధించబడింది. తొలి పంచవర్ష ప్రణాళికలో యిందు నిమిత్తమై రూ. 5.27 లక్షలు ఖర్చుచేయగా ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో రూ. 7.7 లక్షలు ఖర్చయ్యాయి. ఈనాడు అటవీశాఖ ఆధ్వర్యంక్రింద 2,812 మైళ్ళపొడవు రోడ్లు, 1473 భవనాలు వున్నాయి. వీటిలో 168 భవనాలు అటవీ విశ్రాంతి గృహాలు.

కలప వినియోగం

రాష్ట్రంలో యీనాడు ఏటా 70 లక్షల చ. అ. కలప ఉత్పత్తి అవుతున్నది. ఇది ఒక గొప్ప జాతీయ ఆదాయం అనవచ్చు. ఏటా దిగుబడి తగ్గకుండా వుండే విధంగా యీ అడవులను అభివృద్ధి పరచడం జరుగుతున్నది. పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో వుంచుకుని యిక్కడ దొరకుతున్న కలపను గృహావసరాలకు, తదితర అవసరాలకు ఉపయోగించే అవసరాన్ని అంతాగుర్తించారు. టేకుకాని తదితర రకాల కలపలను బాగా ప్రచారం చేయడానికి వీలుగా బాగుచేసి పలకలుగా కోసిన రకాలను మార్కెటు చేసేందుకు అటవీశాఖ కొన్ని చర్యలు తీసుకున్నది. రాజమండ్రిలో ఒక రంపపు మిల్లును ఏర్పాటు చేసింది.



రెడ్ సాండర్స్‌తోట.

అటవీశాఖ కృషి మెరుగు పరిచే చర్యలు

అటవీశాఖను పునర్వ్యవస్థీకరించే చర్యలు తొలిపంచవర్ష ప్రణాళికా కాలంలో తీసుకోవడం జరిగింది ఇందుకుగాను తొలి ప్రణాళికలో రూ 90 వేలు వెచ్చించారు ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో రూ 2 80 లక్షలూ, తృతీయ ప్రణాళికలో రూ 5 లక్షలు ఖర్చు చేయడం జరిగింది నేడు అటవీశాఖ 7 సర్కిలులుగాను, 39 ప్రాంతీయ డివిజన్లుగాను, 180 ప్రాంతీయ రేంజీలుగాను 920 సెక్షన్లుగాను, 2,500 బీట్స్‌గాను విభజించబడినది

గిరిజన సంక్షేమం

అడవుల అభివృద్ధికి సంబంధించిన ఏ కార్యక్రమమైనా గిరిజన సంక్షేమంతో ముడిపడి వుంటుంది. గిరిజనుల నివాస ప్రాంతాలు అరణ్యాలే అన్న విషయం మనం గుర్తించగలిగితే పై విషయం స్పష్టపడుతుంది ప్రణాళికలలో గిరిజనుల సంక్షేమానికి వివిధ పథకాలు చేపట్టడం జరిగింది 1963_64, 1964_65 లో మాచ్‌ఖండ్‌లో పైలట్ ప్రాజెక్టు ఒకటి చేపట్టబడింది. ఇది 10 గ్రామాలను ఆవరిస్తుంది ఆ గ్రామాలలోని గిరిజనుల జీవన ప్రమాణాన్ని మెరుగు పరచడానికి యిది ఉద్దేశించబడింది. ఈ పథకం క్రింద యితర సౌకర్యాలతోపాటు ఎద్దులు, ఎరువులు, విత్తులు గిరిజనులకు ఉచితంగా పంపిణీచేశారు

ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ పథకాన్ని అమలుపరచి తద్వారా సంవత్సరం పొడుగునా గిరిజనులకు ఉపాధి కల్పించబడింది అటవీశాఖ మరికొన్ని పథకాలను అమలుపరచి భద్రాచలం ఏజన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఉద్యోగ సౌకర్యాల్ని కల్పించింది.

వన్యమృగ అభయారణ్యాలు

మన రాష్ట్రంలో పోచారం, ఏటూరు నాగారం, పాకాల, కావల్‌లలో మొత్తం నాలుగు వన్యమృగ అభయారణ్యాలు వున్నాయి ఇవన్నీ స్వతస్సిద్ధమైన అరణ్యాలే ఈ అడవుల్ని అభివృద్ధి పరిచేందుకు తృతీయ ప్రణాళికా కాలంలో రూ 76 000 లు వెచ్చించడం జరిగింది


నెహ్రూ స్మారక జంతుప్రదర్శనశాల

హైదరాబాదు నగరవాసులకు అత్యంత సుందరమైన, స్వభావసిద్ధమైన విహారస్థలం నెహ్రూస్మారక జంతు ప్రదర్శనశాల తృతీయ ప్రణాళికా కాలంలో ఇది నిర్మించబడింది 302 ఎకరాలకు విస్తరించి వున్నదది.

ఈనాడు యిక్కడ 1,100 రకాల జంతువులు, పక్షులు ప్రకృతిసిద్ధమైన పరిసరాలలో ప్రదర్శింప బడుతున్నాయి. బాలలపార్కు, శీతకొలను, రెస్టారెంటు, వ్యూపాయింట్లు, పొదలు, పడవవిహారం యిక్కడ ఏర్పాటు చేయబడ్డాయికూడా.

మూడు పంచవర్ష ప్రణాళికల కాలంలోనూ అడవుల అభివృద్ధికి వెచ్చించిన డబ్బు రాష్ట్రంలోని అడవుల విస్తీర్ణతను గానీ, రాబడినిగానీ దృష్టిలోవుంచుకుని తదనుగుణంగా చేసినదికాదు తృతీయ ప్రణాళికవ్యయం రూ 281 02 లక్షలు. లేదా సంవత్సరానికి రూ 56 20 లక్షలు. అంటె ఈశాఖ వార్షికాదాయంలో 1/8 వంతు అన్నమాట. వార్షికాదాయం 450 లక్షల రూపాయలు ప్రతి ఏటా 70 లక్షల చ అ కలప, 3,30,000 టన్నుల వంట చెరకు, 2 50,000 టన్నుల వెదురు, 40,000 టన్నులబీడీ ఆకులు యింకా జిగురు పళ్ళు, బిరడు, తేనె తదితర వస్తువులు మనకు లభిస్తున్నాయి దీనితో పోల్చిచూస్తే అడవిలో ఎకరానికి కేవలం 34 పైసలు ఖర్చు చేస్తున్నామంటే యిది ఏమాత్రంచాలదు అడవులమీద ఎంత ఎక్కువపెట్టుబడి పెడితే అంత ఎక్కువ లాభం రాష్ట్రానికి వస్తుంది


నిత్యజీవితంలో ఒక్క క్షణంకూడా కలప అవసరంలేకుండా మనం గడపలేం ఉదయం నిద్రలేవడం కర్రమంచం మీద నుంచి, కర్రతలుపు తెరిచి, కర్రమెట్లమీంచి దిగి అవతలకు వెళ్తుంటాం. కుర్చీలో కూర్చుని, డెస్కుమీద ఆని పెన్సిలు తీసుకుని కాగితంమీద వ్రాస్తాం ఇవన్నీ కర్రతో తయారైన వస్తువులే సిగరెట్లు వెలిగిస్తాం కర్రస్థంభాలు మోసుకొచ్చిన టెలిఫోను తీగలు పిలిస్తే వెళ్ళి రిసీవరు ఎత్తి టెలిఫోను వింటాం మనం మన అడవులను పరిరక్షించుకుని, అభివృద్ధి పరచుకుంటేనేతప్ప లేకపోతే యీ విధంగా కలపనుగూర్చి మనం ఘనంగా చెప్పుకోలేం



తెలుగు ప్రజల జీవితాలకు జటాజూటపు చంద్రకాంతులు

భారత దేశంలో లభ్యమవుతున్నట్టి యీ క్రిందిశక్తి ఉత్పాదన వనరులలో దేని నుండి అయినా విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయవచ్చును : బొగ్గు, లిగ్నైట్, జలపాతాలు, యురేనియం, థోరియం, చమురు, స్వాభావిక మరియు పరిశుద్ధవాయువులు. మొత్తం దేశంలోను 50,000 మిలియన్ల టన్నుల బొగ్గునిధులు వాడుకలోనికి వచ్చేటట్టుగా ఉన్నవని అంచనా వేయబడ్డది: యిందులో అధికమైన భాగం బీహారు, పశ్చిమ బెంగాలులోను, స్వల్పమైన భాగాలు అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లలోను ఉన్నవి. ఇవి కాక, మద్రాసు, రాజస్థాన్, గుజరాత్, జమ్మూ – కాశ్మీరు ప్రాంతాల్లో, 2000 మిలియన్ల టన్నుల లిగ్నైటునిధు లున్నట్టు అంచనా వేయబడ్డది.

శక్తిని ఉత్పత్తి చేయడానికి వినియోగించబడే బొగ్గు, చమురు, స్వాభావిక వాయువు, అణు ఇంధనాలతో పోల్చినపుడు, అపారమైన నీటివనరుల ద్వారా ఉత్పత్తి అయ్యేడి జలవిద్యుచ్ఛక్తి గూడ ప్రాధాన్యం కలిగినట్టిదే. దేశంలోని నదులన్నిటి శక్తిని సక్రమమైన పద్ధతిలో అంచనావేసే ప్రయత్నాన్ని కేంద్ర జల మరియు విద్యుచ్ఛక్తి కమిషన్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమిషన్) 1953 లో చేపట్టింది. వీలయ్యే జలవిద్యుత్ కేంద్రాలు పటాల్లో గుర్తించబడ్డాయి: వర్షపాతము తదితరమైన సాంకేతిక విషయాలమీద దొరికిన వివరాలనుబట్టి, నీటిపారుదల, వరదలనివారణ, నౌకాయానము తదితర మినహాయింపుల తరువాత, మొత్తము 41 మిలియన్ల కిలోవాట్ల జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి ఆర్థికంగా సాంకేతికంగా సుసాధ్యమవుతుందని అంచనా వేయబడ్డది.



శ్రీశైలం


కృష్ణానదిమీద, 45 కోట్ల రూపాయల వ్యయంతో ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో 3 మిలియన్ కిలోవాట్ల జలవిద్యుచ్ఛక్తి, ధర్మల్ ఉత్పత్తికి 4000 మిలియన్ల టన్నులబొగ్గు వనరులు ఉన్నవి. హైదరాబాదులోని హుసేన్ సాగర్‌లో 1923 లో ప్రారంభించబడిన ధర్మల్ స్టేషన్ ఆంధ్రప్రదేశ్‌లో అన్నిటికంటె పాతది. ఆంధ్రప్రదేశ్ యేర్పడేంత వరకు తెలంగాణాలో విద్యుచ్ఛక్తి అభివృద్ధి మెట్రపాలిటన్ నగరాలకు మాత్రమే పరిమితం కాబడింది. 1920 లలో – ఆంధ్ర ప్రాంతంలో, పరిమితమైన ప్రాతిపదికమీద విద్యుచ్ఛక్తి అభివృద్ధి ప్రయివేటు కంపెనీల ద్వారా జరిగేది. విశాఖపట్టణం మరియు విజయవాడ ధర్మల్ స్టేషన్ల ప్రారంభంతో 1938 లో విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని ప్రభుత్వం చేపట్టింది.

రాష్ట్రావతరణ తరువాత జలయుగం (హైడ్రోఈరా) ప్రారంభం కావడంతో ఆంధ్రప్రాంతంలో విద్యుచ్ఛక్తి అభివృద్ధి మొదలయినదని చెప్పవచ్చు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం మొదటి యూనిట్ 1955 ఆగస్టులోను, తుంగభద్ర జలవిద్యుత్ కేంద్రం 1957 ప్రథమ భాగంలోను ప్రారంభం కావడంతో మొత్తం ప్రాంతం ఒకే సరఫరామండలం క్రిందికి తీసుకొని రాబడింది. తెలంగాణా ప్రాంతంలో నిజాం సాగర్ జలవిద్యుత్ కేంద్రం 1956 లోను, రామగుండం ధర్మల్ స్టేషన్ 1957 లోను ప్రారంభించ బడినవి.

విద్యుచ్ఛక్తి డిమాండు

ఆంధ్రప్రదేశ్‌లో తృతీయ ప్రణాళిక ప్రారంభాన 180 కి. వా. గానున్న సగటు విద్యుచ్ఛక్తి డిమాండ్ తృతీయ ప్రణాళిక అంతానికి



ప్రాజెక్టు

నిర్మితమయ్యే జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు కాఫర్ డాంకు జనవరి 31 న ప్రారంభోత్సవం చేశారు

500 కి. వా. కు పెరుగుతుందని భావించబడు తున్నది. తృతీయ ప్రణాళిక ప్రారంభాన మొత్తం మన రాష్ట్రంలో లభ్యమవుతున్న విద్యుచ్ఛక్తి 213 మె. వా. 1963_64 వ సంవత్సరంలో 27.2 మె. వా. విద్యుచ్ఛక్తి అదనంగా కల్పించబడింది. యిందులో తుంగభద్రాడామ్ విద్యుచ్ఛక్తి కేంద్రంలోని ఒకసెట్టు ఉత్పాదన శక్తి 9 మె. వా. హైదరాబాద్‌లోని రెండు గ్యాస్ టర్బో సెట్లలో ఒక్కొక్కదాని ఉత్పాదక శక్తి 10 మె. వా. తుంగభద్ర సెట్టులో మన భాగం 7.2 మె. వా. ఈ విధంగా 1964 ఏప్రిల్ ఒకటవ తేదీనాటికి మన రాష్ట్రం లోని ఉత్పాదనశక్తి 240.2 మె. వా. 1964_65 వ సంవత్సరంలో ఒక్కొక్క దానిలో 9 మె. వా. ఉత్పాదన శక్తి ఉన్న మూడు అదనపు యూనిట్లు ఒకటి తుంగ భద్ర డాం వద్ద, మరి రెండు హంపీలో ప్రారంభించబడ్డవి; ఈమూడింటిలోను మన భాగం21.6మె.వా. 30 మె. వా. ఉత్పాదన శక్తిఉన్న నెల్లూరు థర్మల్‌స్టేషన్ కూడ పని ప్రారంభించింది. అందువల్ల 1964_65 వ సంవత్సరంలో అదనంగా చేర్చబడ్డ ఉత్పాదన శక్తి మొత్తం 51.6 మె వా. ఆ విధంగా మొత్తం మనరాష్ట్రం లోని ఉత్పాదనశక్తి 291.8 మె. వా. కు పెరిగిందన్నమాట.

అవసరాలకు సరఫరాకు మధ్య యేర్పడిన అఖాతాన్ని పూడ్చడానికొరకు విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని అధికం చేయాలనే ఉద్దేశ్యంతోను, చేపట్టిన పథకాలను సకాలములో పూర్తిచేయాలన్న అభిప్రాయంతోను తృతీయ ప్రణాళికా కాలంలో విద్యుచ్ఛక్తి కొరకు మొదట కేటాయించబడిన 64941 లక్షల రూపాయలను 7881 లక్షల రూపాయలకు, తిరిగి దానిని 8747.79 లక్షల రూపాయలకు హెచ్చించి అదనంగా డబ్బును అందివ్వడం జరిగింది.

ఏ విధంగానునీటి పారుదల ప్రయోజనాలను తగ్గించకుండానే తక్కువ ధరకు జలవిద్యుచ్ఛక్తిని అభివృద్ధి చేయడానికి శ్రీశైలం ప్రాజెక్టు బ్రహ్మాండమైన అవకాశాలను కల్పించుచున్నది. శ్రీశైలం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలకు మధ్యభాగంలో ఉన్నందువలన వివిధ కేంద్రాలకు ఆర్థికంగా లాభప్రదమయ్యే మార్గంలో విద్యుచ్ఛక్తిని అందించకలుగుతుంది.

శ్రీశైలం ప్రాజెక్టులోని ముఖ్యమైన భాగాలుయివి: (1) కర్నూలు జిల్లాలో, ప్రసిద్ధమైన శ్రీశైలం దేవాలయానికి సమీపాన, కృష్ణా నదీగర్భముమీద 400 అడుగులయెత్తున వంకరలేని ఒక గ్రావిటీ డాం. (2) ఒక్కొక్కటి 110 మె. వా. శక్తిగల 7 యూనిట్లను యేర్పాటుచేయడానికివీలుగా కుడిప్రక్కన ఒకవిదుచ్ఛక్తి కేంద్రం. మొదట నాలుగు యూనిట్లను యేర్పాటుచేస్తారు. (3) నాగార్జునసాగర్ మరియు కడప సబ్‌స్టేషన్లతో అంతర్గత సంబంధాలకొరకు విద్యుచ్ఛక్తిని 11/13.8 కి. వా. నుండి 220 కి. వా. కు హెచ్చించడానికి ఒక ట్రాన్స్ ఫార్మర్ యార్డ్.

ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్ స్టేషన్లతో సహా ప్రాజెక్టు నిర్మాణానికి 46.75 కోట్ల రూ. ఖర్చు కాగలవని అంచనా.

(మిగతా 47 వ పేజీలో)

సమరయోధుడు స్వర్గీయ శాస్త్రి శాంత్యభిలాషకు సజీవ స్మారకచిహ్నం

తాష్కెంట్ ఒడంబడిక

(ఉభయదేశాలమధ్య శాంతిసంస్థాపన, స్నేహసంబంధాల నిమిత్తం, 1966 జనవరి 10వ తేదీన తాష్కెంటులో, స్వర్గీయ శాస్త్రి అత్యున్నత కృషిఫలితంగా భారత-పాకిస్తాన్ దేశాలమధ్య కుదిరిన ఒడంబడిక పూర్తిపాఠం)

భారత ప్రధాని పాకిస్తాన్ అధ్యక్షుడు తాష్కెంట్‌లో సమావేశమై, భారతదేశం పాకిస్తాన్‌ల మధ్య ప్రస్తుతంవున్న సంబంధాలను గురించి చర్చలు జరిపిన పిమ్మట తమ దేశాలమధ్య మామూలుగా, శాంతియుత సంబంధాలను పునరుద్ధరించుకొనడానికి, తమ ప్రజలమధ్య అవగాహననూ, స్నేహ సంబంధాలనూ పెంపొందించడానికి కృషి చేయాలన్న తమ దృఢనిశ్చయాన్ని ఇందులో ప్రకటిస్తున్నారు ఈ లక్ష్యాలను సాధించడం భారతదేశం, పాకిస్తాన్‌లలోని 60 కోట్లమంది ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రధానమని కూడా ఈ ఉభయనాయకులు భావిస్తున్నారు

సమితి ప్రణాళికకు అనుగుణంగా భారత, పాకిస్తాన్‌ల మధ్య ఉత్తమమైత్రీ సంబంధాలను సృష్టించడానికి ఇరుపక్షాలు సర్వ ప్రయత్నాలు జరపాలనికూడా ఉభయ నాయకులు అంగీకరిస్తున్నారు

బలప్రయోగ మార్గాన్ని త్యజించడం, శాంతియుత విధానాలద్వారా వివాదాలను పరిష్కరించుకొనడంవంటి విషయాలలో సమితి ప్రణాళికక్రింద తమకు గల బాధ్యతలను ఉభయనాయకులు పునరుద్ఘాటిస్తున్నారు.

ఉభయ దేశాలమధ్య ఉద్రిక్తతలు కొనసాగడం తమ ప్రాంతంలోను ప్రత్యేకించి భారత ఉపఖండంలోను శాంతి ప్రయోజనాలకు, విశేషించి భారత, పాకిస్తాన్‌ల ప్రయోజనాలకు దోహదకారి కాదని వారు భావిస్తున్నారు ఈ సమ్యక్ దృష్టితోనే కాశ్మీర్ సమస్యపై కూడా చర్చ జరిగింది ఉభయ పక్షాలు తమ తమ వాదనలను వివరించడం జరిగింది

ఫిబ్రవరి 25వ తేదీ దాటకుండా ఉభయ దేశాలు తమతమ సేనలను 1965 ఆగస్టు అయిదవతేదీకి పూర్వం వున్న స్థావరాలకు ఉపసంహరించడం జరగాలని భారతప్రధానీ, పాక్ అధ్యక్షుడు సమ్మతిస్తున్నారు యుద్ధ విరమణ రేఖవెంట యుద్ధవిరమణ ఒప్పందం షరతులను పాటించడం జరగాలనికూడా ఉభయనాయకులు అంగీకరిస్తున్నారు.

అంతరంగిక వ్యవహారాలలో జోక్యాలకు స్వస్తి

ఒకరి అంతరంగిక వ్యవహారాలలో మరొకరు జోక్యం కలిగించుకొనకపోవడం ప్రాతిపదికగా ఉభయదేశాలమధ్య సంబంధాలు వుండాలని భారతప్రధాని, పాకిస్తాన్ అధ్యక్షుడు అంగీకరిస్తున్నారు

పరస్పర వ్యతిరేక ప్రచార నిరోధానికి నిర్ణయం

ఒకదేశానికి వ్యతిరేకంగా మరొక దేశం ప్రచారం జరపకుండా నిరుత్సాహ పరచాలని, ఉభయదేశాలమధ్య స్నేహ సంబంధాలను పెంపొందించే ప్రచారాన్ని ప్రోత్సహించాలని ఉభయ నాయకులు అంగీకరిస్తున్నారు

పూర్వపు స్థాయిలో తిరిగి దౌత్య సంబంధాల ఏర్పాటు

భారతదేశంలోని పాకిస్తాన్ హైకమీషనర్ పాకిస్తాన్‌లోని భారత హైకమీషనర్ తమ తమ స్థానాలకు తిరిగి వెళ్ళాలని ఉభయ దేశాల దౌత్యప్రతినిధులు మామూలుగా పని చేసే పరిస్థితిని పునరుద్ధరించాలని ఉభయ నాయకులు అంగీకరించినారు. దౌత్య ప్రతినిధులపట్ల ప్రవర్తన విషయంలో 1961 నాటి వియన్నా ఒప్పందం నిబంధనలను పాటించడానికి కూడా ఉభయనాయకులు అంగీకరిస్తున్నారు

ఆర్థిక సంబంధాలు

ఇరుదేశాలమధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను, కమ్యూనికేషన్లను పునరుద్ధరించడంతోపాటు సాంస్కృతిక పర్యటనలను ప్రోత్సహించడానికి, రెండు దేశాల మధ్య ప్రస్తుతం వున్న ఒప్పందాలను అమలుచేయడానికి గైకొనవలసినచర్యలపై పరిశీలన జరపడానికికూడా నాయకులు సమ్మతిస్తున్నారు

యుద్ధ ఖైదీల మార్పిడి

యుద్ధ ఖైదీల మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహించడానికి గాను తమతమ అధికారులకు ఆదేశాలను పంపడానికి భారత ప్రధాని పాక్ అధ్యక్షుడు అంగీకరిస్తున్నారు

ఇతర సమస్యలపై చర్చలు

శరణార్థులు, శరణార్థులను వెళ్ళగొట్టడం అక్రమవలసలవంటి సమస్యలపై చర్చలు కొనసాగించడానికి ఉభయనాయకులు అంగీకరించినారు ప్రజలు ఒక దేశంనుంచి మరొక దేశానికి వలసపోవడాన్ని నిరోధించడానికి అనువైన పరిస్థితులను కల్పించడానికి కూడా ఇరువురు నాయకులు అంగీకరిస్తున్నారు. పోరాటకాలంలో జప్తు చేసిన ఆస్తులను తిరిగి అప్పగించే సమస్యపై చర్చలు జరపడానికి కూడా అంగీకరిస్తున్నారు.

తిరిగి సమావేశాలు

ఉభయదేశాలకు సంబంధించిన సమస్యలపై చర్చలకు అగ్రనాయకస్థాయిలోను ఇతర స్థాయిలలోనుకూడా సమావేశాలు కొనసాగించాలని ఉభయ నాయకులు అంగీకరిస్తున్నారు. వివిధ సమస్యలపై గైకొనవలసిన చర్యలను ప్రభుత్వాలకు సూచించడానికై ఉభయదేశాల ప్రతినిధులతో కూడిన సంఘాలను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతనుకూడా ఉభయ నాయకులు గుర్తించినారు.

సోవియట్ రష్యాకు శాస్త్రి, అయూబ్‌ఖాన్‌ల కృతజ్ఞత

సోవియెట్ దేశానికీ, సోవియెట్ ప్రభుత్వానికీ, వ్యక్తిగతంగా ప్రధాని కోసిగిన్‌కూ భారతప్రధానీ, పాక్ అధ్యక్షుడూ కృతజ్ఞత తెలియజేశారు. సంతృప్తికరమైన ఫలితాలకు దారితీసిన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో సోవియెట్ ప్రభుత్వం, ప్రధాని నిర్వహించిన ఉదాత్తమైన, నిర్మాణాత్మకమైన స్నేహపూర్వకమైన పాత్రకు ఉభయ నాయకులు తమ కృతజ్ఞత తెలిపినారు.

ఉజ్బెక్ ప్రభుత్వం ప్రజలు తమకిచ్చిన అఖండ స్వాగతానికి, ఆతిథ్య మర్యాదలకు భారతప్రధానీ, పాక్ అధ్యక్షుడూ తమ కృతజ్ఞతలను తెలిపారు. ✯

(45 వ పేజీ తరువాయి)

శ్రీశైలం ప్రాజెక్టుకు దిగువన 64 మైళ్ళ దూరంలోఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు—త్వరలోనే పూర్తికానున్నది—వద్దఉన్న వనరులనుండి లభ్యం అవుతున్న రాతి మేసనరీతో యీ ప్రాజెక్టు ప్రధాన డాం నిర్మించబడుతుంది. మళ్ళింపు యేర్పాట్లు యీ క్రింది వాటిద్వారా జరుగుతాయి: 2250 చ. అడుగులపొడవు, 30 అ. చుట్టు కొలతగలిగిన ఒక టన్నెల్ ఎడమవైపున; 50 అ. వెడల్పు గలిగిన ఒకమళ్ళింపు ఛానల్ కుడివైపున; యీ రెండింటిద్వారా మొత్తం 30,000 క్యూసెక్కుల నీటిని మళ్ళించడానికి వీలవుతుంది. నదిలోతుగా ప్రవహిస్తున్న రోజుల్లో గూడ నీటిని మళ్ళించి డాం నిర్మాణాన్ని సాధ్యంచేయడానికి ఈ టనెల్ మరియు ఛానల్ అవసరం.

డాం నిర్మాణానికి అవసరమైన మొత్తం మాసనరీ పరిమాణం దాదాపుగా 73 మిలియన్ల క్యూబిక్ అడుగులు. డాం నిర్మాణానికి అవసరమైన ముఖ్యమైన వస్తువుల వివరాలు యీ క్రింది విధంగా ఉన్నాయి:

రబ్బుల్‌రాయి	70 మిలియన్ల	క్యూ. అ.
నగటుకోర్	5	,, ,,
ఇసుక	35	,, ,,
సిమెంట్	3,41,000	టన్నులు
స్కూరి	70,000	టన్నులు

డాం, విద్యుచ్ఛక్తి కేంద్రం తదితరమైన కట్టడాల నిర్మాణాన్ని ఏడు సంవత్సరాలల్లో పూర్తిచేయడానికి కార్యక్రమం తయారు చేయబడింది.

రిజర్వాయర్

డాంకు ఎగువన కృష్ణానది ప్రధాన భాగంలోనికి, దాని ఉపనది తుంగభద్ర వైపు 103 మైళ్ళ పొడవున రిజర్వాయర్ పరివాహప్రదేశం విస్తరిస్తుంది. కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల యందలి 90 గ్రామాలు, మెట్ట, మాగాణి, తోటలకు సంబంధించిన దాదాపు ఒక లక్ష ఎకరాలు రిజర్వాయర్ క్రింద మునిగిపోతాయి. ఈ ముంపువల్ల దాదాపు 10 వేల కుటుంబాల వారికి నష్టం కలుగుతుందని అంచనా. వీరికి యెటువంటి యిబ్బంది కలుగకుండా పునరావాసం కల్పించడానికి, నష్టపరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం, ప్రాజెక్టు అధికారులు తగిన చర్యల్ని తీసుకుంటున్నారు.

ఇది ప్రధానంగా జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు అయినప్పటికిని, నాగార్జునసాగర్, శ్రీశైలం అందలి రిజర్వాయర్‌ల సమీకృత నిర్వహణవల్ల కొన్ని సంవత్సరాల వరకు పరోక్షంగా కొన్ని నీటి పారుదల సౌకర్యాలుగూడ లభ్యంకాగలవు. నాగార్జున సాగర్ ఆయకట్టు, కృష్ణాడెల్టాలో రెండవ పంట క్రింద దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాలను సాగుచేయడానికి మధ్యంతర కాలంలో వీలు కాగలదు. తత్ఫలితంగా సంవత్సరానికి 2,50,000 టన్నుల బియ్యం అదనంగా ఉత్పత్తికాగలవు. దేశం క్లిష్టమైన ఆహార కొరతను యెదుర్కొంటున్న యీ సమయంలో యీ అదనపు ఉత్పత్తి యెంతో ఆహ్వానించదగ్గది. ఒక్క విద్యుచ్ఛక్తి అమ్మకం ద్వారానే యీ ప్రాజెక్టు వల్ల 21 నుండి 23% రాబడి ఉంటుంది.

ప్రాజెక్టు నిర్మాణం

నవభారత నిర్మాత స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ యీ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమానికి 1963 జూలై 24న ప్రారంభోత్సవం చేశారు. అప్పటినుండి, పరిశీలనలు, డిజైనులు, పథకాలు మరియు అనుబంధ కట్టడాల నిర్మాణ కార్యక్రమాల్లో ప్రాజెక్టు ఇంజనీయర్లు గణనీయమైన కృషి జరిపారు. ఈ ప్రాజెక్టు అనేకమైన సమస్యల్ని కల్పిస్తున్నది. నీటిలో కాఫర్‌డాంలను నిర్మించడం అన్నిటికంటె క్లిష్టమైన సమస్య; కృష్ణానది వరదల ఉధృతం బారినుండి యీ కాఫర్‌డాంలను రక్షించడం కూడ క్లిష్టమైన సమస్యే. ఇప్పుడు ఈ పని చురుగ్గా సాగుతున్నది. ఆధునికమైన నిర్మాణవిధానాలను ఉపయోగించడంతోపాటు యిటువంటి బృహత్తర కార్యక్రమాలకొరకు విదేశాలనుండి భారీయంత్రాలను, నిర్మాణ పరికరాలను దిగుమతి చేసుకోవలసి ఉంటుంది.

ప్రస్తుతం విదేశద్రవ్యమారక పరిస్థితి చాల క్లిష్టంగా ఉన్నందువలన విదేశాల నుండి కొత్తయంత్రాలను దిగుమతి చేసుకోవడం సాధ్యంకాదు. అందుచేత రాష్ట్రంలో దొరుకుతున్న అన్ని వనరులను సమీకృత పరచి యీ ప్రాజెక్టు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కాఫర్ డాంలు పూర్తిఅయిన వెంటనే పొంగివచ్చే వరదల నుండి అవి సురక్షితంగా బయటపడ్డ తరువాత, వర్షాకాలం గడచిపోయిన పిమ్మట, ఛానల్‌లోని లోతు ప్రదేశంలో ప్రధాన డాం పునాదులు త్రవ్వడం, నిర్మాణ కార్యక్రమం సాధ్యంకాగలవు. ఇంతవరకు యీ ప్రాజెక్టు మీద ఖర్చుచేసిన డబ్బు 857.26 లక్షల రూపాయలు. ట్రాన్స్‌మిషన్‌లైన్లు, సబ్‌స్టేషన్లతో కలుపుకొని యీ ఆర్థిక సంవత్సరాంతానికి 1105.70 లక్షల రూపాయలు ఖర్చుకాగలవని భావించ బడుతున్నది. ✯

Statement About Ownership and Other Particulars about Newspaper (Andhra Pradesh) to be Published in the First Issue Every Year after Last Day of February

Form IV
(see rule 8)

Place of Publication		*Hyderabad*
Periodicity of Publication		*Monthly*
* Printer's Name		*A. Sudhakara Rao* *"Yuva Press"*
Nationality		*Indian*
Address		*5-9-88 Public Garden Road, Hyderabad*
Publisher's Name		*T. Ramachandra Rao*
Nationality		*Indian*
Address		*Director of Information and Public Relations, Hyderabad and ex-officio Deputy Secretary to Govt., G.A.D.*
Editor's Name	...	*T. Ramachandra Rao*
Nationality	...	*Indian*
Address		*Director of Information and Public Relations, Hyderabad and ex-officio Deputy Secretary to Govt , G.A.D.*
Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital.		—


I, T. Ramachandra Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

T. Ramachandra Rao

Signature of the Publisher

* The Director of Govt. Printing, A. P., is the official printer but he may name any other printer when the Government Press cannot undertake the printing of this Journal

Edited and Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad
Printed at Yuva Press, Public Garden Road, Hyderabad.



Regd. No. H. 133

